# మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..





HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 114 • పేజీలు:12+16 • వెల: రూ.5 | సోమవారం • 26-3-2018 | www.manamnews.com | /manamnews




## అంబానీ పెళ్లికొడుకాయెనే!

- ఈ ఏడాది చివర్లో ఆకాశ్ పెళ్లి
- అతిపెద్ద వజ్రాల వ్యాపారి కుమార్తె శ్లోకా మెహతాతో నిశ్చితార్థం
- గోవాలో వైభవంగా సాగిన వేడుక

ముంబై, మార్చి 25:

ఆకాశమంత పందిరి.. భూదేవంత పీట.. తారలే తలంబ్రాలుగా సాగనున్న అంబానీ వారసుడి పెళ్లికి రంగం సిద్ధమైంది. ముకేశ్ అంబానీ పెద్దకొడుకు ఆకాశ్ అంబానీకి.. ప్రపంచంలోనే అతిపెద్దదైన వజ్రాల కంపెనీ రోజీ బ్లూ డైమండ్స్ యజమాని **మిగతా 6లో..**



## 'నమో' యాప్.. డాటా చోరీ!

- అమెరికన్ కంపెనీలకు చేరవేత
- ఫ్రెంచ్ హ్యాకర్ ఎలియట్ అల్డర్సన్
- ప్రధానిపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు

7లో..

# పక్కన చూడండి!

## పింఛన్లకు బృందం ఆమోదం కావాలి

- పొరుగు రాష్ట్రంలో పరిస్థితి అలా ఉంది
- ఇక్కడ అర్హులందరికీ తక్షణం పింఛన్లు
- మంచి పనులు చూసి మెచ్చుకోండి
- మనసున్న ముఖ్యమంత్రి.. కేసీఆర్
- రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర పాలన
- అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు
- నలుగురి పాలన.. ప్రజలు నలుగుతున్నరు
- రాష్ట్రంలో నత్తనడకన పాలన: విపక్షాలు



హైదరాబాద్, మార్చి 25 (మనం ప్రతినిధి):

ఇది నలుగురి పాలన... నలుగురిలో ప్రజలు నలుగుతున్నారని ప్రతిపక్షాలు విమర్శించటం విచారకరమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రమంతా ఒకే విధానాన్ని సీఎం అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు అర్థం చేసుకోవడం లేదన్నారు. శాసనసభలో ఆర్థిక పద్దులపై ఆదివారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. టీడీపీ, సీపీఎం, బీజేపీ, ఎంఐఎం, టీఆర్ఎస్ సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, సున్నం రాజయ్య, కిషన్‌రెడ్డి, ప్రభాకర్, కౌసర్ మెయినుద్దీన్, ఎం. యాదగిరిరెడ్డి చర్చలో పాల్గొన్నారు. సీపీఎం, బీజేపీ, టీడీపీ సభ్యులు పాలన తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ విమర్శలు చేయాలి కానీ ప్రభుత్వాన్ని విమర్శించటమే లక్ష్యంగా ప్రతిపక్షాలు ఉండటం బాధాకరమన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి మెచ్చుకోవాలని మంత్రి ప్రతిపక్షాలకు సూచించారు. సీఎం కేసీఆర్ **మిగతా 6లో..**

## ఇద్దరూ అవుట్



- ఆసీస్ కెప్టెన్, వైస్ కెప్టెన్లపై వేటు
- స్టీవ్ స్మిత్‌పై ఓ మ్యాచ్ నిషేధం
- మ్యాచ్ ఫీజులో 100 శాతం కోత
- ఐపీఎల్‌లో ఇద్దరూ ఆడేది డౌటే
- తాత్కాలిక కెప్టెన్‌గా టిమ్ పైన్
- దుమారం రేపిన బాల్ టాంపరింగ్

జెంటిల్‌మెన్ గేమ్ క్రికెట్ ప్రతిష్టను ఆస్ట్రేలియా మసకబార్చింది. కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో మూడో టెస్ట్‌లో బాల్‌టాంపరింగ్‌కు పాల్పడటం దుమారం రేపింది. మ్యాచ్ గెలవటం కోసం ఆటగాళ్లంతా కలసి కుట్ర చేశామని ఒప్పుకుంది. ఈ వ్యవహారంపై క్రీడాలోకం నివ్వెరపోయింది. ప్రపంచ క్రికెట్‌లో ఇదొక బ్లాక్‌డే అని మాజీలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాల్‌టాంపరింగ్‌కు సూత్రధారి స్టీవ్ స్మిత్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా సారథ్య బాధ్యతల నుంచి తప్పించింది. వైస్ కెప్టెన్ వార్నర్‌కూ ఉద్వాసన పలికింది. ఇక ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) స్మిత్‌పై ఒక టెస్టు మ్యాచ్ నిషేధం విధించింది. మ్యాచ్ ఫీజులో వందశాతం కోతపెట్టింది. బాల్ టాంపరింగ్ చేస్తూ దొరికిపోయిన బెన్‌క్రాఫ్ట్‌కు మూడు డిమెరిట్ పాయింట్లు, 75 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించింది. దేశం పరువుపోగొట్టే పని చేసిన ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుపై ప్రధాని మండిపడ్డారు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న స్మిత్, వార్నర్ ఈ టోర్నీలో ఆడేది సందేహమే.

స్పోర్ట్స్‌లో..

## ఇదీలోకం!




మన ఆంధ్రప్రదేశ్‌కు మీరు కూడా అంతే కదా సార్..!

## మిగేసిన బావి

### బావిలో పడ్డ ఆటో.. తొమ్మిదిమంది జలసమాధి

- మృతుల్లో నలుగురు మహిళలు..
- మిగతా ఐదుగురు చిన్నారులు
- సమీప ఆస్పత్రిలో క్షతగాత్రులు
- ఆటోలో 19 మంది ప్రయాణికులు
- నిజామాబాద్ జిల్లాలో ఘటన
- మిన్నంటిన బంధువుల రోదనలు
- ఓవర్‌లోడ్ వల్లే: పోలీసులు
- నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యం
- రవాణా శాఖపై స్థానికుల ఆగ్రహం



బావిలో పడ్డ ఆటోను వెలికి తీస్తున్న దృశ్యం




సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన సకల ఉద్యోగుల మహాసభలో ఉద్యోగ సంఘాల నేతల అభివాదం

## సీపీఎస్ అంతమవ్వాల్సిందే

### అదే ఉద్యోగుల పంతం

- సీఎం కేసీఆర్.. బోళా శంకరుడు
- కానీ.. భజన బృందంతోనే సమస్య
- స్వర్గంలోని గేట్లు తెరుచుకుంటాయి
- ప్రగతి భవన్ గేట్లు తెరచుకోవు
- 'సకల ఉద్యోగుల మహాసభ'లో ఉద్యోగ సంఘాల నేతల ధ్వజం



హైదరాబాద్‌సిటీ, మార్చి 25 (మనం ప్రతినిధి):

నాడు ఉద్యోగాలు లెక్క చేయకుండా ఉద్యమాలు నిర్మించి తెలంగాణ సాధించుకున్న ఉద్యోగులు మళ్లీ డిమాండ్ల సాధనకు పోరుబాట పట్టాల్సివస్తుందని అనుకోలేదని **మిగతా 6లో..**

## ముహూర్తం

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: దశమి తె.3.43 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పునర్వసు మ.12.53 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.8.24-9.54; దుర్ముహూర్తం: ఉ.11.58-12.46, మ.3.11-4.00; రాహుకాలం: ఉ.7.50-9.21; అమృతఘడియలు: ఉ.10.40-12.10; శుభసమయం: ఉ.6.00-7.00.

**సూర్యోదయం: 6.19**

**సూర్యాస్తమయం: 6.25**

## వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో సోమవారం ఎండ తీవ్రత పెరగుతుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రిపూట గంటకు 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

**గరిష్ఠ ఉష్ణోగ్రత: 39 డిగ్రీలు**

**కనిష్ఠ ఉష్ణోగ్రత: 22 డిగ్రీలు**

**గాలిలో తేమ: 48 శాతం**



## శోభాయమానంగా శోభాయాత్ర

- నగరంలో భారీగా నిర్వహణ
- పోలీసుల పటిష్ట బందోబస్తు
- నవమికి ఇల్లందకుంట ముస్తాబు

హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి):

శ్రీరామనవమి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో **మిగతా 6లో..**





విద్యుత్ దీప కాంతుల్లో వెలిగిపోతున్న భద్రాద్రి రామాలయం

## నేడే రాములోరి పెళ్లి

- ముస్తాబైన భద్రగిరి
- మిథిలా ప్రాంగణంలో..
- అభిజిత్ లగ్నంలో..
- 12 గంటలకు కల్యాణం
- వెల్లువలా భక్తులు



భద్రాచలం, మార్చి 25 (మనం న్యూస్):

భద్రాద్రి రాముని కల్యాణ ఘడియలు రానే వచ్చాయి. జగదానంద తారకుడైన జానకీరాముడి కల్యాణోత్సవానికి భద్రగిరి ముస్తాబైంది. సోమవారం శ్రీసీతారాముల కల్యాణం జరగనుంది. మంగళవారం శ్రీరామ పట్టాభిషేకం వేడుకలు జరగనున్నాయి. వేడుకల నిర్వహణకు **మిగతా 9లో..**

## సముద్రంలో రోబో చేప




బోస్టన్, మార్చి 25: సముద్రంలో అచ్చంగా చేపలా ఈదుకుంటూ వేళ్లే ఈ రోబో పేరు 'సోఫి'.. జలచరాలను దగ్గరి నుంచి పరిశీలించేందుకు శాస్త్రవేత్తలు దీనిని తయారు చేశారు. ఇప్పటికే ఈ తరహా రోబో చేపలను రూపొందించినా వాటికి లేని ప్రత్యేకత సోఫీ సొంతం. అదేంటంటారా..? మిగతా రోబో చేపల నిర్వహణ కాస్త ఖరీదైన వ్యవహారం. అదే సోఫీ విషయంలో ఈ బెంగ లేదు. పైగా దీని ఆకారం చేపలకు చాలా దగ్గరగా ఉంటుంది. వాటిలాగే కదులుతుంది. చేపలు కూడా మన జాతిలోనే ఇదో కొత్తరకం కాబోలని సరిపెట్టుకునేలా ఉంటుం దన్నమాట! ఇంకేముంది చేపలో చేపనై అని పాడుకుంటూ సోఫీ తన పని చక్కబెట్టేస్తుంది. ప్రత్యేకంగా అమర్చిన ఫిష్ ఐ కెమెరాల ద్వారా నీటి అడుగున వాతావరణాన్ని, అరుదైన చేపలను దగ్గరి నుంచి ఫొటోలు వీడి యోలు తీసి పంపిస్తుంది. ఎంఐటీకి చెందిన శాస్త్రవేత్తలు సోఫీని తయారు చేశారు. ఇటీవల ఫిజీలో రెయిన్‌బో రీఫ్‌లో సోఫీని పరీక్షించగా.. 50 ఫీట్ల లోతులో సోఫీ 40 నిమిషాల పాటు విజయవంతంగా గడిపివచ్చిందట!

## జైపూర్ మ్యూజియంలో రోబో గైడ్



జైపూర్, మార్చి 25: మ్యూజియంలోకి అడుగు పెట్టీ పెట్టంగానే ఓ రోబో వచ్చి షేక్ హ్యాండిస్తే.. వెన్నంటే ఉంటూ అక్కడి విశేషాలను వివరించి చెబితే.. సందర్శకులకు ఓ సరికొత్త అనుభూతి కలుగుతుం ది కదా! కాస్త సైన్స్ ఫిక్షన్‌లా అనిపిస్తున్నా మరికొన్ని రోజుల్లో ఇది ఆచరణలోకి రానుంది. ఓ మ్యూజియం డైరెక్టర్‌కు సరిగ్గా ఇదే ఆలోచన వచ్చింది. దాంతో వెంటనే ఈ దిశగా ఏర్పాట్లు ప్రారంభించాడు. తన అవసరాలకు అనుగుణంగా రోబోను తయారుచేయించి తీసుకొచ్చేశాడు. ఈ రోబోను పలకరించేందుకు ఏ విదేశానికో వెళ్లాలి కాబోలని నిరాశ పడక్కర్లేదు. ఎందుకంటే రాజస్థాన్‌లోని జైపూర్ వ్యాక్స్ మ్యూజియానికి వెళితే ఈ అనుభవాన్ని మీ సొంతం చేసుకోవచ్చు. అయితే, దీనికి మరికొన్ని రోజులు ఆగాల్సి ఉంటుంది. ఐదు ఫీట్లకు పైనే ఉన్న ఈ రోబో ఇంగ్లీష్‌లో పలకరిస్తుందట! ప్రస్తుతం దీనికి మ్యూజియంలోని విశేషాలను సందర్శకులకు వివరించే పనిని నేర్పుతున్నారు. అదేలెండి ఫీడింగ్ చేస్తున్నామని మ్యూజియం వ్యవస్థాపకుడు అనూప్ శ్రీవాస్తవ తెలిపారు.

## గాలిని పిండి మంచినీటిగా మార్చేస్తుంది



బోస్టన్, మార్చి 25: పట్టుదలగా ప్రయత్నిస్తే ఇసుకను పిండి నూనెను తీయవచ్చన్న సుభాషితాన్ని ఈ పరికరం నిజం చేసింది. నూనె సంగతేమో కానీ నీటిని మాత్రం వెలికి తీయవచ్చని నిరూపించింది. నీటి చుక్కనేది కనిపించని ఎడారిలో శుభ్రంగా తాగే నీటిని ఉత్పత్తి చేస్తానని చెబుతోంది. భూమి మీద ఎక్కడైనా సరే గాలి ఉండక తప్పదు కదా.. అలాగే అందులో ఎంతో కొంత తేమ శాతమూ ఉంటుందన్న విషయం తెలిసిందే! అదుగో ఆ తేమను ఈ పరికరం ఒడిసిపట్టి తాగు నీరుగా మార్చేస్తుందట! ఎంఐటీకి చెందిన పరిశోధకుల బృందం ఈ పరికరాన్ని తయారుచేసింది. ఇందులో భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త సమీర్ రావు కూడా ఉండడం విశేషం! ఈ పరికరం ఎలా పనిచేస్తుందో చూడాలని అరిజోనా ఎడారి ప్రాంతంలోకి తీసుకెళ్లి పరీక్షించారట.. గాలిలో కేవలం 10 శాతం తేమ ఉన్నా కూడా నీటిని తయారుచేసి చూపించిందీ పరికరం! గాలిలో నుంచి నీటిని తయారుచేసే పరికరాలు కొన్ని ఇప్పటికే మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. అయితే, తాజా పరికరం మాత్రం గాలిలో తేమ శాతం ఎంత తక్కువగా ఉన్నా సరే నీటిని తయారుచేస్తుందని ఎంఐటీ పరిశోధకులు తెలిపారు.

## అంటువ్యాధుల తీవ్రత పెంచే భూతాపం



లండన్, మార్చి 25: రోజురోజుకూ పెరిగిపోతున్న భూతాపం వివిధ రోగాల తీవ్రతనూ పెంచుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనిని గుర్తించేందుకు ఓ ప్రత్యేక విధానాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పరాన్నజీవుల ఆధారంగా మనకు సంక్రమించే రోగాలలో కొన్ని భూతాపం ప్రభావంతో మరింత విజృంభిస్తుండగా.. మరికొన్ని మాత్రం కనుమరుగైపోతున్నాయని ఐర్లాండ్‌లోని ట్రినిటీ కాలేజ్ పరిశోధకులు వెల్లడించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అనుగుణంగా పరాన్నజీవులలో మార్పులు చోటుచేసుకోవడమే దీనికి కారణమని వారు వివరించారు. ఉష్ణోగ్రతలలో పెరుగుదల అంటురోగాల వ్యాప్తిని, తీవ్రతను పెంచుతున్నది నిజమేనని టొరంటో యూనివర్సిటీ ప్రొఫెసర్ పెపిజ్న్ లూజిక్స్ కూడా పేర్కొన్నారు. భూతాపం పెరిగిన కొద్దీ మరింత విజృంభించే అంటువ్యాధులను గుర్తించాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. ఈ నేపథ్యంలో తాజాగా అభివృద్ధి చేసిన మెటబాలిక్ థియరీ ఆఫ్ ఎకాలజీ అంటువ్యాధుల వ్యాప్తిని, తీవ్రతను గుర్తించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు.



దుర్గ శంకర్‌మిశ్రా అధికారులతో మాట్లాడుతున్న దృశ్యం

## మహదేవ్‌పూర్‌లో కేంద్ర కార్యదర్శి పర్యటన

మహదేవ్‌పూర్, మార్చి 25(మనం న్యూస్): కేంద్ర గృహ నిర్మాణ ,పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి దుర్గ శంకర్‌మిశ్రా ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. దేశ వ్యాప్తంగా నీతి ఆయోగ్‌చే గుర్తించబడిన 115 జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆయన జిల్లాకు విచ్చేశారు. మహదేవ్‌పూర్ మండల పరిధిలోని కుదురుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందుతున్న పోషకాహారాల గురించి ఆరా తీశారు. అనంతరం మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని సందర్శించారు. ప్రతివార్డును పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించిన పలు అంశాలను ఆసుపత్రి సూపరింటెండంట్ మందల వాసుదేవరెడ్డి ఆయనకు వివరించారు. అనంతరం మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని బట్టి కొట్టులో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట జయశంకర్ జిల్లా కలెక్టర్ ఆమయ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి అప్పయ్య, జిల్లా అటవీ అధికారి రవికిరణ్, ఆర్డీవో వీరబ్రహ్మాచారి, తహసీల్దార్ సాంబమూర్తి, మహదేవ్‌పూర్ సర్పంచ్ కోట రాజబాబు గౌడ్, జడ్పిటీసి హసీనాభానొ, ఎంపీపీ వసంత తదితరులు ఉన్నారు.



దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'తుపాకీ సంస్కృతి'ని తుదముట్టించాలని డిమాండ్ చేస్తూ అమెరికాలోని పెన్సిల్వేనియాలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న పౌరులు

## వైర్లు లేని నగరం.. వారణాసి



వారణాసి, మార్చి 25: ఆ నగరానికి విద్యుత్ సదుపాయం వచ్చి సరిగ్గా 86 ఏళ్లయింది. ఇప్పుడు ఉన్నట్టుండి నగరంలో విద్యుత్ వైర్లన్నింటినీ తీసేస్తున్నారు. స్తంభాలు కూల్చేస్తున్నారు. అదేంటని అనుకుంటున్నారా.. నగరంలో ఉన్న దాదాపు 50 వేళ ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయడానికి వీలుగా 16 చదరపు కిలోమీటర్ల మేర భూగర్భ విద్యుత్‌లైన్లు వేశారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన నగరాలలో ఒకటైన వారణాసిలో ఇరుకాటి సందులు, ఎప్పుడూ రద్దీగా ఉండే మార్కెట్ వీధుల్లో కూడా ఇలా భూగర్భ విద్యుత్‌లైన్లు వేయడం పవర్‌గ్రిడ్ కంపెనీకి కత్తి మీద సామే అయ్యింది. జనాభాపరంగా చూసుకుంటే సియోల్‌తో పాటు కొన్ని టర్కీ నగరాల్లో కూడా ఈ పని చాలా సంక్లిష్టంగా ఉండేదని, కానీ వారణాసిలో మాత్రం తమకు చుక్కలు కనిపించాయని పవ ర్‌గ్రిడ్ ప్రాజెక్ట్ మేనేజర్ సుధా కర్ గుప్తా తెలిపారు. మొత్తం నగరంలో కేబుల్స్ వేయడానికి రెండేళ్ల సమయం పట్టింది. వారణాసి నగరానికి ఐపీడీఎస్ కింద భూగర్భ కేబుళ్ల కోసం రూ. 432 కోట్లతో పనులు చేపడుతున్నట్లు కేంద్ర విద్యుత్ శాఖ మాజీమంత్రి పియూష్ గోయల్ 2015 జూన్ నెలలో ప్రక టించారు. ముందుగా కబీర్‌నగర్, అన్సారాబాద్ లలో పైలట్ ప్రాజెక్టు చేపట్టారు. 2015 డిసెం బరు నెలలో పని ప్రారంభించగా, గోయల్ తరచు వచ్చి ఇక్కడ పనులు ఎలా అవుతున్నాయో పరిశీలించేవారు.

# విధానాలు మారాల్సిందే

### ప్రత్యామ్నాయ విధానాలే శరణ్యం.. వాటితోనే సాగు సంక్షోభం గట్టెక్కుతుంది

- అప్పుడే రైతన్నలు చల్లగా ఉంటారు
- 'గిట్టుబాటు' లేకుండా పెట్టుబడితో ప్రయోజనముండదు
- ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి విజూ కృష్ణన్
- ప్రత్యామ్నాయ వేదికగా బీఎల్ఎఫ్: తమ్మినేని
- రాష్ట్రంలోనే పరిశ్రమల మూసివేత ఎక్కువ: నాగేశ్వర్

హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): దేశంలో వ్యవసాయరంగం సంక్షోభం నుంచి గట్టెక్కాలన్నా, రైతన్నలు సల్లగుండాలన్నా ప్రత్యామ్నాయ విధానాలే శరణ్యమని అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాపై సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెమినార్ నిర్వహించారు. సీపీఎం 22వ జాతీయ మహాసభల నేపథ్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌లో వ్యవసాయం, పారిశ్రామిక విధానాలు-పట్టణీకరణ, విద్య, వైద్యం, దళిత, గిరిజన, మైనారిటీ, ఎంబీసీల సంక్షేమం, యువత-మహిళలు తదితర అంశాలపై ఆయా రంగాల్లో అనుభవజ్ఞులు, ప్రొఫెసర్లు ఉపన్యాసాలివ్వగా, సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా బీఎల్ఎఫ్‌ను నిలుపుతామన్నారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బీఎల్ఎఫ్ అభ్యర్థులు పోటి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, తదితరులు ప్రసంగించారు.

**'పెట్టుబడి'తో ప్రయోజనం లేదు: విజూ కృష్ణన్**

నూతన సరళీకృత ఆర్థిక విధానాలొచ్చాక వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని విజూ కృష్ణన్ పేర్కొన్నారు. ఈ ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ఏఐకేఎస్ రైతాంగాన్ని హెచ్చరించిందని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉద్యమించటం ద్వారా అటు రైతుల్ని, ఇటు వ్యవసాయ కార్మికుల్ని రక్షించాలంటూ ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నిర్ణయించాయన్నారు. ప్రస్తుతం భూ సంస్కరణలనేవి ప్రధాన సమస్యగా ఉన్నాయని, ఈ సంస్కరణలు



సక్రమంగా అమలు కాకపోవడం వల్ల ఎన్నో ఏండ్ల నుంచి భూమి సాగు చేసుకుంటున్న దళితులు, గిరిజనులకు న్యాయం జరగడంలేదన్నారు. మరోవైపు రైతులకు ఎంతో చేస్తున్నామని చెబుతున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సైతం స్వామినాథన్ కమిటీ, ప్రొఫెసర్ జయతీఘోష్ కమిటీ సిఫారసులను అమలు చేయడంలేదని చెప్పారు. వీటిని అమలు చేయకుండా ఎకరానికి రూ.4 వేలు ఇచ్చినా ప్రయోజనముండదని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 9 నుంచి అన్ని రాష్ట్రాల్లో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.

**ఇంగ్లిష్ మీడియం తప్పనిసరి**

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధించాలని టీమాస్ చైర్మన్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలులో గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. కేరళ అభివృద్ధిలో దూసుకెళ్లడానికి అక్షరాస్యులు అధికంగా ఉండడమే కారణమని చెప్పారు. బాల్య వివాహాల్లో దేశ సగటు కంటే తెలంగాణ సగటు ఎక్కువగా ఉన్నదని ప్రొఫెసర్ నాగేశ్వర్ పేర్కొన్నారు. 18 ఏండ్లలోపు పెండ్లి అవుతున్న బాలికలు తెలంగాణలో చాలా ఎక్కువని అన్నారు. సామాజిక న్యాయం, ఉద్యోగాల కల్పనలోనూ తెలంగాణ వెనకబడి ఉన్నదని, దేశంలో మూతపడ్డ పరిశ్రమల్లో 12శాతం పరిశ్రమలు తెలంగాణలోనివేనని పేర్కొన్నారు. మహిళల ఉపాధి కల్పనకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని సూచించారు.

**దళితుల అభివృద్ధికి మతం అడ్డుగోడ**

దళితుల అభివృద్ధికి మతం అడ్డుగోడగా మారిందని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక మతం ముసుగులో దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# సెప్టెంబర్‌లో ఆర్టీసీ ఈ-బస్సులు

- తొలిదశలో 40, తర్వాత 60 సర్వీసులు
- మంత్రి మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): మేక్ ఇన్ ఇండియా పథకం కింద సెప్టెంబర్ నాటికి హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు ప్రారంభిస్తామని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు అంశంపై పాతూరి సుధాకర్‌రెడ్డి వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... 100 ఏసీ బస్సుల్లో తొలిదశలో 40 బస్సులకు నిర్దేశాలు అందించామన్నారు. రాష్ట్రంలో టీఎస్ ఆర్టీసీ ' ఫేమ్ ఇండియా పథకం' కింద కేంద్రం సహకారంతో 100 ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నదన్నారు. ఇందులో తొలి దశలో 40, రెండో దశలో 60 బస్సులను ప్రవేశపెడతామన్నారు. వీటిని నడపడానికి ఆపరేటింగ్ సంస్థలను టెండర్లు కోరగా 5 సంస్థలు పాల్గొన్నాయన్నారు. సిద్దార్థ్ ఇన్‌ఫ్రా టెక్ అండ్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విడత 40 బస్సులను నడిపే బిడ్ దక్కించుకోగా వారికి బిడ్డర్‌ను అప్పగించినట్టు పేర్కొన్నారు. ఈ ఎలక్ట్రిక్ బస్సును ఒక్కసారి చార్జ్ చేస్తే 4 గంటలపాటు 60 కిలోమీటర్ల వేగంతో 250 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుందన్నారు.

**గ్రేటర్ పరిధిలో సేవలు పెరగాలి..**

ప్రజల అవసరాల దృష్ట్యా గ్రేటర్ పరిధిలోని ఆర్టీసీ సేవలు విస్తరించాలని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆర్టీసీ సికింద్రాబాద్ జోన్‌పై అసెంబ్లీలోని కాన్ఫరెన్స్‌హాల్ 3లో మంత్రి ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ ఎండీ రమణారావుతో పాటు ఎమ్మెల్యేలు వివేకానంద, కృష్ణారావు, అరికేపుడి గాంధీ, సుధీర్ రెడ్డి, కృష్ణా రావు,ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ సమీక్షలో పాల్గొన్నారు. శాసనసభ సమావేశాలకు ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన ఎమ్మెల్యేలు వివేకానంద, కృష్ణారావు, అరికేపుడి గాంధీను తొలుత మంత్రి మహేందర్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేలు పలు ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. కొత్త డిపోల ఏర్పాటు, బస్టాప్‌ల్లో కల్పించాల్సిన వసతులు, బస్టాప్‌ల నిర్వహణ వంటి అంశాలను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. ఏపీతో పాటు ఇతర దూర ప్రాంతాలకు సర్వీసులు పెంచాలని ఎమ్మెల్యేలు కోరగా మంత్రి మహేందర్ రెడ్డి చర్యలకు ఆదేశించారు. ప్రైవేటు బస్సుల వల్ల కూకట్‌పల్లిలో ట్రాఫిక్ సమస్య రాకుండా ఉండేందుకు అవుట్‌రింగ్ రోడ్డు బయటే బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త డిపోల ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టాలని ఎండీ రమణారావును మంత్రి ఆదేశించారు. ఆధునిక బస్సు బేల ఏర్పాటు, మహిళల ప్రత్యేక సర్వీసుల పెంపు అంశాలపై చర్చించారు. ప్రతి స్టాప్ వద్ద బస్సు ఖచ్చితంగా ఆపేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బోర్డు సభ్యులు, ఈడీ ఎంవీ రావు, చీఫ్ మేనేజర్ కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 25 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రజలకు శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించి వారు ఆనందంగా ఉండేలా చూడాలని సీతారాములను ముఖ్యమంత్రి కేసీఆర్ వేడుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ సీఎం శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని వారు ఆకాక్షించారు.

## తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు: కవిత

హైదరాబాద్, మార్చి 25 (మనం ప్రతినిధి): ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత రైతులను కోరారు. ఎంపీ కవితను ఆదివారం పలువురు రైతులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 209 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు వరి ధాన్యాన్ని ఈ కేంద్రాల్లో ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేస్తాయని ఎంపీ కవిత వారికి చెప్పారు.

# వలసలు రివర్స్!

- పర్యాటకులతో ఉత్తరాఖండ్ కళకళ
- ట్రెక్కింగ్‌కు పెరుగుతున్న ఆదరణ
- సాధారణ పర్యాటకుల రాక ఎక్కువే
- వసతి.. గైడ్ సదుపాయాలకు గిరాకీ
- స్థానిక యువతకు పెరిగిన ఉపాధి
- హోం స్టే.. ఇంటి భోజనాలకు డిమాండ్
- గైడ్‌లకు రెండు చేతులా సంపాదన







డెహ్రాడూన్, మార్చి 25: నిన్న మొన్నటి వరకు ఉత్తరాఖండ్‌లోని హిమాలయ ప్రాంత యువకులు పని కోసం వేర్వేరు ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతుండేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి బాగా మారింది. పర్యాటకం బాగా పెరగడంతో ఎక్కడెక్కడికో వలసలు వెళ్లినవారు సైతం స్వస్థలాలకు తిరిగి వస్తున్నారు. ప్రధానంగా హిమాలయ ప్రాంతాలకు చాలామంది ట్రెక్కింగ్‌కు రావడానికి ఉత్సాహం చూపిస్తుండటంతో వాళ్లకు గైడ్‌లుగా వ్యవహరించి, ఉండటానికి వసతి చూపించి రెండుచేతులా సంపాదిస్తున్నారు. సలీందర్ సజ్వాన్ గర్వాల్‌లోని ఒక మారుమూల హిమాలయ ప్రాంత గ్రామంలో ఉంటాడు. తొమ్మిదోతరగతి చదువుతూ మధ్యలోనే ఆపేసిన సజ్వాన్.. కొన్నేళ్ల క్రితం వరకు డెహ్రాడూన్ లేదా ఢిల్లీకి పనికోసం వెళ్లిపోయేవాడు. కానీ ఇపుడు బ్రహ్మాండంగా పనిచేసుకుంటున్నాడు. ఇంతకుముందు ట్రెక్‌ల కసం వేరే కంపెనీలకు సాయం చేసేవాడినని, ఇప్పుడు తనకు సొంత వ్యాపారం ఉందని చెబుతున్నాడు. రోజుకు 2వేలు చెల్లిస్తే మంచి టెంటు, స్లీపింగ్ బ్యాగ్‌తో పాటు స్థానికంగా వండిపెట్టే ఇంటి భోజనం దొరుకుతుందని చెబుతున్నాడు. ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ద్వారా క్లయింట్లు అతడికి ముందుగానే అడ్వాన్సు పంపి మరీ బుక్ చేసుకుంటున్నారు. అతడి స్వగ్రామం పంట్వారీ ట్రెక్కింగ్‌కు బేస్ క్యాంప్. 3022 మీటర్ల ఎత్తునుండే నాగ్ టిబ్బా పర్వతానికి ఇదే దారి.

గంగోత్రి లోయ అయితే పర్యాటకుల రాకపోకలు చాలా ఎక్కువగా ఉంటాయి. కానీ యమునోత్రి లోయకు ఇంతవరకు పర్యాటకులు ఎక్కువగా రాలేదు. కానీ మూడు నాలుగేళ్లుగా పరిస్థితి మారింది. రద్దీ ఎక్కువగా ఉండదన్న ఉద్దేశంతో పర్యాటకులు ఈ ప్రాంతానికి బాగానే వస్తున్నారు. ఇది ముస్సోరికి సమీపంలో ఉండటం మరో సానుకూలత. పంట్వారి నుంచి ముస్సోరికి కేవలం మూడు గంటల ప్రయాణమని ఉత్తరకాశీలోని హోటల్ యజమాని, టూరిస్టు గైడు అమోద్ పన్వర్ చెప్పారు. ఇక్కడినుంచి నాగ్ టిబ్బాకు మూడు గంటల ట్రెక్కింగ్ పడుతుందని, ఇంతకుముందు ట్రెకింగ్ చేసేవారు మాత్రమే వచ్చేవారు గానీ ఇప్పుడు అన్నిరకాల పర్యాటకులు వస్తున్నారని చప్పారు. చాలామంది హిమాలయ అందాలు, ఇక్కడి రంగురంగు పక్షులను, మంచుతో కప్పబడిన చెట్లను చూసేందుకు వస్తున్నారని ఆయన చెప్పారు. రోడ్లు బాగుండటం, శీతాకాలంలో కూడా దారి మూసుకుపోకుండా బాగానే ఉండటంతో ఇక్కడకు ఎక్కువగా వస్తున్నారు. అదే ఇతర ప్రాంతాల ట్రెక్కింగులలో అయితే శీతాకాలంలో చాలావరకు పర్వతాల దారులు మూసుకుపోతాయి.

పర్యాటకుల రాక బాగుండటంతో స్థానికులు ఇప్పుడు ట్రెక్కింగ్ వ్యాపారం మొదలుపెట్టారు. టెంట్లు, స్లీపింగ్ బ్యాగులు, గుర్రాలు కొనుక్కోడానికి బ్యాంకులను రుణాలు అడుగుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరాఖండ్‌లో 968 గ్రామాలు ఖాళీగా ఉండేవి, 3.36 లక్షల ఇళ్లు ఎప్పుడూ తాళాలు వేసి ఉండేవి. కానీ ఇప్పుడు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో పరిస్థితి చాలావరకు మారుతోంది. ఇన్నాళ్లూ ట్రెక్కింగ్ నిర్వహణను ఒక మాదిరి కంపెనీలే చూసేవి. కానీ ఇప్పుడు ఈ ప్రాంతాల్లో అణువణువూ తెలిసిన స్థానికులు ఈ రంగంలోకి దిగారు. చెక్క ఫ్లోరింగ్, మట్టి గోడలు ఉండే సాధారణ గుడిసెలలోనే వసతి సౌకర్యం కల్పిస్తూ, అచ్చమైన ఇంటి భోజనం వడ్డించి మరీ ట్రెక్కింగ్‌కు తీసుకెళ్లే వ్యాపారాన్ని అందిస్తూ బల్బీర్ రాణా అనే యువకుడు అందరినీ ఆకర్షిస్తున్నాడు. స్థానికంగా తాము పండించే ఎర్ర బియ్యం చాలా ఆరోగ్యకరమైనదని, వాటికి ఎరువులు కూడా వాడమని అతడు అంటున్నాడు. తాపీపని చేసే జగత్ సింగ్ భండారీ ఇంతకుముందు పనుల కోసం వలస వెళ్లేవాడు. ఇప్పుడు చాలా ఏళ్ల తర్వాత తమ గ్రామంలో మళ్లీ పని దొరికిందని అతడు సంతోషపడుతున్నాడు. పర్యాటకుల రాకతో కొత్తగా ఇళ్లు కట్టుకోవడం, పాతవాటిని బాగు చేయించుకోవడంతో అతడికి పని దొరుకుతోంది. స్థానికంగా చాలా హోంస్టేలు, రిసార్టులు రావడంతో ఇక్కడ పండించే కూరగాయలు, బియ్యానికి డిమాండు పెరిగింది. విషం లేని ఆహారం తినడానికి, మంచి గాలి పీల్చుకోడానికి సిటీ జనం ఇక్కడకు వస్తారని, ఇక్కడి పంటను కొంతమంది కొనుగోలు చేసుకుని కూడా తీసుకెళ్తారని దీపక్ ఉపాధ్యాయ అనే రైతు చెప్పారు. ఇలా ఇప్పుడు ఉత్తరాఖండ్ ఇటు పర్యాటకులు.. అటు స్థానికులతో కళకళలాడుతోంది.

## పశుసంవర్ధకంలో 1,237 పోస్టులు ఖాళీలు

- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి తలసాని



హైదరాబాద్, మార్చి 25 (మనం ప్రతినిధి): తెలంగాణలో పశు సంవర్ధక శాఖలో వివిధ విభాగాల్లో 1,237 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య అడిగిన ప్రశ్నకు పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మార్గదర్శకాల ప్రకారం ప్రతి 5 వేల పశు సంపదకు ఒక ప్రైమరీ వెటర్నరీ క్లినిక్, ప్రతి మూడు వేల పశు సంపదకు ఒక సబ్ సెంటర్ ఉండాలని తెలిపారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఆవులు, ఎద్దులు 48 లక్షల 80 వేల 293, బర్రెలు, దున్నలు 41 లక్షల 60 వేల 419, గొర్రెలు కోటి 28 లక్షల 35 వేల 761, మేకలు 45 లక్షల, 75 వేల, 695 ఉన్నాయన్నారు. ఈ సంఖ్యకు అనుగుణంగా పశువుల ఆసుపత్రులు, సబ్ సెంటర్స్‌ను ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం వెటర్నరీ ఆసుపత్రులు 8, ఏరియా వెటర్నరీ ఆసుపత్రులు 99, ప్రైమరీ క్లీనిక్స్ 909, సబ్ సెంటర్స్ 1101, మొబైల్ క్లీనిక్స్ వంద కలిపి మొత్తం 2218 ఉన్నాయని చెప్పారు. ఇప్పుడున్న ఆసుపత్రులు అన్ని కలిపి కేవలం 88 లక్షల 43 వేల పశువులకు మాత్రమే వైద్యం అందించగలుగుతున్నాయన్నారు. ప్రైమరీ వెటర్నరీ క్లీనిక్స్ అదనంగా 670 అవసరం అవుతాయని చెప్పారు. పశుసంవర్ధక శాఖలో జాయింట్ డైరెక్టర్ స్థాయి పదవి ఒకటి ఖాళీగా ఉందని, అసిస్టెంట్ డైరెక్టర్ల పోస్టులు 23, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 138, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్ పోస్టులు 47, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పోస్టులు 13, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు 261, వెటర్నరీ అసిస్టెంట్లు 754 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

## పీహెచ్‌సీల్లో 2,766 ఖాళీలు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌లో అన్ని పోస్టులు కలిపి 2,766 ఖాళీలు ఉన్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. టీఆర్ఎస్ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో గ్రామీణ హెల్త్ సెంటర్స్ 646, పట్టణ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ 249 ఉన్నాయి. వీటిల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 521, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 7, స్టాఫ్ నర్సులు 760, ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 పోస్టులు 125, ఎంపీహెచ్ఏ(పురుషులు) 1250 పోస్టులు, లోబరేటరీ టెక్నిషిన్స్‌గ్రేడ్-2 పోస్టులు 103 పోస్టులు ఖాళీగాఉన్నాయి. వీటిలో కొన్ని పోస్టుల భర్తీకి ఇప్పటికే సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు.

### ప్రతి బస్తీలో బస్తీ దవాఖానాలు

హైదరాబాద్, మార్చి 25( మనం ప్రతినిధి): రాష్ట్రంలోని అన్ని పురపాలికల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్య మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. ఆదివారం శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యుడు వివేకానంద్, జి.సాయన్న అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. నగరాలు, పట్టణాల్లో బస్తీల్లో ఉండే పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని బస్తీల్లో 45 బస్తీ దవాఖానాలను ప్రారంభించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి వీటిలో 17 బస్తీల్లో దవాఖానాలను ప్రారంభిస్తామని చెప్పారు. మిగిలిన వాటిని కూడా ఇదే సంవత్సరం ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా బోదకాలు బాధితులకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున పింఛన్ ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. టీఆర్ఎస్ సభ్యులు చింతా ప్రభాకర్, సండ్ర వెంకట వీరయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. రాష్ట్రంలో 60 వేల మంది బోదకాలు బాధితులు ఉన్నారని, ముఖ్యంగా పాలేరు నియోజక వర్గంలోనే 3,500 మంది బాధితులు ఉన్నారని, వీరి చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రిలో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయాలని సండ్ర వెంకట వీరయ్య చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ స్కూళ్ల మూసివేతకు కుట్ర

- 40 వేల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు: ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, మార్చి 25 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో 40 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం మాత్రం 8690 పోస్టులను నోటిఫై చేసిందని టీడీపీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆదివారం ఆయన మాట్లాడారు. దశల వారీగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. రెసిడెన్షియల్ స్కూళ్ల కట్టిస్తున్నారు, అందులో తగిన సిబ్బంది, ఉపాధ్యాయులు నియమిస్తున్నారు. కానీ ఎన్నో ప్రభుత్వ పాఠశాలలో సిబ్బంది కొరత ఉందని ఆది కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. 4 వేల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ , 10వేలకు పైగా పీఈటీ, ఉపాధ్యాయ పోస్టులు, వందల సంఖ్యలో లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు మంజూరు చేశారు, కానీ కంప్యూటర్ విద్యను బోధించడానికి ఉపాధ్యాయులు లేరన్నారు. గత నాలుగేళ్లలో ఒక్క సంవత్సరం మాత్రమే బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేశారని, 14 వేల మంది మాత్రమే రుణాలు పొందారని, 1 లక్షా 17 వేల మందికి రుణాలు ఇవ్వలేదన్నారు. దరఖాస్తు పెట్టుకున్నా వాళ్లందరికీ వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. బీసీల గురించి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, ప్రతిసారి వాయిదా సభ వేస్తున్నారని కృష్ణయ్య అన్నారు.

## ఆంగ్లానికే తల్లిదండ్రుల ప్రాధాన్యం


- విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): ఆంగ్లమాధ్యమ విద్యకే తల్లిదండ్రులు ప్రాధాన్యమిస్తుండడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలు అంశంపై కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, పూల రవీందర్ అసెంబ్లీలో వివరణ కోరగా మంత్రి సమాధానమిచ్చారు. ప్రైమరీ సెక్షన్లు లేకపోవడం వల్ల కూడా విద్యార్థుల సంఖ్య తగ్గుతుందన్నారు. నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తేనే ప్రైవేటు పాఠశాలలకు అనుమతులిస్తున్నామన్నారు. అర్హులైన సిబ్బందితో మరిన్ని నైవాసిక పాఠశాలలను ప్రారంభించడం ద్వారా 5వ తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమంలో విద్య అందిస్తామన్నారు. జాతీయ సాఫల్యత సర్వే నిర్వహణ, డిజిటల్ క్లాస్ రూం బోధన నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలో మౌలిక సదుపాయాలు పెంచుతున్నామన్నారు. టీఎస్‌పీఎస్‌సీ ఎంపికల ద్వారా 8792 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

# ‘పెద్దపల్లి’ భూ వివాదాన్ని పరిష్కరించండి

- కాస్తులో ఉన్నవారికే హక్కులు ఇవ్వండి
- అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు



హైదరాబాద్, మార్చి 25: పెద్దపల్లి మండలం కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం గ్రామాల్లో నెలకొన్న ప్రత్యేక భూ వివాదాన్ని వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి మండలం పరిధిలోని కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం గ్రామాలకు చెందిన 462 ఎకరాల భూమి విషయంలో నెలకొన్న వివాదాన్ని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదివారం ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ భూమిలో గ్రామాలు వెలిశాయని, రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని, రోడ్లు, స్కూళ్లు తదితర నిర్మాణాలు కూడా జరిగాయని ఎమ్మెల్యే చెప్పారు. అయితే 1950కి ముందు ఈ భూములన్నీ దేవాదాయ శాఖ పరిధిలోని భూములుగా అధికారిక రికార్డుల్లో నమోదై ఉంది. ఇటీవల జరిగిన భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ఈ గ్రామాల్లో పర్యటించిన అధికారులు కూడా ఎవరు హక్కు దారులనేది తేల్చలేకపోయారు. కాస్తులో ఆయా గ్రామాలకు చెందిన రైతులున్నారు. ఇండ్లు, స్కూళ్లు, ఇతర నిర్మాణాలున్నాయి. కానీ రికార్డుల్లో మాత్రం దేవుడి మాన్యాలుగా నమోదయ్యాయి. దీంతో అధికారులు ఈ వివాదాన్ని అప్పటికప్పుడు పరిష్కరించలేకపోయారు. పార్టు బి కింద చేపట్టడం కోసం పెండింగ్ లో పెట్టారు. దీంతో ఈ గ్రామాల రైతులకు యాజమాన్య హక్కులు రావడం లేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దివాకర్ రెడ్డి సీఎంకు వివరించారు. దశాబ్దాలుగా రైతులు ఈ భూములు సాగు చేసకుంటున్నారని, కాస్తులో వారే ఉన్నారని, యాజమాన్య హక్కులు కల్పించాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని, కాస్తులో ఉన్న రైతులకు హక్కులు కల్పించాలని ఆదేశించారు.

# అర్హులందరికీ ‘రేషన్’

### దరఖాస్తు నిరంతర ప్రక్రియ.. ఎప్పడైనా దరఖాస్తు చేసుకోవచ్చు

- 4 లక్షల బోగస్ కార్డులు రద్దు
- జీహెచ్ఎంసీ పరిధిలోనే ఎక్కువ
- అక్రమార్కులపై క్రిమినల్ కేసులు
- కేంద్రం ఇచ్చేది అంతంతే: ఈటల




హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటి వరకు కొత్తగా 77,100 తెల్ల రేషన్ కార్డులు ఇచ్చినట్లు ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. ఆదివారం నాడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎంఐఎం సభ్యులు ముంతాజ్ అహ్మద్ ఖాన్, బీజేపీ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, టీడీపీ సభ్యుడు సండ్ర వెంకట వీరయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ప్రజల నుంచి లక్షల సంఖ్యలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నా ప్రభుత్వం కొత్త కార్డులు జారీ చేయడంలేదని, మరో వైపు బోగస్ పేరుతో లక్షల సంఖ్యలో కార్డులను తొలగిస్తున్నారని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. కొత్త రేషన్ కార్డులకోసం 2,56,704 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటివరకు 89,723 దరఖాస్తులను పరిశీలించామని, వీటిలో అర్హత ఉన్న 77,100 కొత్త రేషన్‌కార్డులు జారీ చేసినట్లు ఈటల తెలిపారు. 12,623 దరఖాస్తులను తిరస్కరించామని, మరో 1,66,981 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల జీహెచ్ఎంసీ పరిధిలో అత్యధికంగా 4,06,387 బోగస్ రేషన్ కార్డులను రద్దుచేసినట్లు మంత్రి వెల్లడించారు. మంత్రి ప్రకటన పై విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ట్యాక్సీ, ఆటో నడుపుతున్న వారిని, చిన్న సొంత ఇల్లు ఉందన్న కారణంతో కొందరివి, ఇంట్లో కూలర్, ఏసీ, టూ వీలర్ ఉన్నాయని మరికొందరి అర్హులైన వారి రేషన్ కార్డులను అధికారులు రద్దు చేస్తున్నారని విమర్శించారు. రేషన్ డీలర్ల కమిషన్ పెంచాలని, బాకీ ఉన్న కమిషన్ చెల్లించాలని కూడా విపక్ష సభ్యులు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి త్వరలో బాకీలు చెల్లిస్తామని, కమిషన్ పెంచే విషయం పరిశీలిస్తామని హామి ఇచ్చారు.

**అక్రమార్కులపై క్రిమినల్ కేసులు**

కార్డులు తొలగించిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, 10 ఎకరాలకుపై గా భూమి కలిగిన వారు ఉన్నారని చెప్పారు. రేషన్ బియ్య పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుం టున్నామని ఈటల చెప్పారు. అక్రమార్కులపై మొదటి సారిగా 175 క్రిమినల్ కేసులు పెట్టామని, చరిత్రలోనే తొలిసారిగా 8 మందిపై పీడీ యాక్ట్ పెట్టినట్లు చెప్పారు. 3896 మందిపై పిటీ కేసులు పెట్టినట్లు తెలిపారు. అర్హులైన వారు నిరంతరం కార్డులకోసం దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలించి అర్హులకు కార్డులు జారీ చేస్తామని ఈటల హామీ ఇచ్చారు.

### కేంద్రం ఇచ్చే రేషన్ తక్కువ

యూపీఏ ప్రభుత్వం 2013లో ఆహార భద్రతా చట్టాన్ని తీసుకు వచ్చిన సమయంలో రేషన్ జారీకి కొన్ని నిబంధనలు పెట్టిందని ఈటల చెప్పారు. 2015 అక్టోబర్‌లో కేంద్ర చట్టాన్ని మన రాష్ట్రం ఆమోదించి, అమలు చేస్తోందన్నారు. డీలర్ల కమిషన్‌లో కేంద్రం, రాష్ట్రం సగం సగం భరించాల్సి ఉంటుంది. డీలర్లకు కేంద్రం ఇచ్చే 35 పైసలు, రాష్ట్రం ఇచ్చే 15 పైసలు కలిపి 50 పైసలు మాత్రమే వస్తోంది. కేంద్రం గుర్తించిన ప్రకారం రాష్ట్రంలో 1,91,69,600 మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 3 కోట్ల మందికి, అంటే 91,80,000ల కుటుంబాలకు రేషన్ ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వం మనిషికి ఐదు కేజీల చొప్పున 20 కేజీలు మాత్రమే బియ్యం ఇస్తుంది. తెలంగాణ ప్రభుత్వం మనిషికి 6 కేజీల చొప్పున ఎంత మంది కుటుంబ సభ్యులుంటే అంతమందికి రేషన్ ఇస్తోందని మంత్రి వివరించారు. గ్రామాల్లో ఉన్న వారికి 7 ఎకరాల వరకు మెట్ట, 3.5 ఎకరాల వరకు తరి భూమి కలి గిన వారికి కూడా రేషన్ కార్డులు ఇస్తున్నామని చెప్పారు.




## రేపటికి అసెంబ్లీ వాయిదా

- శ్రీరామనవమి సందర్భంగా నేడు సెలవు

హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): రాష్ట్ర శాసనసభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ మధుసూధనాచారి ప్రకటించారు. అసెంబ్లీలో ఆదివారం పలు ఆర్థిక పద్దులపై చర్చ అనంతరం వాటిని ఆమోదించారు. డిమాండ్లపై చర్చ పూర్తైంది. శ్రీరామ నవమి సందర్భంగా సోమవారం అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మంగళవారం బీఏసీ సమావేశం నిర్వహించనున్నారు. అదే రోజున ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదానికి సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. పంచాయతీరాజ్, మున్సిపాల్టీల సవరణ బిల్లుల ఆమోదానికి సభను మరో రెండు రోజులు పొడిగించే అవకాశం ఉంది.

## శాసన మండలిలో ఆరు బిల్లులకు ఆమోదం

హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): శాసన సభలో ఆమోదించిన ఆరు బిల్లులకు శాసన మండలి ఆదివారం ఆమోదం తెలిపింది. ఈ ఆరు బిల్లులను సభ్యులందరూ స్వాగతించారు. తెలంగాణ అసైను చేయబడిన భూముల(బదిలీ నిషేధ) సవరణ బిల్లు, తెలంగాణ వైద్యవృత్తిదారుల రిజిస్ట్రేషన్ (సవరణ) బిల్లు, తెలంగాణక న్యాయవాదుల గుమస్తాల సంక్షేమ నిధి(సవరణ) బిల్లు, తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి(సవరణ) బిల్లు, తెలంగాణ పోలీసు (పోలీసు డైరెక్టర్ జనరల్ ఎంపిక, నియామకపు) బిల్లు, తెలంగాణ పాఠశాలల్లో తెలుగు భాషా బోధన, అధ్యయనం నిర్బంధన చేయు బిల్లులకు మండలి ఆమోదం లభించింది. ఈ బిల్లులను సంబంధిత శాఖ మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. పోలీసు బిల్లును సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టాల్సి ఉండగా ఆయన స్థానంలో పరిశ్రమల, ఐటీ మంత్రి కేటీఆర్ ప్రవేశపెట్టారు.

# ఉద్యోగులపై అడిగితే సభ వాయిదా

- చర్చకు అవకాశమివ్వడంలేదు
- ఖాళీలు భర్తీ చేయాలి: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 25 (మనం ప్రతినిధి): ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల గురించి ప్రశ్న లేవనెత్తిన ప్రతిసారీ శాసనసభను వాయిదా వేస్తున్నారని, ఆ అంశం చర్చకు రానివ్వకుండా టీఆర్ఎస్ సభ్యులు అడ్డుకుంటున్నారని బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి ఆరోపించారు. పీఆర్‌సీ బకాయిలు ఉన్నాయా, ఉంటే ఎందుకు చెల్లించడంలేదు.. అని ప్రశ్నించానని, బకాయిలేలేవని లిఖిత పూర్వకంగా మంత్రి సమాధానమిచ్చారని, కానీ బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆదివారం ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ ఒకే విడతలో లేదా రెండు విడతల్లో ఇవ్వాల్సి ఉంటుందని, కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం 18 విడతల్లో ఇవ్వడమేంటని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్న 5 లక్షల మంది ఉద్యోగులకు పీఆర్‌సీ బకాయిలు 43శాతం అని ప్రకటించారు, కానీ ఫిట్‌మెంట్ బకాయిలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. సెంట్రల్ పెన్షన్ స్కీమ్‌ను ఉద్యోగులు వద్దంటున్నారని, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారని, కానీ ప్రభుత్వం దాన్ని దాట వేసేందుకు కేంద్రంపై నెపం వేస్తుందన్నారు. ఆర్డర్ సర్వ్ పేరిట 1200మంది తెలంగాణ ఉద్యోగులను, ఆంధ్రప్రదేశ్‌కు పంపారని, వారందరనీ ఇక్కడకు రప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌లను ఆరోగ్యశ్రీలో విలీనం చేయకుండా, విడిగానే ఉంచాలని ఆయన సర్కారును కోరారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని, జర్నలిస్టు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్లు కట్టిస్తానని కేసీఆర్ మాట ఇచ్చారని, ఆ హామీ ఇంతవరకు నెరవేరలేదన్నారు. వివిధ శాఖల్లోని 1,10,000ల ఖాళీలను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు.

### ఊకదంపుడు ప్రసంగాలతో సరి: లక్ష్మణ్

అసెంబ్లీ సమావేశాలు ఏకపక్షంగా నడుస్తున్నాయని, ప్రధాన ప్రతిపక్షాన్ని బయటకు పంపి అధికార పార్టీ వారే మాట్లాడుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ప్రజా సమస్యలు చర్చించే అవకాశం లేకుండా, మంత్రుల ఊకదంపుడు ఉపన్యాసాలతో సభను ముగిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అవి చర్చకురాకుండా టీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇది పూర్తిగ ఎన్నికల ప్రచార సభలా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా పాత పెన్షన్ విధానం కావాలంటూ మొత్తుకుంటున్నా, పట్టించుకోకుండా సభను పక్కదోవపట్టిస్తున్నారని విమర్శించారు. శాసనసభలో పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక జీతభత్యాలు అందిస్తానని మాటిచ్చిన కేసీఆర్, ఆ మాటలను కూడా నెరవేర్చక పోవడం దారుణమన్నారు. కేసీఆర్‌ను ప్రజాకోర్టులో దోషిగా నిలబెడుతామన్నారు.

## సింగరేణిలో కాంట్రాక్టు వర్కర్ల క్రమబద్ధీకరణ సాధ్యం కాదు

- రాష్ట్రంలో 3318 ప్రీపెయిడ్ మీటర్లు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థలలో ప్రయోగాత్మకంగా ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకు 3318 మీటర్లను బిగించిచామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు అంశంపై శాసనమండలిలో పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్‌రావు వివరణ కోరగా మంత్రి సమాధానమిచ్చారు. వినియోగదారులు రోజువారీ ప్రాతిపదికన వారి విద్యుత్ వినియోగం, బిల్లు మొత్తాన్ని ఈ విధానంలో పర్యవేక్షించుకోవచ్చన్నారు. సింగరేణి కాలరీస్‌లో ఒప్పంద, పొరుగు సేవల కార్మికులు అంశంపై ఎన్ రామచందర్‌రావు వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... సింగరేణిలో వివిధ పనుల్లో దాదాపు 14,921 మంది ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారన్నారు. కేంద్రం ప్రకటించిన విధానం మేరకు ఎస్‌సీసీఎల్ కనీస వేతనాలను చెల్లిస్తున్నదన్నారు. 1971 కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం కాంట్రాక్టరు వేతనాలను చెల్లించని పక్షంలో ప్రధాన యజమాని అయిన ఎస్‌సీసీఎల్ వేతనాలను చెల్లించాలన్నారు. 1965 బోనస్ చెల్లింపు చట్టం ప్రకారం బోనస్‌ను వేతనంగా పరిగణించనందున ఎస్‌సీసీఎల్ బోనస్ చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. ఎస్‌సీసీఎల్ కొన్ని ప్రధానేతర కార్యకలాపాలను బయటి ఏజెన్సీలకు ఔట్ సోర్సింగ్ చేస్తుందన్నారు.

# పనుల్లో వేగం పెంచండి

- బునియాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి
- కాలువ పనులపై మంత్రి హరీశ్ ఆదేశం



హైదరాబాద్, మార్చి 25: యాదాద్రి భువనగిరి జిల్లాలోని పిల్లాయిపల్లి, దర్మారెడ్డిపల్లి, బునియాదిగానిపల్లి కాలువల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఈ మూడు పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసినందున పనులను మరింత వేగవంతం చేయాలని ఆయన కోరారు. వీటిని జిల్లా అధికార యంత్రాంగం, ఏజెన్సీలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని అన్నారు. ప్రతి గురువారం మూడు కాలువల పనులను సమీక్షించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్‌కు సూచించారు. ఆదివారం మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి అధికారులతో హరీశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు కాలువల పనుల వేగవంతం కోసం ప్రతి 5 కిలోమీటర్ల దూరంలో ఎ.ఇ.ఇ., డి.ఇ.ఇ.లను డిప్యుటేషన్‌పై నియమించాలని ఆదేశించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరనుందని త్వరలోనే నెరవేరనుందని చెప్పారు. పిల్లాయిపల్లి కాలువ ద్వారా భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్ , రామన్నపేట, చిట్యాల, మునుగోడు మండలాల్లో 32 గ్రామాలకు, బునియాదిగానిపల్లి కింద బీబీనగర్, భువనగిరి, వలిగొండ, ఆత్మకూరు, మోత్కూరు, మోటకొండూరు, అడ్డగూడూరు మండలాల్లో 48 గ్రామాలలో రైతులకు సాగునీరందనున్నారు. ధర్మారెడ్డిపల్లి పథకంలో వలిగొండ, రామన్నపేట, చిట్యాల, నార్కట్ పల్లి మండలాల్లో 40 గ్రామాల రైతులకు ప్రయోజనం లభించనున్నట్టు హరీశ్ రావు చెప్పారు. ప్రధాన కాలువను మొత్తం 210 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత,శాసన సభ్యులు వేముల వీరేశం, పి శేఖరరెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర రెడ్డి, భాస్కరరావు, గ్యాదరి కిషోర్, సి.ఇ.సురేష్, ఎస్.ఇ. హమీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**‘మార్కెట్’ చైర్మన్లకు గౌరవ వేతనం**

రాష్ట్రంలో ఇప్పటి వరకు 165 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను నియమించినట్లు సాగునీరు, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు దుర్గం చిన్నయ్య, ఎల్లనమోని అంజయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. సెలక్షన్ గ్రేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు నెలకు రూ.25 వేల గౌరవ వేతనం చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక గ్రేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్లకు నెలకు 20 వేలు, ఇతర గ్రేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్లకు 15వేలు చెల్లిస్తున్నామని చెప్పారు.


### కాళేశ్వరంతో ఇందూరు సస్యశ్యామలం

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కాళేశ్వరం పనులను వేగవంతం చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లింకు 7 కు చెందిన 20,21,22 ప్యాకేజీల పనుల పురోగతిని మంత్రులు హరీశ్ రావు, పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం అసెంబ్లీ కమిటీ హాలులో సమీక్షించారు. ఈ పనులన్నీ పూర్తయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కరవు కాటకాలు ఉండవని హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి నిజా మాబాద్ జిల్లాలో శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం, కాళేశ్వరం పనులను వచ్చే నెల 3,4 తేదీల్లో పర్యటించాలని మంత్రి నిర్ణయించారు.

### వాళ్లు వద్దంటే.. వీళ్లు కావాలంటారు: హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ నేతలు సాగునీటి ప్రాజెక్టలను అడ్డుకునేం దుకు కోర్టుల్లో కేసులు వేస్తుంటే, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు నీళ్ల కావాలని ధర్నాలు చేస్తుంటారని సాగునీటి శాఖ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అచ్చంపేట నియోజక వర్గంలో చంద్రసాగర్ కాలువ చేపట్టే అంశంపై వచ్చిన ప్రశ్న సందర్భంగా మంత్రి కాంగ్రెస్ వైఖరిని తప్పుపట్టారు. అచ్చం పేట నియోజక వర్గంలోని చంద్రసాగర్ కాలువను చేపట్టనున్నట్లు హ రీష్ రావు తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల సాగునీటి పథకం కింద 14కి.మీ. పొడవు బ్రాంచి కాలువ విస్తరణ ప్రతిపాదనలో ఉందని చెప్పారు. ఉప్పు నూతల మండలంలో వెయ్యి ఎకరాలు, అచ్చంపేట మండలంలో ఐదు వేల ఎకరాలను దీని ద్వారా సాగునీరు అందుతుందన్నారు. దీని కోసం 86 లక్షల 82 వేలు మంజూరు చేసినట్ల చెప్పారు. నాగర్ కర్నూలు జిల్లాలో కల్వకుర్తి ద్వారా చెరువులు నిం పామని, మార్చిలో అక్కడి చెరువులు మత్తడి పోస్తున్నాయన్నారు. నాగర్ కర్నూలులో మరో 30 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందిస్తామన్నారు.

# మన సాహితి



## పద్యం చచ్చిపోతోంది!

ఒక పద్యం చచ్చిపోతోంది
బాధతో ఎంతగా లుంగలు చుట్టుకుపోతోందది
మొదటి రెండు వాక్యాలు ముందుకు సోలిపోతున్నాయి
మధ్యలోని కొన్ని పాదాలు బాధతో చలనరహితమయ్యాయి
కొన్ని పదాలు రక్తమోడుతున్నాయి
కొన్ని పదాలు ఎండి ఎడారిలా మారాయి
ఏ క్షణమైనా ముక్కలైపోతుందేమోనన్నట్లు
నలిగిన కాగితం
అందులోంచి పొగలేస్తోంది పదాలకు నిప్పంటుకుంది
మరికొన్ని పదాలు మగత నిద్రలో వున్నాయి
దాదాపు అవి మరణించినట్లుగా
ఏ గ్రహింపూ లేనట్లుగా
కొన్ని పదాలు పారిపోవటానికి ప్రయత్నిస్తున్నాయి
కానీ కాగితపు సరిహద్దుల్నే దాటలేకపోతున్నాయి
తమను తాము పొడుచుకుని
రక్తమోడుతూ స్పర్శ లేకుండా పడివున్నాయి కొన్ని
ఆ చివరి వాక్యం నెత్తుటి వర్షంలో తడిసిపోయి వుంది
అట్లాంటి అశుభకరమైన పద్యం ఎవరు రాసి వుంటారు!?

**- అస్సామీ మూలం : నిలిమ్ కుమార్**
**- ఆంగ్ల అనుసృజన : బిబేకా చౌధురీ**
**- తెలుగు అను సృజన : నిరంతర**

**('వంతెన' తెలుగు సామాజిక వారధి కవిత్వ బులిటిన్-1 నుంచి)**

## కేంద్ర సాహిత్య అకాడెమీలోనూ వివక్షే !

కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రతి ఏడాది కొన్ని అవార్డులు ప్రకటిస్తుంది. అందులో యువ సాహిత్య పురష్కారం, కేంద్ర అకాడెమి పురస్కారం... ఇలా పురస్కారాలు అన్ని రాష్ట్రాలకు ప్రకటిస్తుంది. రాష్ట్రం విడిపోయి దాదాపు నాలుగు సంవత్సరాలు అవుతున్నా అకాడెమి మాత్రం తెలుగుకు ఒక్కటే పురస్కారం ఇస్తున్నది. ఒక్క భాషకు ఒక్క అవార్డు అనుకొని ఇన్నిరోజులు సరిపెట్టుకున్నారు. కానీ నేడు వివక్ష ఎక్కువైపోతోంది. భాష ఒక్కటైనా ప్రాంతాలు వేరుగా అయ్యాయి. కావున మన తెలుగు భాషకు రెండు రాష్ట్రాలలో వేరుగా అవార్డ్సు ఇవ్వాల్సిన అవసరం కూడా ఉన్నది. దీనిపై ప్రభుత్వాలు ఆలోచించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది. ప్రాంతాలుగా విడిపోయాం కానీ మేమంతా ఒక్కటే. కాకపోతే అక్కడి యాస అక్కడి సాహిత్యం వేరు, ఇక్కడ వేరు. కావున వెంటనే సాహిత్య అకాడెమి రెండు రాష్ట్రాలకు సాహితీ అవార్డులు ప్రకటించాలి.

**- విరాజిత (నిజాగ్ని),**
సామాజిక విశ్లేషకురాలు

# గద్వాల సంస్థానం సాహిత్య సేవ



హైదరాబాద్ రాజ్యంలో అనేక సంస్థానాలున్నాయి. ఇందులో 14 సంస్థానాలు తెలంగాణలో వున్నాయి. కొన్ని సంస్థానాలు కాకతీయుల కాలంలో, కొన్ని కుతుబ్‌షాహీలకాలంలో, మరికొన్ని ఆసఫ్ జాహీల కాలంలో ఆవిర్భవించాయి. 14వ శతాబ్ది ఆరంభంలోనే తెలంగాణలో సంస్థానాలు నెలకొన్నాయి. తెలంగాణ సంస్థానాల చరిత్ర 14, 15 నుంచి 18వ శతాబ్ది వరకు కొన్ని సంస్థానాలు పాలన సాగించగా మరికొన్ని 1948 సెప్టెంబర్ 17 వరకు పాలన సాగించాయి. ఈ సంస్థానాలలో కొన్ని బహమనీసుల్తానుల కాలంలో మరికొన్ని గోల్కొండ బీజాపూర్ నవాబుల కాలంలోనూ ఇంకొన్ని మొఘల్ పాదుషాల కాలంలోనూ అలాగే నిజాంకాలంలోను ఏర్పడిన సంస్థానాలు మన తెలంగాణలో కనిపిస్తాయి. తెలంగాణలోని సం స్థానాలన్నీ నిజాం సర్కారుకు సామంత రాజ్యాలుగానే ఉండేవి. సంస్థానాధీశులలో స్త్రీలు కూడా ఉండడం మన తెలంగాణ తల్లి వైభవాని కి తార్కాణంగా చెప్పవచ్చు.

నాటికాలంలో తెలుగు సాహిత్యమంతా చక్రవర్తుల వారి సామం తు ల ఆశ్రయం వల్లనే వ్యాప్తి చెందింది. నిజాం రాష్ట్రంలోని ప్రాచీన సంస్థానాలలో గద్వాల సంస్థానం ప్రధానమైనది. ఈ సంస్థానాధీశులు కృతికర్తలుగా పేరొందారు. అంతేకాకుండా వీరు సంస్కృతాంధ్ర కవులను ప్రోత్సహించి, సన్మానించారు. వీరు కళారాధకులుగా ప్రశస్తికెక్కారు. వీరిలో కొం దరు విద్యాలయాలు స్థాపించడం, గ్రంథ ప్రచురణ మండలుల్ని ఏర్పాటు చేసి, భాషోద్ధరణకు పాటుపడ్డారు. పత్రికల్ని స్థాపించారు. అవధాన విద్యకు విశేష ప్రాచుర్యం కల్పించిన ఘనత ఈ సంస్థానాధీశులదేనని చెప్పవచ్చు. గద్వాల సంస్థానం మహబూబ్‌నగర్ జిల్లా లో ఉంది. గద్వాల సంస్థాన మూల పురుషుడైన బుడ్డారెడ్డి కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో (1290) రాయచూరు, అలంపుర, వెజ మొదలగు ఏడు సీమలపై నాడగౌడరికం పొందాడు. అప్పటి నుంచి అతని సంతతివారు 'వెజనాడగౌడు' అని ప్రసిద్ధిగాంచారు. 17వ శతాబ్ది ప్రారంభంలో పెద్ద నృపతి అనే అతడు వెజ, కందనూలు (కర్నూలు) సీమలకు నాడగౌడుగా ఉన్నారు. పూడూరు సీమ నాడగౌడు అయిన వీరారెడ్డి కుమార్తె బక్కాంబిక ను పెండ్లి చేసుకొని ఆ సీమకు కూడా అధిపతి అయ్యాడు. తర్వాత అతని కొడుకు పెదసోమభూపాలుడు (1663–1721) నాడగౌడరికానికి వచ్చా డు. ఇతడే శోభనాద్రి అలియాస్ సోమనాద్రి. ఇతను గద్వాల కోట ని ర్మాత. ఔరంగజేబు చేత 'రాజా' అనే బిరుదు పొందాడు. సోమనాద్రి రా జధానిని రాజోలు నుంచి గద్వాలుకు మార్చాడు. పెద్దన వీరారెడ్డి ఈ సంస్థాన స్థాపకులు ఇంటిపేరు ముష్టిపల్లి, పాకనాటి శాఖకు చెందినవారు. గద్వాల పాలకులలో శ్రీరామ భూపాలుడు (1894–1901) ముఖ్యులు. వీ రి తర్వాత సీతారామ భూపాలుడు (1912–48) తన చతురత, తెలివి తే టలతో గద్వాలకు పూర్వవైభవాన్ని తెచ్చింది. చివరగా ఆదిలక్ష్మీ దేవమ్మ దత్తపుత్రుడు, దౌహిత్రుడైన కృష్ణభూపాల రాజు గద్వాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశాడు.

సాహిత్య పోషణ : గద్వాల సంస్థానంలో కార్తీక, మాఘ మాసాలలో కవిపండితుల్ని సన్మానించేవారు. సంస్థానాధీశుడైన పెద సోమభూపాలు డు స్వయంగా కవి. ఇతనిని జానపద కవలులు నల్ల సోమనాద్రిగా పిలుచుకోవడమే కాకుండా ఇతని పేరుతో వీరగాథను రూపొందించుకున్నారు. పెదసోమ భూపాలుడు జయదేవుని గీతాగోవిందాన్ని ఆంధ్రీకరించాడు. దీనిలోని ఒక శ్లోకం.

గద్వాల సోమన భూపాల మణి ప్రణీతం
పద్మావతీంద్ర జయదేవ కవీంద్రగీతం
రాధామది ప్రథిత మాధవ సూక్తిజాతం
మాదుర్య చాటు ఫణితం జయతు ప్రభాతమ్

వినుకొండ సంస్థానవాసియైన కొడికెలపూడి వీరరాఘవ కవి గద్వాల సంస్థానాన్ని సందర్శించాడు. ఈ సంస్థానంలో ఆశ్రయం పొంది భారతం లోని ఉద్యోగ పర్వాన్ని ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధంగా రచించి పూడూ రు కేశవస్వామికి అంకితమిచ్చాడు. వీరరాఘవ కవి వ్యాఖ్యాన పూర్వకం గా ఆంధ్రీకరించిన ఈ గ్రంథాన్ని శోభనాద్రి అనంతరం రెండువందల సంవత్సరాలకు 1899లో గద్వాల ప్రెస్‌లో ముద్రించారు. గద్వాల సంస్థా న కవి కాణాదము పెద్దన ఆధ్యాత్మరామాయణము, ముకుంద విలాసము, మత్స్యపురాణము, శేషశైలేశలీల, యథాశ్లోక తాత్పర్య రామాయణము (బాలకాండ మాత్రము), రామాయణ చంపు కావ్యాలు రచించెను. సోమనాద్రి మనుమడైన చినసోమభూపాలుడు రతి రహస్యమును రచిం చెను. బోరవెల్లి శేషాచార్యులు యథాశ్లోక తాత్పర్య రామాయణము (యుద్ధకాండం నాలుగు ఆశ్వాసములు) రచించి, గద్వాల చెన్నకేశవస్వామికి అంకితం చేసెను. అయలూరు కందాళయార్యుడు రాసిన అలంకార శిరోభూషణమనే సంస్కృత అలంకార శాస్త్ర గ్రంథాన్ని ప్రసిద్ధ లక్షణ గ్రం థంగా పేర్కొనవచ్చునని తెలుస్తుంది. లయ గ్రాహిగరుడాచలకవి కౌలలే య చరిత్రం రాశాడు. ఈ కవిని గూర్చి మొదట పేర్కొన్నవారు ఆచార్య బి.రామరాజు గద్వాల నివాసియైన ధర్మవరం రామకవి (1780) సోమ భూపాలుని ఆనతితో 'ముకుంద విలాసం' రచించాడు. ఇదే కాలానికి చెందిన వాడాల శేషాచార్యులు మైథిలీ పరిణయం అనే వచనకావ్యం రచించాడు. చిన సోమ భూపాలుని ఆస్థాన కవులు ఆయన కోరిక మేరకు యథాశ్లోక తాత్సర్య రామాయణంలోని వివిధ కాండలను రచించారు. అ లాంటి వారిలో తిరుమల కృష్ణమాచార్యుడు సుందరకాండను 3 ఆశ్వాసాలతో రచించాడు. చతుర్విధ కవితా నిర్వాహకులైన కామసముద్రం అప్పలాచార్యులు కిష్కింధ కాండను 3 ఆశ్వాసాలు గా రచించడమే కాకుండా ఈ రామాయణానికి అవతారికను రచించాడు. అంతేకాకుండా రాజు కోరిక మేరకు జయదేవు ని గీతా గోవిందాన్ని శ్రీకృష్ణలీలా తరంగాణి పేరుతో అనువదించాడు. కొ త్తపల్లి రామాచార్యులు అయోధ్య కాండను 5 ఆశ్వాసాలలో రచించాడు. హోసదుర్గం వేదాంతాచార్యులు శ్రీకృష్ణ బ్రహ్మతంత్రార్యవేద పాద స్తవమ్, ఆచార్యవైభవమ్ మొదలగు సంస్కృత కృతులు రచించాడు. ఈ విధంగా పెదసోమభూపాల, చినసోమభూపాలుర పాలనాకాలంలో స్థానికులు, స్థానికేతరులెందరో ప్రభువుల ఆదరాభిమానాలతో పలుగ్రంథాల్ని రచించి, సంస్థానాధీశుల భక్తి విశేషాలను, సాహిత్య సేవా విశేషాలను ప్రకటిం చారు. గద్వాల రాజులలో సుదీర్ఘకాలం (1845 – 1901) పాలించినవాడు ముష్టిపల్లి రామభూపాలుడు, బ్రిటిష్ వారితో సంబంధాలు ఏర్పడటం, సిపాయిల తిరుగుబాటు జరగడం ఇతని కాలంలోని రెండు విశేషాంశాలుగా చెప్పవచ్చు. ఈయన ఛందోముకురమనే సంస్కృత గ్రంథాన్ని రచించి, 'సాహిత్య విద్యాముకురమ'నే స్వంత ముద్రాక్షరశాలలో 1878 లో ముద్రించెను. ఇతడు 1845లో శ్రీ లక్ష్మి సహస్ర నామ స్తోత్రమును కూడా ఇదే ముద్రణశాలలో ముద్రించారు. రామభూపాలుని పాలనాకాలంలోనే తిరుపతి వేంకటేశ్వరకవులు మొదటిసారిగా గద్వాలకు వచ్చి త మ శతావధానముల చేత విద్యద్గద్వాలను రంజింపజేసినారు. తిరుపతి వేంకటేశ్వరకవులను సభాసదులలో కొందరు బ్రాహ్మణులైన మీకు మీసములేల అని యడుగగా–


దోసమటంచెటింగియును దుందుడు కొప్పగా బెంచినార మీ / మీసము, రెండు బాసలకు మేమె కవీంద్రులమంచు తెల్పగా, / రోసము గల్గినన్ కవివరుల్ మముగెల్వుడు, గెల్తురేని, యా / మీసము దీసి మీ పద సమీపములన్ దలలుంచి మ్రొక్కమే?

అని పద్యము చెప్పి సవాలు చేసినారట. అప్పుడు వీరిని ఎదుర్కొన్నవారిలో శ్రీపురాణం దీక్షా చార్యులు వారు ముఖ్యులు. తిరుపతి వేంకటకవులు మూడు నాలుగుమార్లు గద్వాల సంస్థానానికి విచ్చేసి రామభూపాలుడు, సీతారామభూపాలురు చేసిన విశేషమైన గౌరవ సత్కారాలకు ఆ నందభరితులై ఈ సంస్థానపు కీర్తిని 'అటు గద్వాలిట చెన్నపట్టణ'మంటూ పలు పద్యరాజములతో గద్వాల వైభవాన్ని దిగంతాలకు వ్యాపింపజేశారు. రామభూపాలుని గురువైన పురాణం దీక్షాచార్యులు రామ చంపువు, రామన్నపకర్ణామృతం, కేవశసుప్రభాతం, కావ్యోత్కర్ష రచనలు చేశారు. రామభూపాలుని ఆస్థాన కవి బైరంపల్లి తిరుమల రాయకవి యథాశ్లోక తాత్పర్య రామాయణం ప్రథమభాగాన్ని 1896లో పరిష్కరించారు. ఇతని ఆస్థానంలోని చెల్లూరి నారాయణాచార్యులు 'ప్రతాపరుద్రీయసారమ'నే లక్షణ గ్రంథాన్ని, పురాణం నర్సింహాచార్యులు జానకీ పరిణయం, శ్రీరామభూపచరిత్రమనే రచనలు చేశాడు. హయగ్రీవాచార్యులు 'శబ్దేందు' శేఖరమునకు 'చంద్రిక' అనే పేరుతో వ్యాఖ్య రచించాడు.

శ్రీ ముష్టిపల్లి సీతారామ భూపాల్ బహద్దర్ వారి మరనానంతరం వారి ధర్మపత్ని ఆదిలక్ష్మీదేవమ్మగా 1948 వరకు గద్వాల సంస్థానాన్ని గత వైభవానికి లోటు రాకుండా పాలించింది. ఈ మహారాణి ధర్మకార్యాచరణియై విద్వత్సభలను, కవిపండిత కళాకారులను భర్తవలెనే ఆదరించి ఆశ్రయం కల్పించింది. శ్రీ పోకూరి కాశీపత్యవధాని ఆశుకవితాధురీణులు వీరు 'సారంగధరీయము' అను త్ర్యర్థి ప్రబంధము, అచ్చ తెలుగు హరిశ్చంద్రోపాఖ్యానమును రచించి గద్వాల రాణి గారి సహాయమున ప్రకటించుకొని ప్రభువుల కంకితమిచ్చిరి. ఈ విధంగా మరెందరో కవిపండితుల పట్ల రాణీగారు తమ ఔధార్యమును ప్రకటించారు. రాణీ గారిని గూర్చి, ఆమె దత్తపుత్రుడైన శ్రీరామకృష్ణ భూపాలుని గూర్చి బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు, అవధానం చంద్రశేఖర శర్మ వంటివారు ప్రస్తుతించిన తీరు వారి పాలనావైభవానికి దర్పణం పట్టేలా ఉన్నాయి. గద్వాల సంస్థానమునకు ఇతర సంస్థానముల నుండి కూడా పలువురు కవులు, పండితులు వచ్చి సంస్థానాధీశుల ఆదరాభిమానములకు పాత్రులయ్యేవారు. కాశీరామకృష్ణమాచార్యులు, ధర్మవరం రామకృష్ణమారాచ్యుల వంటి వారు కూడా గద్వాల సంస్థానంలో సన్మానింపబడినారు.


ఈ విధంగా గద్వాల సంస్థానం సాహితీ సౌరభంతో విరాజిల్లింది. ఈ సంస్థానాధీశులకాలంలో తెలుగు సాహిత్యం పలు ప్రక్రియలుగా పరిఢవిల్లింది. ఈ సంస్థానాధీశుల పాలనాదక్షత, సాహితీసేవ మార్గదర్శకమై అజరామరమై వెలుగొందుతోంది.

> గద్వాల సంస్థానం సాహితీ సౌరభంతో విరాజిల్లింది. ఈ సంస్థానాధీశులకాలంలో తెలుగు సాహిత్యం పలు ప్రక్రియలుగా పరిఢవిల్లింది. ఈ సంస్థానాధీశుల పాలనాదక్షత, సాహితీసేవ మార్గదర్శకమై అజరామరమై వెలుగొందుతోంది.




**◆ డాక్టర్ నమిలకొండ సునీత**

# పసలేని విమర్శ




ఇటీవలికాలంలో అసూయాద్వేషాలతో సాహిత్యంలో లబ్ధప్రతిష్టులైన కవులు, రచయితలు, విమర్శకులపై వారి రచనలపై బురద జల్లి తాము గొప్పవాళ్ళమని కాలర్ ఎగరేసేవాళ్ళు పుట్టుకొస్తున్నారు. గొప్పవారి కృషిని హేళనచేస్తే కీర్తివస్తుందన్న అమాయకత్వంతో నిరాధారమైన నిందారోపణలు చేస్తున్నారు. ఇటీవల నేను రాసి వెలువరించిన 'కవిత్వం–డిక్షన్' పుస్తకంపై అనాలోచితంగా, అనధికారికంగా, కనీస సాహితీ పరిజ్ఞానం లేకుండా, అకారణ ద్వేషంతో విషంగక్కుతూ సజ్జా వెంకటేశ్వర్లు 'డిక్షన్ పేరుతో డిక్టేటర్‌షిప్' అనే విమర్శనా వ్యాసం రాశారు. విచిత్ర మేమిటంటే ఆ పుస్తకంలో ఇతనికి ఒక్క మంచి విషయం కనిపించక పోవడం ఆశ్చర్యమనిపించింది.

పుస్తకం అంతటా తాను చెప్పే విషయాలందు నియంత పోకడలే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు 'మీరు ఈ రచనలో ఒక్కవ్యాసం రాయడానికి ఇంగ్లీషు పదాలు ఎన్ని ఉన్నాయో ఎపుడైనా లెక్కించారా? కనీసం ఓ యాబై ఆంగ్లపదాలు అనేక మార్లు దొర్లించేశారు దీన్ని ఏమంటారు? ఎదుటివారిని తప్పుపట్టే ఆలోచన చేయటంలో కనిపించే నియంతథోరణి తనకు మాత్రం వర్తించదా?' ఇదీ సజ్జా ఆరోపణ. అసలు నేను చెప్పింది కవితా నిర్మాణంలో అనవసరమైన ఆంగ్ల పదాల గురించి అయితే ఈయన నేను రాసిన వ్యాసాల్లో ఆంగ్లపదాలు ఉన్నాయని! అంటే కవితకు.. వ్యాసానికి.. వాటి నిర్మాణానికి సంబంధించిన కనీస పరిజ్ఞానం ఇతనికి లేదని ..ఇది చదివిన పాఠకుడికి ఇట్టే అర్థమైపోతుంది. వ్యాసం రాయడం కూడా ఒక కళ. అవసరమైన చోట ఇంగ్లీషుపదం వాడక తప్పదు. ఉదాహరణకు డిక్షన్‌కు బదులు ఏ తెలుగు పదం వాడాలో ఈ విమర్శకుణ్ణి చెప్పమనండి. అలా వాడటం నియంత ధోరణా? ఇక్కడ దేశ విదేశాల కవితా నిర్మాణాల గురించి చెబుతున్నపుడు వ్యాసంలో ఆంగ్లపదాలు వాడకూడదని చెప్పడం సజ్జా వెంకటేశ్వర్లు నియంతథోరణి కాదా? ఒక్కో రచయితకి ఒక్కో స్టైల్ ఉంటుంది. చలం శ్రీశ్రీ మహాప్రస్థానానికి రాసిన ముందుమాటలో అనేక చోట్ల ఆంగ్లపదాలు వాడారు. అలాగే మ్యూసింగ్స్‌లోనూ.. అన్యభాషా పదాలు వ్యాసానికి కొత్త స్టైల్‌ను తెచ్చి పెడతాయి. కవితా నిర్మాణంలో అనవసరమైన ఆంగ్లపదాలు poetic beuatyని దెబ్బ తీస్తాయన్న సత్యాన్ని కొత్త కవులకు తెలియజేయడానికే నేను అలా అన్నాను. కవితలో ఆంగ్లపదాలు అవసరమైనంత మేరకే వాడాలన్నాను. వ్యాసంలో వాడవద్దని చెప్పలేదు. వ్యాసంలో శైలిలోని కమ్మదనం, ఆంగ్లపదాలకు దీటైన పదాలు తెలుగులో సమానార్థకాలుగా లేకపోవడం వల్ల ఎక్కువ ఆంగ్లపదాలు వాడక తప్పలేదు. త్వమేవాహంలో ఆరుద్ర ఆంగ్ల పదాలు వాడింది poetic diction సాధించడం కోసమేనని పాపం..సజ్జాలాంటి విమర్శకులకు తెలియక పోవడం శోచనీయం. శ్రీశ్రీ మహాప్రస్థానం నుంచి మాట్లాడటం మొదలు పెట్టి మరో ప్రస్థానంతో శ్రీశ్రీ కవితా డిక్షన్ మారిపోయిందని సెలవిచ్చాడు. (ఈ డిక్షన్ అనే మాట ఎన్నిసార్లు వస్తుందో లెక్కేలేదు) అందుకు దారిచూపిన పరీక్షలు పరిస్థితుల ఊసే కనిపించదు ఊపిరి తీసేసి బొమ్మను చూపమంటే ఇదే? ఇది మరో ఆరోపణ. నేను చెప్పింది శ్రీశ్రీ కవితా నిర్మాణంలోని మార్పుగురించి. అంటే మహాప్రస్థానంలో శబ్దచిత్రణ..మరో ప్రపంచ కవితా నిర్మాణంలో అంతరించిందని అంటే కొత్త కవులు శబ్దమాయాజాలంలో పడరాదని నా అభిప్రాయం. డిక్షన్ గురించి రాస్తున్నాను కాబట్టి ఆ పదం అనేకసార్లు వచ్చి తీరుతుంది. ఊహకీ, వ్యూహానికి ఉన్న వ్యత్యాసాన్ని కూడా అసలు పట్టించుకునే ప్రయత్నమే చేయకుండా పోయారు. అనిర్దుష్ట రూపంలో ఉండేది ఊహ. ఒక నిర్దుష్ట రూపంలో కొనసాగేది వ్యూహం. దేనికుండే పరిధి దానికి స్పష్టంగా ఉన్నాయి. అయినా ఇలాంటి పదప్రయోగం చేశారంటే ఆయనలోని గందరగోళాల్ని పాఠకుల ముందుపెట్టి వారినీ గందర గోళం చేసే ప్రయత్నమే ఇది.. కవితా నిర్మాణంలో ఊహ – వ్యూహం కావాలన్నది నా ఉద్దేశ్యం. అంటే కవితా నిర్మాణం టెక్నికల్‌గా జరగాలన్నది దాని అర్థం. ఇక్కడ వ్యూహం అనే కవితా నిర్మాణంలో జాగ్రత్తలకు లేదా మెలకువలకు సంబంధించిన అంశం. అనిర్దుష్ట రూపంలో ఉండే ఊహే. కవితా నిర్మాణంలో నిర్దుష్ట రూపంలో కనిపిస్తుంది. నిర్మాణ నైపుణ్యం, గూడార్థం తెలియని సజ్జా గందరగోళానికి గురై పాఠకులను గందరగోళానికి గురి చేయాలని ప్రయత్నించారు. ఇలా శబ్దాల అర్థాలు విడదీసి గందరగోళం చేస్తే బిక్కి కృష్ణ శబ్దాలపై కమాండ్ లేదని పాఠకులు అనుకోవాలని పాపం! రుచికరమైన వంటను చూడగానే నోట్లో లాలాజలం ఊరినట్టు కవిత్వాన్ని చదవగానే కాసేపైనా ఆశ్చర్యం కలగాలి అంటారు. ఇదో చవకబారు విశ్లేషణ అంటూ సజ్జా స్టేట్‌మెంట్ ఇచ్చారు. అంతేకాదు కవిత్వంపై ఎలాంటి విశ్వాసాలు లేకుండానే ఇవాళ మన ముందుకొస్తున్న కవిత్వాన్నిగానీ, కవులనుగానీ అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తే, కొన్ని చేదు నిజాలు బయట పడతాయి. గారడీవాని మాటల్లాగా, అల్లిక పని తెలిసిన లేదా నైపుణ్యం ఉన్న వారిలాగా కనిపిస్తారు. నిజాయితీతో కనిపించే రచన కనిపించటం చాలా కష్టమైపోతుంది. అన్నింటా ఆశ్చర్యార్థకాలే అంటూ తన అహంకారాన్ని, ద్వేషాన్ని ఇలా వెళ్ళగక్కారు. ఒక విషయం బాగా అర్థమవ్వటానికి ఉదాహరణలు పోలికలు ఇవ్వటం సహజం. నేను ఇచ్చిన అద్భుతమైన పోలికలను అందరూ మెచ్చుకుంటే, సజ్జా విమర్శించడం ఆశ్చర్యమేస్తుంది.

కవిత్వ నిర్మాణంలో ఉండే అంశాలు, మరీ శుద్ధ మాటల గారడీలుగా కనిపిస్తాయి తప్ప జీవం తొణికిసలాడుతున్నట్టుగా ఈ వ్యాసాలు లేవు. ఇది మరో ఆరోపణ. ఏ సాహిత్య అధికారంతో ఈ మాటలు అంటున్నారో? ఎందుకంటే ప్రఖ్యాత విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి ఈ పుస్తకం ముందుమాటలో ఇందులోని వ్యాసాల గూర్చి రాస్తూ కవిత్వాభివ్యక్తికి సంబంధించి కృష్ణ బాగా సోదాహరణంగా వివరించాడు. దీనికి సంబంధించిన భిన్నాభిప్రాయాలను చర్చించాడు, సిమిలి, మెటఫర్, అలిగరి, మెటానమీ, పేరలెల్లిజం, పర్సోనిఫికేషన్, అనపార, ప్రతీకలు, ఇమేజనరీ, సింబాలిజం వంటి పాశ్చాత్య భావనల్ని(poetic devices) లోతుగా చర్చించారు. కవిత్వంలో అస్పష్టత వంటి అంశాలను విమర్శకు పెట్టారు.

ప్రపంచ కవులతో పాటు తెలుగు కవులు కూడా తమను తాము నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని ఆకాంక్షించాడు, తెలుగు కవిత్వం పలచబడి పోతున్నదనే ఆవేదనలోంచి ఈ పుస్తకం పుట్టుకొచ్చింది.

కవిత్వాన్ని ప్రేమిస్తూ, కవులను గౌరవిస్తూ, కవిత్వాన్ని రక్షించే కర్తవ్యతా నిర్వహణ ఈ గ్రంథంలో కనిపించే ప్రాణభూతమైన లక్షణం అంటూ రాచపాళెం లాంటి పెద్ద విమర్శకుడు అంటే పాపం ఈ వ్యాసాల్లో జీవం తొణికిసలాడటం లేదని, సజ్జా వేంకటేశ్వర్లు అంటున్నారంటే నా పుస్తకంపై ..నా పై ఈ విమర్శకునికి ఎంత కసి ఉందో, అసూయ ఉందో, అక్కసు ఉందో పాఠకులారా ఊహించండి.

ప్రాణం లేని తనంతో కవిత్వాన్ని తయారు చేసేందుకు ఈ రచన దోహదపడుతుందేమో కాలంచెల్లిన పదాల విన్యాసాలను గూర్చి మళ్ళీ మళ్ళీ ఇక్కడ ముచ్చటించటం ఉంది అన్నది మరో పసలేని విమర్శ. ఎందుకంటే నా రచనలోని మొత్తం సారాంశం పాత డిక్షన్‌ను ధ్వంసం చేయడమే. ఎంతో కష్టపడి నిద్రాహారాలు మాని ఎన్నో ఏళ్ళు కష్టపడి ప్రపంచ కవిత్వాన్ని, కవితా నిర్మాణ పద్ధతులను శోధించి,పరిశోధించి రాసిన ఈ పుస్తకంలోని ఏ ఒక్క అంశాన్ని కనీసం మెచ్చుకోకపోగా మొత్తం బాగా లేదని విషంగక్కడం ఈతని డిక్టేటర్‌షిప్‌కు, పరాకాష్టకు, అనంత అజ్ఞానానికి, ప్రత్యక్షనిదర్శనం.


బిక్కి కృష్ణ కవిత్వమేంటో ఎన్.గోపి, కె.శివారెడ్డి, నగ్నముని, రాచపాళెం లాంటి సుప్రసిద్ధ కవులు రాసిన (కాలంనది ఒడ్డున) ముందుమాటల్లో పాఠకులకు తెలుసు. కవిత్వ ముద్రణ గు రించి 12 రకాల సూచనలు కూడా ఈతని వృష్టిలో నియంత మాటలట.అంటే ఒక సీనియర్ కవిగా యువకవులకు సూచనలు చేయడం కూడా తప్పేననటం ఎంతవరకు సమంజసం? నియంత ధోరణి సజ్జాదా? బిక్కి కృష్ణదా? బిక్కి వాడే పరుసపదాలు, అసందర్భ ప్రేలాపనల మధ్య కూడా అతని కవితాభిమానం గౌరవిద్దాం అంటూ నాకు కితాబిచ్చాడు. కవిత్వంపై ఎలాంటి విశ్వాసం లేదని అంతకుముందే రాసిన ఈయన చంచలస్వభావంతో ఇప్పుడు బిక్కి కవితాబిమానం గౌరవిద్దాం అంటూ చివరకు ఓ చిన్న మాటైనా అన్నారు.

ఒక ప్రముఖ కవి, విమర్శకునిగా, సమీక్షకునిగా తెలుగు సాహితీ రంగంలో ఎంతో కీర్తిగడించిన బిక్కి కృష్ణలాంటి వాడు ఎంతో కష్టపడి వర్ధమాన కవులకు మార్గదర్శకంగా ఉండాలని కవిత్వం–డిక్షన్ అన్న పుస్తకాన్ని రాస్తే, బాగా రాశావని కనీసం అభినందించక పోయినా ఇది కొంతవరకు ఉపయోగపడుతుందని కూడా రాయని సజ్జా వేంకటేశ్వర్లు ఎంతటి నియంతో, ఇతరులపై బురదజల్లే స్వభావం కలవాడో నిరూపించడానికే ఇంతలా వివరణ ఇవ్వాల్సి వచ్చింది.

**◆ కృష్ణ బిక్కి**

# రాగద్వేషాల జయమే.. 'ఆయుధం'

'ఆయుధం' ఓ మనోవైజ్ఞానిక నవల రచయిత టిఎస్ కృష్ణమూర్తి. అపార జీవితానుభవం సారంతో ఇంత గొప్ప నవల తెలుగు సాహిత్యానికి అందించారు. అందుకు తెలుగు ప్రజలంతా ఆయనకు రుణపడి వుంటారు. ఆ రుణం అంత తేలికగా తీర్చుకునేది కాదు. ఈ నవల చదవటం ద్వారా కానీ, ఇంకొకరిని చదవమని పురికొల్పడం ద్వారా కాని ఈ రుణం తీర్చుకోలేము. రచయిత ఓ అనుభవ సారమైతే ఈ నవలలో అందించారో దానిని మనోవాక్కయ కర్మల ద్వారా స్వీకరించి, అచరించటం ద్వారానే తీర్చుకోగలము. రచయితగా పాఠకుడిగా, విమర్శకుడిగా నేను నా జీవితంలో ప్రాచ్య, పాశ్చాత్య నవలలు చదివాను. కానీ ఈ నవల చదివాక ఈ రచయిత సామాన్యుడు కాదనిపించింది. నా లైబ్రరీలో ఆయన పుస్తకాలు చాలా వున్నాయి. అవి ఆయన ప్రేమతో నాకు పంపించిన వెలలేని కానుకలు ఈ రచయితని అంచనా వేయటానికి నేను చాలా రోజులు ఆలోచించాను. చివరికి టి.ఎస్.ఎ కృష్ణమూర్తి ప్రపంచ ప్రఖ్యాత రచయిత డోస్టోవస్కీకి అసలైన వారసుడిగా గమనించాను. ఆ డోస్టోవస్కీ నవల క్రైమ్ అండ్ పనిష్‌మెంట్ నవల చదివి ఎంతగా విచలితుడిని అయినానో కృష్ణమూర్తి ఆయుధం నవల చదివి అంతగా మదనకి గురిఅయ్యాను. అంతర్జాతీయ నవలలకి దీటుగా రచించిన అద్భుత జీవన గమ్మసారంతో మనసారా రచించిన మనోవైజ్ఞానిక నవల ఇది. మార్క్సుని ఫ్రాయిడ్‌ని కలగొల్పకుండా నవలా రచన, చేయ టం అది సాహిత్య నేరం అవుతుంది. ఆ ఆకళింపుతో కృష్ణమూర్తి ఆయుధం నవల తనివి దీరా రాశాడని నేను గుర్తిస్తున్నాను. ఈ నవల నిజంగా తెలుగు సాహిత్యంలో సజీవంగా బతికిబట్టగలిగే అపూర్వ నవల. తెలుగులో గొప్ప నవలలు రావటం లేదనే ఘోరంచుకు వాఖ్యలకి ఈ నవల గొప్ప చెంప దెబ్బ. ఈ నవల చదివి నేను ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. డోస్టోవస్కీ క్రైమ్ అండ్ పనిష్‌మెంట్‌కి ఇది ముందు భాగం. నేరం చేసి బాధ పడటం లేదు. నేరం చేయకుండా నిదానించుకోవటం వేరు. రాజయ్య ఈ నవలలో ప్రధాన పాత్ర. తల్లిని భంగం పరిచిన నేరస్తులని చంపటానికి, వాళ్ళని ఎదిరించటానికి రాజయ్య ఎన్నో పాచికలు, పథకాలు రచించుకున్నాడు. గుహలు వెతికి తన మనోగుహల్లో మరెన్నో తాత్వికధారలని పంచుకున్నాడు. తనని ప్రేమించిన పెత్తందార్ల పిల్ల దీపికని సజావుగా కాపాడి ఆమె జీవితాన్ని రక్షించి మోహావేశాలు పనికిరావని తత్వబోధ చేసిన రాజయ్య, తను రక్షించిన భాగ్యలక్ష్మిని మనువాడటం రచయిత ఎంతో తేలికగా వర్ణించి జీవితం అంటే ప్రేమపాశాలు కాదని పోరాటం అని ఈ నవలలో చిత్రీకరించిన తీరు నవల రచనలకు ఓ గొప్ప పాఠ్యాంశం. ఈ నవల ఆయుధం చదువుతుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది, జలదరిస్తుంది కూడా. ఎక్కడ రాయలసీమలోని రాళ్ళ మధ్యన మారుమూల ప్రాంతంలో ఓ లోయ మధ్యన చిన్న గ్రామంలో ఆరడుగుల ఆజానుబాహుడైన నల్లని వృద్ధ బోయడు అతని కుమారుడు రాజయ్య రాగద్వేషాలను, ఆనాటి పేదలు, నిస్సాహాయులపై పెత్తం దార్ల దౌష్ట్యాలని ఆయుధం నవలకు ప్రధాన ఇతివృత్తంగా రచన సాగింది. నవల ప్రధాన పాత్రధారుడు రాజయ్య హత్యచేసి తన కసిని తీర్చుకోవాలనే ద్వేషంనుంచి, పగనుంచి స్వాంతన పొంది తన చేతికి ఎలాంటి రక్తమూ అంటకుండా విధి ఆడించిన అంతపెద్ద అంతర్నాటకంలో రాజయ్య తను ఓ ఆయుధంలా లేదా ఓ పనిముట్టులా కదిలి ఓ నిమిత్తమాత్రుడిగా గ్రహించటం ద్వారా ఈ నవల ఓ మహా మాంత్రికతాత్విక స్థాయిని చేరింది. మ్యాజిక్ రియలిజమ్‌ని రచయిత కృష్ణమూర్తి ఆయుధం నవలలో అద్భుతంగా పండించారు. రాయలసీమలోని మెట్ట సిద్ధాంత అచల తాత్విక స్థాయిని ఈ నవల చర్చించింది. హింసను ఎదుర్కోటానికి హింస అవసరం లేదనిన్నూ కనబడని రహస్య శక్తులు తమ పని తాము చేసికొని దుష్టులని శిక్షిస్తుందని రచయిత మ్యాజిక్ రియలిజం ద్వారా ఈ నవలని అంతర్జాతీయ నవలల స్థాయికి తీసుకెళ్లాడు. ప్రేమ్‌చంద్ గోదాన్ నవల స్థాయిని దాటి గ్రామీణ నేపథ్యాన్ని గొప్పగా ఆడిమిన మంచి నవల ఆయుధం. రచయిత రాయలసీమ గ్రామీణ జీవితాన్ని ముఖ్యంగా 1940 – 2000 నాటి 60 యేళ్ళ కాలాన్ని రచయిత ఒడుపుగా పట్టుకొని ఆనాటి ప్రజల కష్టాలనీ, కడగండ్లనీ, రాగద్వేషాలని, పిరికితనాన్ని, పలాయనాన్ని చిత్రీకరించటంలో ఎంతో సఫలమయ్యారు. కరెంటూ, రోడ్లూ, విద్య ఏ విధంగా ప్రజల చైతన్య స్థాయిని పెంచి, బానిసత్వం నుంచి, పేదరికం నుంచి పదిలంగా బైటపడి విముక్తి సాధిస్తారు ఆయుధం నవల చిత్రీకరించింది. ఆయుధం తెలుగులో వచ్చిన గొప్ప నవలలా వ్యక్తీకరించటంలో ఎంతో ఆనందం వుంది నాకు.




**◆ సాగర్ శ్రీరామకవచం**

# గ్రీన్ ట్రైబ్యునల్

భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో గ్రీన్ ట్రైబ్యునల్ అడవుల సంరక్షణ, సహజ వనరులు, జీవజాలం, వన్య ప్రాణులను కాపాడుకోవడం, పర్యావరణ హక్కుల పరిరక్షణ, పర్యావరణ వివాదాల్లో బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు, సత్వర న్యాయం అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం 2010 అక్టోబర్‌లో ఒక ప్రత్యేక చట్టం ద్వారా ఈ గ్రీన్ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసింది. జాతీయ స్థాయిలో పర్యావరణ సంబంధిత కేసులు వివిధ కోర్టుల్లో ఏళ్ళ తరబడి పెండింగ్‌లో వుండిపోవడం, బాధితులకు సత్వర న్యాయం అందకపోవడం సమస్యగా మారుతుండేది. దేశంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన కేసులు న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో వుండటం వల్ల అభివృద్ధి పనులు కూడా పెండింగ్‌లో వుంటున్నాయి. దాంతో ట్రైబ్యునల్ ఏర్పాటు కొత్త ఆశలను చిగురింప చేసింది.


దేశంలో భోపాల్ దుర్ఘటన వంటి సంఘటనలు జరిగినప్పుడు బాధితులకు ఏ మేరకు న్యాయం జరిగిందో తెలిసిందే. దేశంలో పర్యావరణ చట్టాలు పటిష్టంగా లేకపోవడం, పర్యావరణ సంబంధిత కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానలు లేకపోవడం వల్ల ప్రభుత్వాలకు, ప్రజలకు అప్పట్లో ఇబ్బందులెదురయ్యాయి. ఈ తరహా సంఘటనలు జరిగే వరకు ప్రభుత్వాలకు గ్రీన్ ట్రైబ్యునల్ కాదు, పర్యావరణ అంశాలకు ఇవ్వాలసినంత ప్రాధాన్యం కూడా ఇవ్వలేదు. ఈ సంఘటన తర్వాత కేంద్రంలోని పర్యావరణ మంత్రిత్వ శాఖకు కేబినెట్ హోదా కల్పించి, 1985లో పర్యావరణం, అటవీ మంత్రిత్వ శాఖగా మార్పు చేశారు. కేంద్ర ప్రభుత్వం 1986 మే 23న పర్యావరణ పరిరక్షణ




చట్టాన్ని అమలులోకి తెచ్చింది. దీని ఫలితంగా రాష్ట్ర స్థాయిలో కాలుష్య నియంత్రణా మండలాలు ఏర్పాటయ్యాయి. రాష్ట్రాల పరిధిలో పర్యావరణ చట్టాలను పటిష్టంగా అమలు చేసే బాధ్యతను ఈ సంస్థలకు కట్టబెట్టారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చట్టాలు అందుబాటులో వున్నప్పటికీ, ఈ వివాదాలకు సంబంధించిన కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు లేకపోవడంతో కొత్త సమస్యలు ఎదురయ్యాయి. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వ గ్రీన్ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రజలకు జీవించే హక్కును అందించడమైంది. గత కొన్ని సంవత్సరాలుగా దేశంలోని వివిధ న్యాయస్థానాలు పర్యావరణ సంబంధిత కేసుల విచారణ సమయంలో ఇటువంటి ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత వుందని చెప్పాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు మెరుగైన న్యాయం అందించేలా చూసేందుకు ప్రభుత్వం గ్రీన్ ట్రైబ్యునల్ చట్టాన్ని తీసుకొని వచ్చి అమలు చేస్తుంది. ఈ ట్రైబ్యునల్‌లో దాఖలయ్యే వ్యాజ్యాలన్నీ పర్యావరణ సంబంధిత అంశాలతో ముడిపడి వున్నందున తగిన సంఖ్యలో శాస్త్రవేత్తలకు దీనిలో చోటు కల్పించింది. గ్రీన్ ట్రైబ్యునల్‌లో చైర్మన్‌తో పాటు 20 మంది సభ్యులుంటారు. వీరిలో సగం మంది న్యాయకోవిదులు కాగా మరో సగం మందిని శాస్త్ర విజ్ఞానంలో నిష్ణాతులైన వారు వుంటారు. మరో కీలక అంశం ఏమిటంటే ట్రైబ్యునల్ తీర్పులను ఎప్పటికప్పుడు ప్రజలు తెలుసుకొనే విధంగా ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో వుంచుతున్నారు. ఈ తరహా చర్యల వల్ల ట్రైబ్యునల్ నిర్వహణ పారదర్శకంగా వుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

బహుళజాతి సంస్థలకు, విదేశీ పెట్టుబడిదారులకు వత్తాసు పలికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు భిన్నంగా గ్రీన్ ట్రైబ్యునల్ ఇటీవల కాలంలో కొన్ని తీర్పులను వెలువరించింది. దక్షిణ కొరియాకు చెందిన బహుళజాతి ఇనుము, ఉక్కు పరిశ్రమ ఒడిస్సాలో 12 మిలియన్ టన్నుల ఉత్పాదక సామర్థ్యంతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయతల పెట్టింది. భారీ ప్రాజెక్టు ఏర్పాటు వల్ల అనేక పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతాయనీ, ప్రజలు వేల సంఖ్యలో నిరాశ్రయలైతారనీ, కాలుష్య సమస్యలు ఉత్పన్నమౌతాయనీ, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టపరమైన అతిక్రమణలు జరిగాయనీ దేశంలోనూ, వెలుపలా పెద్దెత్తున నిరసనలు వెల్లువెత్తాయి. పోస్కో విషయమై గ్రీన్ ట్రైబ్యునల్ వెలవరించిన తీర్పు బాధిత ప్రజలకూ, ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారందరికీ ఎంతో ఊరటను కలిగించింది. ఇలా ఎన్నో ప్రజానుకూల తీర్పులతో గ్రీన్ ట్రైబ్యునల్ ప్రజల విశ్వాసాన్ని చూరగొంది.

మహి డెస్క్



# భూ క్షీణత భయం

విస్తార నిజం

మానవ కార్యకలాపాల వల్ల భూమి జీవ భౌతిక వాతావరణ స్వభావాన్ని క్షీణించడం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. భూ క్షీణత కారణంగా వ్యవసాయార్థిక ఉత్పాదకత 21వ శతాబ్దంలో గణనీయంగా పడిపోవడంతో మానవాళి ఆహార భద్రతకు ముప్పు ఏర్పడనుంది. ప్రపంచ వ్యవసాయ భూముల్లో 40 శాతం దాకా క్షీణతకు గురైనాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లో (2014 -15 అంచనాల ప్రకారం) భూ క్షీణత కారణంగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) లో 2 శాతం అంటే దాదాపు రూ.3 లక్షల కోట్లు నష్టం వాటిల్లిందని వాతావరణం, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ (ఎమ్ఓఈఎఫ్‌సీసీ), శక్తి, వనరుల సంస్థ (టీఈఆర్ఐ)ల సంయుక్తంగా రూపొందించిన అప్రచురిత నివేదిక వెల్లడించింది. సహజ అడవులు క్షీణించడం, పక్కదారి పట్టడం ప్రధాన కారణంగా దేశంలో భూ క్షీణత పెద్ద ఎత్తున జరిగిందని ఆ నివేదిక పేర్కొంది. 'భారత్‌లో ఎడారీకరణ, భూ క్షీణతల పటాన్ని' రూపొందించే బాధ్యతను భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో)కు 2016 జూన్‌లో ఎమ్ఓ ఈఎఫ్‌సీసీ అప్పగించింది. 2003-05, 2011- 13లలో ఇస్రోస్పేస్ అప్లికేషన్స్ సెంటర్ రూపొందించిన పటం ప్రకారం దేశ వ్యవసాయ భూమిలో 30 శాతం క్షీణించినట్లు బయటపడింది. ఈ క్షీణత కారణంగా జీవం మనుగడ అత్యంత ప్రమాద కరంగా తయారయ్యే పరిస్థితులు ముంచు కొస్తున్నాయి. అడవులు, భూమి పైనే ఆహార భద్రత, జీవవైవిధ్యం, స్వచ్ఛమైన గాలి, నీరు.. ప్రతిదీ ఆధారపడి ఉంటుంది.

2015 సెప్టెంబర్‌లో, '2030 సుస్థిరాభివృద్ధి ఎజెండా'ను ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈ ఎజెండా 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను (ఎస్‌డీజీ) కలిగి ఉంది. 'పేదరికం ఏ రూపంలో, ఎక్కడ ఉన్నా నిర్మూలించాలి' (పేదరికానికి చరమగీతం) నుంచి 'ఆకలి నిర్మూలన, ఆహార భద్రత సాధన, పోషకాహారం తీసుకోవడం, సుస్థిర వ్యవసాయం' (ఆకలి శూన్యం) నుంచి 'వాతావరణ మార్పు, దాని ప్రభావాల నివారణపై తక్షణ చర్యలు తీసుకోవడం' (వాతావరణ చర్యలు), అడవుల సుస్థిర యాజమాన్యం, 'ఎడారీకరణకు వ్యతిరేకంగా పోరాటం, భూ క్షీణతను నిరోధించడం, పునరుద్ధరించడం' (భూమి జీవం) వంటి 17 ఎస్‌డీజీలను ఆ ఎజెండాలో పొందుపరిచారు. 2030 నాటికల్లా భూ క్షీణతను తటస్థం చేసే లక్ష్యంపై భారత్ కూడా సంసిద్ధతను తెలిపింది. వనరులను పెద్దయెత్తున వినియోగించే ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడానికి ముందుగా, వాతావరణ ప్రభావ అంచనాలు (ఈఐఏ)లను తప్పనిసరిగా రూపొందించాలనే నిబంధన ద్వారా ప్రకృతి వనరులపై వత్తిడిని తగ్గించేందుకు వీలవుతుంది. ప్రాజెక్టుల వల్ల ప్రకృతికి జరిగే నష్టాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఈఐఏలను రూపొందించాలి. అయితే అంచనా వేసే నిపుణుల ను సదరు కార్పొరేట్ సంస్థలు వివిధ రూపాల్లో ప్రభావితం చేయడం, ఈఐఏలను అమలు చేయ డంలో వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల తరచూ నిబంధనల ఉల్లంఘన, ఈఐఏ సిఫార్సులను నిర్లక్ష్యం చేయడం దేశంలో సర్వసాధారణ విషయంగా మారింది. భూ క్షీణత సమాచారం అందుబాటులో లేని కారణంగా ఎమ్ఓఈఎఫ్‌సీసీ నివేదికను వెంటనే బహిర్గతం చేస్తే దేశ ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతుంది.

మహి డెస్క్


## పాలేకర్ సాగు ఫలించేనా?

మథనం

ప్రకృతి ప్రేమికుడు, సేంద్రీయ వ్యవసాయ పితామహుడుగా ప్రసిద్ధిగాంచిన సుభాష్ పాలేకర్ పర్యావరణహిత ప్రత్యామ్నాయ వ్యవసాయంపై దేశ ప్రజల దృష్టి మరల్చడంలో కృతకృత్యులయ్యారు. ఒక్క దేశవాళి ఆవుతో సుమారు 30 ఎకరాలలో మిశ్రమ పంటలు పండించవచ్చని ఘంటాపథంగా ప్రచారం చేస్తున్నారు. క్రమంగా నేడు దేశవ్యాప్తంగా 40 లక్షల మంది రైతులు ఈ విధానాన్ని అవలంభిస్తున్నారు. వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులు బయటపడాలంటే పెట్టుబడి లేని ప్రకృతి సేద్యం ఒక్కటే మార్గమని ఆయన సందేశమిస్తున్నారు. ఆవుపేడ శాస్త్రవేత్తగా ప్రసిద్ధికెక్కిన పాలేకర్ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాయి. వ్యవసాయరంగ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగానికి వ్యవసాయం గిట్టుబాటు అయ్యే పాలేకర్ విధానంతో సేద్యం చేయాలని ప్రచారం చేస్తున్నాయి. భూసార పరీక్షలు వద్దని, ట్రాక్టర్లతో భూమి దున్నొద్దని, వ్యవసాయంలో వెర్మికం పోస్టు (వానపాముల వినియోగం) పనికిరాదని, అసలు సేంద్రీయ సాగు విధానమే దండుగని పాలేకర్ బోధిస్తున్నారు. కేవలం ఆవుపేడ, ఆవు మూత్రాలతో జీవా మృతం, కషాయాలను రైతులు స్వయంగా తయారుచేసుకొని ఎరువులు, కీటక నాసినులుగా ఉపయోగించాలని చెబుతున్నారు. విశ్వవ్యాప్తంగా శాస్త్రీయ నిరూపణలతో రూపొందిన సాగు విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయన కించపరుస్తున్నారు. దాంతో పాలేకర్ వ్యాఖ్యానాలపై పలువురు శాస్త్రవేత్తలు, విద్యావంతులు తీవ్ర అభ్యంతరాలను లేవనెత్తున్నారు. పాలేకర్ అశాస్త్రీయ వాదనలపై వచ్చిన విమర్శలను పరిశీలించకుండా వందలకోట్లు ఖర్చుతో రైతులకు నిరంతరాయంగా శిక్షణ ఇప్పించాలని పాలకులు ప్రయత్నిస్తుండడం విడ్డూరంగా ఉంది. సాగులో రసాయనాలు అధికంగా వాడటం, బీటీ రకాల విత్తనాల సాగు, వర్షాభావ ప్రాంతాలలో పత్తి సాగు వంటి అనేక అశాస్త్రీయ విధానాలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్, గిట్టుబాటు ధర, ఉత్పాదక పెట్టుబడి సకాలంలో రైతాంగానికి అందించడం, వ్యవసాయ ఉత్పాదక ఖర్చు తగ్గే విధంగా సబ్సిడీలు, వ్యవసాయ వాణిజ్య సంస్థలను కఠినంగా నియంత్రించడం, కౌలుదారుల సమస్యల్ని పరిష్కరించడం, భూసంస్కరణలు, నష్టదాయకమైన కమతాల సైజును నిర్ణయించి కనిష్ట భూకమతాల చట్టాన్ని రూపొందించడం, వ్యవసాయ అనుబంధిత పరిశ్రమలను ప్రభుత్వరంగంలో ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయ సంక్షోభాన్ని నివారిస్తామని పాలకులు చేస్తున్న ప్రచారం ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది.

ఆహార, వాణిజ్య వ్యవసాయోత్పత్తుల ద్వారా మానవ వినియోగంలోకి వెళుతున్న భూసారం తిరిగి స్థానిక వ్యవసాయ క్షేత్రాలకు చేరితేనే, అవి తిరిగి మరోసారి పంట సాగుకు అనువైన పోషకాలతో పరిపుష్టితమవుతాయి. అలాకాక ఆహార ధాన్యాలు, పత్తి వంటి వాణిజ్య ఉత్పత్తులు స్థానికంగా కాక కోట్లమంది నివసిస్తున్న పట్టణ ప్రాంతాలకు తరలి వెళ్లడంతో మానవ వినియోగంలోకి వెళ్లిన భూసారం వారి విసర్జితాల ద్వారా తిరిగి అదే నేలకు చేరకుండా డ్రైనేజీలలోకి వెళ్ళి విషపూరిత వ్యర్థాలుగా పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. భూసారం కోల్పోయి నేలలు సారహీనంగా మారుతున్నాయి. పోషకాల కోసం కృత్రిమ ఎరువుల వినియోగం పెరిగే కొద్దీ ప్రారంభంలో దిగుబడి పెరిగినా, క్రమేపీ ఇతర పోషకాలు కరువై వ్యవసాయ దిగుబడులు పూర్తిగా అడుగంటే పరిస్థితి హరిత విప్లవ ప్రాంతాల్లో చోటు చేసుకోవడం ఒక చారిత్రక విషాదం. దాంతో ఆధునిక వ్యవసాయ ఉత్పత్తి పద్ధతులపై రైతులకు నమ్మకం పోయి, గతిలేని పరిస్థితుల్లో సాగు చేస్తూ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతున్నారు. కోట్ల మంది పట్టణ వాసులు వినియోగానికి, విదేశీ ఎగుమతుల రూపంలో స్థానిక వ్యవసాయ క్షేత్రాలలోని భూసారం లక్షలాది టన్నుల్లో తరలిపోతోంది. వినియోగంలోకి వెళ్ళిన భూసారం తిరిగి అదే భూమిని చేరే సహజ వలయానికి గండి పడింది. ఈ గండిని పూడ్చేందుకు కృత్రిమ ఎరువులను వినియోగించే పద్ధతి వికటించింది. హైబ్రిడ్, బీటీ పంటలు ప్రజా రోగ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్న నేపథ్యంలో పాలేకర్ ఆవు మలమూత్రాల సేద్యానికి అధిక ప్రచారం వచ్చింది. పట్టణాలకు, విదేశాలకు తరలి వెళు తున్న కోట్లాది టన్నుల సహజ భూసారం తిరిగి వ్యవసాయ క్షేత్రాలకు చేరే సామాజిక ఏర్పాటు లేకుండా ఆవు మల మూత్రాల ద్వారా భూసార గండిని పూడ్చడం సాధ్యమయ్యే పనికాదు. ప్రకృతి - సమాజం మధ్య జరిగే ఆదానప్రదాన ప్రక్రియ సజావుగా సాగినపుడే పర్యావరణ సంక్షోభానికి తెర పడుతుంది. అప్పటిదాకా పాలేకర్ వంటి వ్యవసాయ భూత వైద్యులు పాలకుల విన్యాసాలకు పావులుగా వినియోగపడుతూనే ఉంటారు.

## నీటి 'బెంగ'ళూరు



సమాచారం


బెంగళూరు జనాభా కోటికి పైగా ఉంటుంది. వీరందరికీ అందించే నీటిలో ప్రతిచుక్కా దిగుమతి చేసుకునేదే! బెంగళూరుకు కావేరీ జలాలను అందిస్తారు. ఈ నీటి పంపిణీ గత 40 ఏళ్లలో మూడురెట్లు పెరిగింది. ఎంఎల్‌డీకి 30 లక్షల రూపాయల నుంచి ప్రస్తుతం ఏడు కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నారు. నగరంలోని సరస్సుల్ని, చెరువుల్ని ప్రజలు కాపాడుకోలేకపోవడమో లేక నిర్వహించడమో చేయకపోతే బెంగళూరుకు నీటిసమస్య తలెత్తడానికి ఎంతో కాలం పట్టదని వ్యవసాయ నిపుణుడొకరు హెచ్చరించారు. నగరంలో చట్టవ్యతిరేకంగా కొనసాగుతున్న వ్యర్థాల తరలింపు అందరినీ కలవరపరుస్తోంది. నగరవాసులు నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదంతో పాటు ఆరోగ్య పరిస్థితులపై కూడా ప్రభావం పడుతోందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. తగిన చర్యలు తీసుకోకపోతే నగరంలో జీవించే పరిస్థితులు తగ్గిపోతున్నాయని వారు హెచ్చరిస్తున్నారు. నిర్లక్ష్య నగరీకరణ ప్రభావంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఇటీవల నిర్వహించిన ఐఐఎస్‌సీ పరిశోధన పేర్కొన్నది. 1973-2016 మధ్య కాలంలో నగర ఉపరితలం కాంక్రీట్ పెరిగిందని, సహజ వనరులపై దీని ప్రభావం గణనీయంగా పెరిగిందని పరిశోధన అభిప్రాయపడింది. ఫలితంగా హరితప్రాంతం 88 శాతం, చిత్తడి నేలలు 79 శాతం కుదించుకుపోయయని పేర్కొన్నారు. వీటితో పాటు వాయు కాలుష్యం పెరిగి, భూగర్భ జలాల మట్టం తగ్గిపోయింది. మహి డెస్క్

## జీవన దాతలు

| శాస్త్రీయ నామాలు | సాధారణ పేరు | ఏం వడపోత చేస్తాయి | హరిత ప్రత్యామ్నాయాలు |
|---|---|---|---|
| నెఫ్రోలెఫిస్ ఎక్సాల్టరా | బోస్టన్ ఫెర్న్, స్వోర్డ్ ఫెర్న్, ఫిష్‌బోర్న్ ఫెర్న్ | వీఓసీలను సంకలనం చేస్తాయి. ముఖ్యంగా ఫార్మడీహైడ్, బెంజీన్, క్జైలీన్‌ను తొలగిస్తాయి. | బయోగ్యాస్, ఎల్‌పీజీ, సోలార్ |
| ఫోనిక్స్ రియేబెలెనీ | పిగ్మీ డేట్ పామ్ లేక రోబెల్లినీ | దక్షిణ తూర్పు ఆసియా, చైనా, వియత్నాంల్లో లభిస్తుంది. ఫార్మాల్డిహెడ్‌ను తొలగిస్తుంది. | కరెంటు స్టౌల వాడకం |
| చామీఈ డొరియా సైఫ్రిజిల్ | వెదురు, పేము, నర్సరీల్లో లభిస్తుంది. తోటల పంపకానికి ఉపయోగిస్తారు. | ఉష్ణమండల ప్రాంతంలోని అమెరికన్లు బెంజీన్, ట్రైక్లోరో ఇథలీన్ వడపోతకు ఉపయోగిస్తారు. | తగిన వెలుతురు, |
| సింగోనియమ్ పోడోపిలమ్ | సింగోనియమ్, అలంకరణ మొక్క వివిధ రంగుల్లో లభిస్తుంది. | వీఓసీని తొలగించేందుకు ఇది ఉపయోగపడుతుంది. | సేంద్రియ ప్రత్యా |
| స్పాతిపిలమ్ | పీస్ లిలీస్ | బెంజీన్, కార్బన్ మోనాక్సైడ్, ఫార్మాల్డిహైడ్‌ను తొలగిస్తుంది. | మ్నాయాలు, |
| సాన్స్‌వేరియా ట్రిఫస్కియాట | పాము మొక్కలు, మదర్-ఇన్- | వీఎసీలను తొలగించడమే కాకుండా రాత్రులందు ఆక్సిజెన్‌ను | సుగంధ పదార్థం |

## నిశ్శబ్ద హంతకులు

| కాలుష్య మూలం | విషతుల్య పదార్థాలు | ఆరోగ్య సమస్యలు | హరిత ప్రత్యామ్నాయాలు |
|---|---|---|---|
| బొగ్గు, మలిన కేకులు, కిరోసిన్ | కార్బన్ పర్టిక్యులేట్ మాటర్ | ఊపిరి పీల్చలేకపోవడం | బయోగ్యాస్, ఎల్‌పీజీ, సోలార్ కరెంటు స్టౌల వాడకం |
| ఎయిర్ ఫ్రెషనర్స్ డియోడరైజర్స్, రోగనిరోధకాలు | ఫార్మాల్డిహైడ్, ఫినాల్స్, అమ్మోనియా, సోడియం హైపో క్లోరైట్ | విష/కేన్సర్, చర్మ, కంటి సమస్యలు, అతి స్పందనలు, నరాల సమస్యలు శ్వాసకోశ మూత్ర సంబంధం | తగిన వెలుతురు, సేంద్రియ ప్రత్యామ్నాయాలు, సుగంధ పదార్థం సువాసన పువ్వులు |
| మురుగు శుభ్రపరిచే పరికరాలు, ఓవన్ క్లీనర్స్ | సోడియం, పొటాషియం హైడ్రాక్సైడ్ | కుంచించడం, నరాలు, శ్వాసకోశాలపై ప్రభావం, మూత్ర సంబంధం | డీ-గ్రీజ్‌తో బేకింగ్ సోడా, వెనిగర్ మిశ్రమం |
| ఫర్నిచర్ పాలిష్ | పెట్రోలియం మిశ్రమం | విషతుల్యం, కుంచించడం | చమురు, వెనిగర్ |
| టాయిలెట్ క్లీనర్స్ | హైపోక్లోరిక్ యాసిడ్, క్లోరినేటెడ్ ఫినాయిల్స్ | విషతుల్యం, కుంచించడం | వెనిగర్, బేకింగ్ సోడా |
| కలుషిత క్లోరినేటెడ్ జలం | క్లోరిన్, రాడాన్ | కాన్సర్ | తగిన గాలి వెలుతురు |




# కోల్‌కతా కిడ్నీలు కనుమరుగు!

**ఇక్కడ పండే కూరగాయలు, ఉత్పత్తయ్యే చేపలు పూర్తిగా విషపూరితంగా మారాయి. జలం విషపూరితం కావడం వల్ల కలిగే ప్రమాదం కంటే ఈ ప్రాంతంలో పెరిగిపోయిన తోళ్ల పరిశ్రమ కలవరపరిచే అంశం. ఫ్లై ఓవర్ పర్యావరణ పరిరక్షణ అంశంలో మరింత కలవరపరిచే అంశం.**

కోల్‌కతా తూర్పు ప్రాంతంలో గల చిత్తడిభూములు నగర జీవనానికి మూత్రపిండాల వంటవని, జీవవైవిధ్యాన్ని కాపాడడం లో ఎంతో ఉపయోగపడతాయని ప్రఖ్యాత పర్యావరణ వేత్త ధ్రుబజ్యోతి ఘోష్ అభిప్రాయపడేవారు. మానవుల శరీరంలోని వ్యర్థాలను తొలగించి జీవనాన్ని ఎలా కాపాడుతుందో కోల్‌కతాను ఈ చిత్తడి భూములు అలా కాపాడతాయని ఆయన అభిప్రాయం. సాహసవంతమైన,పట్టుదల కలిగిన పర్యావరణవేత్తగా ఆయన ప్రఖ్యాతిగాంచారు. తూర్పు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ మాఫియా కబంధహస్తాల నుంచి చిత్తడినేలలను, మత్స్యకారుల జీవనాన్ని పరిరక్షిం చిన ధీరోదాత్తుడుగా ఆయన కీర్తిపొందారు. కోల్‌కతాలో 14.5 మిలియన్ల జనాభా ఉంది. బ్రిటిష్ పాలనాకాలంలో అత్యధిక జనాభా కలిగిన నగరంగా లండన్ తరువాత కోల్‌కతా రెండోస్థానంలో నిలిచింది. సముద్రమట్టానికి ఐదుమీటర్ల ఎత్తున ఉంది. నగరంలో నుంచి రెండు నదులు వెళ్తున్నాయి. జలమార్గాలు కూడా ఉన్నాయి. నగరానికి తూర్పు దిక్కులో రియల్ ఎస్టేట్ మాఫియా నుంచి తీవ్ర ముప్పు ఏర్పడింది. విలాసవంతమైన భవనాలు, కళాశాలలతో నిండి ఎంతో ఖరీదైన ప్రదేశంగా మారింది. అభివృద్ధి పేరుతో జరుగుతున్న కార్యకలాపాలతో సముద్రమట్టం పెరుగుతోంది. వరదల పరిస్థితి, సహజ, కృత్రిమ వరదల స్థితి నుంచి కోల్‌కతాను రక్షించుకునే చర్యలు చేపట్టాలని ప్రపంచబ్యాంకు సూచించింది. 2050 నాటికి కోల్‌కతాలో సముద్ర జలాలు 20 సెంటీమీటర్లకు పెరగవచ్చునని ప్రపంచబ్యాంకు అంచనా. ప్రపంచంలో వరద ప్రమాదమున్న మూడో నగరంగా కోల్‌కతా నిలుస్తుందని తెలిపింది. ఇటీవల చెన్నైని అకస్మాత్తు వరదలు ముంచెత్తి దాదాపు 1.8 మిలియన్ల మందిని నిరాశ్రయుల్ని చేసింది. 20 ఏళ్ల క్రితం చెన్నై పరిసర ప్రాంతాల్లో 650కి పైగా చిత్తడి నేలలుండేవి. ఇప్పుడవి 27కు పరిమితమయ్యాయి. అభివృద్ధి పేరుతో చిత్తడి నేలల్ని ధ్వంసం చేయడం విధ్వంసకరమైన వినాశనానికి కారణమైంది. ఆక్రమణల వల్ల వర్షపు నీరు వెళ్లే దారిలేక కొత్తగా నిర్మించిన కాలనీల్లోకి ప్రవేశం చింది. కోల్‌కతా వ్యర్థజలాలపై పరిశోధన చేసేందుకు 1981లో ఘోష్‌కు బాధ్యతలు అప్పగించారు. వ్యర్థ



జలాల్లో 95 శాతం నీరు, ఐదు శాతం బాక్టీరియా నిండివుందని, ఇదే సమస్యగా పరిణమించిందని ఆయన అభిప్రాయపడ్డారు. సరస్సులోకి ఎంతోదూరం నుంచి వచ్చే అత్యంత విలువైన పోషకపదార్థాలున్నాయని, చెరువులు నాచుతో నిండిపోయాయి. కోల్‌కతాలో బ్రిటిష్ హయాంలో నిర్మించిన సంప్రదాయ మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిరూపయోగంగా పడివుంది. నగరంలో రోజుకు 750 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతోంది. రైతులు, మత్స్యకారులు ఈ నీటినే తాగడానికి వాడుతుంటారు. తూర్పు కోల్‌కతాలోని మాగాణి భూముల ప్రాంతం రామ్‌సర్‌లో మురికి నీటిని శుభ్రం చేసే ప్లాంట్ ఒకటే ఉంది. ఇక్కడ సూర్యరశ్మి, ఆక్సిజన్, సూక్ష్మజీవులతో రసాయనాల ద్వారా నీటిని శుద్ధిచేస్తారు. ఈ ప్రాంతంలో పోషకపదార్థాలు న్న 150 టన్నుల కూరగాయల్ని పండిస్తారు. ఏడాదికి 10,500 టన్నుల చేపలు ఉత్పత్తవుతాయి. ఇందువల్ల నేరుగా (ప్రత్యక్షంగా) 50వేల మందికి జీవనోపాధి లభిస్తుంది. ఈ చిత్తడి నేలలను ప్రపంచ దృష్టికి తేవడంలో ఘోష్ విశేష కృషిచేశారు. భూమి కోతలపై ప్రభుత్వేతర సంస్థలు, ప్రజల సహకారంతో న్యాయస్థానాన్ని ఆశ్రయిం చారు. ఫలితంగా 1992లో కోల్‌కతా హైకోర్టు చరిత్రాత్మకమైన తీర్పుచెప్పింది. మొత్తం 12,500 ఎకరాల చిత్తడి భూములను పరిరక్షించాలని, రామ్‌సర్ ప్రాంతాన్ని చిత్తడినేలను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తీర్పుచెప్పింది. అయితే, భూకబ్జాలు, అవినీతి, పరిపాలన ఒకదానితో మరొకటి అవినాభావ సంబంధం కలిగివుంటున్న నేపథ్యంలో ఈ చిత్తడి నేలల అవసరాన్ని గుర్తించవలసి ఉంది. ఆయన ఎంతగా వ్యతిరేకించినా రాజధాని అవసరాల నిమిత్తం ఈ ప్రాంతమంతా కాంక్రీట్ జంగిల్‌గా మారింది. దాంతో ఇక్కడ పండే కూరగాయలు, ఉత్పత్తయ్యే చేపలు పూర్తిగా విషపూరితంగా మారాయి. జలం విషపూరితం కావడం వల్ల కలిగే ప్రమా దం కంటే ఈ ప్రాంతంలో పెరిగిపోయిన తోళ్ల పరిశ్రమ కలవరపరిచే అంశమని ఘోష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నిర్మించిన ఫ్లై ఓవర్ పర్యావరణ పరిరక్షణ అంశంలో మరింత కలవరపరిచే అంశం. దాంతో ఆ ప్రాంతాన్ని స్మశానంగా మార్చడంలో ఇది తొలిమెట్టని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ భూముల్ని కాపాడి, పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించవలసిన బాధ్యత అందరిపై ఉంది. దీనికి తోడు డాక్టర్ ఘోష్ మరణం ఒక అశనిపాతం వంటిది.

దృష్టి

మహి డెస్క్



## శోభాయమానంగా శోభాయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం రాణి అవంతీపురం ఆలయం నుంచి యాత్ర ప్రారంభమైంది. శోభాయాత్రను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రారంభించారు. సీతారామ్ బాగ్ నుంచి మంగళ్‌హాట్, జాలిహనుమాన్, పురానాపూల్, జుమ్మెరాత్ బజార్, బేగంబజార్ ఛత్రీ చౌరస్తా, కమల్‌కాన్ దేవ్డీ, క్లాసిక్ చౌరస్తా, సిద్ధింబర్ బజార్, గౌలిగూడ, కోఠి, సుల్తాన్ బజార్ మీదుగా హనుమాన్ వ్యాయామశాల వరకు యాత్ర కొనసాగింది. శోభాయాత్రలో ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆకర్షణగా నిలిచాయి. రాముడు, హనుమంతుడు, శివుడు, భారతమాత, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. యాత్రకు అడుగడుగునా స్వాగత వేదికలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రత్యేకంగా పాటలు పాడటం అందరినీ ఆకట్టుకుంది. కాగా, నగరంలో శోభాయాత్ర సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఐదు వేలమంది సిబ్బంది, అధికారులు విధుల్లో పాల్గొన్నారని పోలీసులు తెలిపారు. ప్రార్థనా మందిరాల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పలు చోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు.

### ఇల్లందకుంటలో భారీ ఏర్పాట్లు

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలకోసం భారీ ఏర్పాట్లు చేశారు. మంత్రి ఈటల రాజేందర్ జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కళ్యాణం సందర్భంగా ఆలయ ఆవరణలో పెండాళ్ళతో పాటు ఎల్ఈడి లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూలర్లు, ఫ్యాన్‌లను ఏర్పాటుచేశారు. ఆలయంలో విద్యుద్దీకరణ పనులు పూర్తిచేశారు. కళ్యాణానికి వచ్చే భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు. స్వాగత ఆర్చీలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

# మింగేసిన బావి

## బావిలో పడ్డ ఆటో.. తొమ్మిదిమంది జలసమాధి



నిజామాబాద్ క్రైం, మార్చి 25(మనం న్యూస్): నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముప్కాల్ నుంచి మెండోరా వెళుతున్న ఓ ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. మెండోరా సమీపంలో ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తొమ్మిదిమంది మృత్యువాత పడ్డారు. వీరిలో నలుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులు ఉన్నట్టు సమా చారం. ప్రమాద సమయంలో ఆటోలో ఎంతమంది ప్రయాణిస్తున్నారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో బావిలో గజ ఈతగాళ్ల సహాయక చర్యలు కొనసాగించారు. ప్రత్యక్ష సాక్షుల సమాచారం ప్రకారం.. మెండోరా వైపు వెళుతున్న ఆటో ఈ వ్యవసాయ బావి సమీపంలో అదుపు తప్పి బావిలో పడిపోయింది. ఆ సమయంలో ఆటో కిక్కిరిసి ఉంది. ఆటోలో ఎంతమంది ఉన్నారో గుర్తించే వీలులేకుండా పోయిందన్నారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహాయక చర్యలు ప్రారంభిచారు. ప్రమాదం విషయం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. గజ ఈతగాళ్లను పిలిపించి బావిలోకి దించారు. తొలుత ఓ మహిళ మృతదేహాన్ని బావిలోంచి వెలికి తీశారు. అనంతరం మిగతావారికోసం గాలించగా మరో ఎనిమిది మృతదేహాలు లభ్యమయ్యాయి. అనంతరం ఆటోను వెలికి తీశారు. కాగా, ప్రమాదం సమయంలో ఆటోలో ఉన్న 19 మంది ప్రయాణికులలో తొమ్మిది మంది మృత్యువాత పడగా, మిగతా తొమ్మిది మందిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చినట్లు పోలీసులు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోవడం వల్లే ఈ ఘోరం చోటుచేసుకుందని పోలీసులు పేర్కొంటున్నారు. మరికాసేపట్లో గమ్యస్థానానికి ప్రయాణికులు చేరుకుంటారనగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో అక్కడ తీవ్ర విషాదం నెలకొంది. తొలుత నలుగురు లేదా ఐదుగురు మాత్రమే మరణించి ఉంటారని భావించినప్పటికీ గాలింపు చర్యల్లో మృతదేహాలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న మృతుల బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలిచివేసాయి.

**మృతులు వీరే..**

ప్రమాదంలో మరణించిన వారు.. గంగామణి (45), సాయమ్మ (50), కె.గంగవ్వ (41), ఎం.లక్ష్మి (38), పెద్దొల్ల సంపత్ (14), విజ్ఞాశ్రీ, మనశ్రీని (3), తెడ్డు చిన్న (2), తెడ్డు రాజు.. వీరంతా మోస్రా, ధర్పల్లి, కేశవపురం, వెంపల్లి, మెండోరా గ్రామాలకు చెందిన వారు.

### కాసేపట్లో గమ్యం.. అంతలోనే ఘోరం

ముప్కాల్ నుంచి వస్తున్న ఆటో మరికాసేపట్లో మెండోరా చేరుకుంటుందనగా ఈ దారుణం చోటుచేసుకుంది. పరిమితికి మించి ప్రయాణిస్తుండడంతో ఆటో అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. ఆటోలో వెలుపలి వైపునకు కూర్చున్న వారు ఈదుకుంటూ పైకి రాగా మహిళలు, చిన్నారులు నీళ్ల మింగి స్పృహ కోల్పోయారు. కాసేపటికే నిర్జీవంగా మారి బావి అడుగుకు చేరుకున్నారు. ఆటో బావిలో పడిన ఘటనను చూసి స్థానికులు స్పందించేలోగానే కొంతమంది మృత్యువాత పడ్డారు. సహాయక చర్యలు ప్రారంభించిన అరగంటలోనే ఎనిమిది మృతదేహాలను గుర్తించారు. మరికొద్ది క్షణాల్లో గమ్యం చేరుకుంటారనగా ఈ ప్రమాదం జరగడం చూపరుల కంటతడి పెట్టించింది.



### ప్రయాణికులు ఎంతమంది ?

ప్రమాదానికి కారణమైన ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఉన్నారు. మృతదేహాల సంఖ్యతో పాటు క్షతగాత్రులను లెక్కిస్తే మొత్తం 14 మంది ఆటోలో ప్రయాణిస్తున్నట్లు తొలుత భావించారు. అయితే, ప్రయాణికుల సంఖ్య ఎక్కువే ఉండొచ్చనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ప్రయాణికుల సంఖ్యపై కచ్చితమైన వివరాలు తెలియకపోవడంతో బావిలో గాలింపు చర్యలు కొనసాగించారు. దీంతో తొమ్మిది మృతదేహాలు లభ్యమయ్యాయి. క్షతగాత్రులు తొమ్మిది మందిని కలిపి మొత్తం 19 మంది ప్రయాణించినట్లు తేలింది.

### ఓవర్‌లోడ్ సాధారణమే..

ముప్కాల్-మెండోరా మధ్య ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం సాధారణమేనని స్థానికులు చెబుతున్నారు. వీటిని నిలువరించడంలో రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రోజువారి తనిఖీలు లేకపోవడం, వాహనాల నాణ్యతను పరిశీలించకపోవడంవల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాగా, వందల సంఖ్యలో ఆటోలు ఇలా రాకపోకలు సాగిస్తుండడంతో నిలువరించడం కష్టసాధ్యంగా మారిందని పోలీసులు తెలిపారు.

### మంత్రి పోచారం ఆరా

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆరా తీశారు. తక్షణమే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎంఆర్ఎం రావును ఆదేశించారు. అలాగే ఈ ఘటనలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులకు సూచించారు. ఆటో బావిలో పడటంతో పది మంది మృతిచెందారన్న వార్త తెలుసుకున్న కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ కార్తికేయ మిశ్రా, జేసీ సహా పలువురు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక పోలీసుల నుంచి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు.

## సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

హైదరాబాద్, మార్చి 25(మనం ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా ముప్కోల్ వద్ద అదివారం ఉద యం చోటు చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం పట్ల సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తీరుపట్ల ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. మృతుల కుటంబాలకు కేసీఆర్ సానుభూతి తెలిపారు. ముప్కోల్ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు మంత్రులు మహేందర్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రగాడ సానుభూతి తెలిపారు.



## అంబానీ పెళ్లికొడుకాయెనే!


(మొదటిపేజీ తరువాయి)

రసెల్ మెహతా కుమార్తె శ్లోకా మెహతాతో నిశ్చితార్థం అయింది. గోవాలో అంగరంగ వైభవంగా సాగిన ఈ వేడుకకు ముకేశ్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీ, తల్లి కోకిలాబెన్, మరికొందరు సన్నిహిత కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఆకాశ్ అంబానీ (27) ప్రస్తుతం రిలయన్స్ గ్రూపునకు చెందిన టెలికం సంస్థ రిలయన్స్ జియో బోర్డులో సభ్యుడిగా ఉన్నాడు. అతడికి కవల సోదరి ఇషా, తమ్ముడు అనంత్ అంబానీ ఉన్నారు. అంబానీలు.. మెహతాలు ఇద్దరూ దక్షిణ ముంబైలోనే ఉంటారు. కొంతకాలంగా రెండు కుటుంబాల మధ్య స్నేహం కూడా ఉంది. ముంబైలోని ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుకునే రోజుల నుంచి ఆకాశ్, శ్లోక ఒకరికొకరు తెలుసు. చాలాకాలంగా వీరిద్దరూ మంచి స్నేహితులు. నిశ్చితార్థం గురించి అధికారికంగా అటు అంబానీ, ఇటు మెహతా కుటుంబాలు ఏమీ ప్రకటించలేదు గానీ.. శనివారం రాత్రి గోవాలో ఈ సంబరం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం డిసెంబరులో స్విట్జర్లాండులో డెస్టినేషన్ వెడ్డింగ్ ఉంటుందని సమాచారం.

# పక్కన చూడండి!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల మనసెరిగి, రాజకీయాలకతీతంగా పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. మనసున్న సీఎం కేసీఆర్ అని అన్నారు. పక్క రాష్ట్రంలో పింఛన్లు మంజూరు కావాలంటే ఐదుగురు సభ్యులతో కూడిన బృందం ఆమోదించాలని, మన రాష్ట్రంలో అర్హులకు వెంటనే మంజూరు చేస్తున్నామని టీడీపీ సభ్యులనుద్దేశించి అన్నారు. సీఎం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ప్రతిపక్ష సభ్యులు సూచించారు. రాష్ట్రంలో పాలన నత్తనడకన సాగుతోందని, ఉద్యమ సమయంలో అందరివాడిగా ఉన్న కేసీఆర్.. ఇప్పుడు మాత్రం కొందిరివాడిగా మారాడని ప్రతిపక్షాలు విమర్శించాయి. గవర్నర్‌ను, ముఖ్యమంత్రిని కలవాలంటే ఎమ్మెల్యేలకే అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితి ఉందంటూ ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ విమర్శలపై మంత్రి హరీశ్‌రావు స్పందించారు. నియోజకవర్గాల్లో గత ప్రభుత్వాల హయాంలో ఏదైనా పనులు కావాలంటే ముఖ్యమంత్రి స్థాయి వరకు ఎమ్మెల్యేలు వెళ్లాల్సి వచ్చేదని.. ఇప్పుడు అధికారులే ఎక్కడికక్కడ పనులు చేసేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 24 గంటల కరెంటు, మండల కేంద్రాలకు, జిల్లా , రాష్ట్ర రాజధానికి డబుల్, నాలుగు లేన్ల రోడ్ల పనులను రాష్ట్రమంతటా ఒకే విధానంతో చేపడుతున్నామన్నారు. మిషన్ కాకతీయలో పనులు అధికార, ప్రతిపక్షాలు అనే భేదం లేకుండా చేయిస్తున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల మాదిరిగా సంకుచితంగా కాకుండా చిత్తశుద్ధితో పార్టీలకతీతంగా నిధుల కేటాయింపులకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. ఒక కుల సంఘం భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 కోట్లు కేటాయించిందని, దాని శంకుస్థాపన సందర్భంగా ప్రభుత్వం ప్రచారం కోసం దాదాపు రూ. 7.50 కోట్లు కేటాయించిందని బీజేపీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. సంక్షేమం, వ్యవసాయం, ఇరిగేషన్, ఇతరత్రా పలు శాఖలకు బడ్జెట్లో కేటాయించిన నిధులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేకపోయిందని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. కానీ సమాచార, పౌర సంబంధాల శాఖకు కేటాయించిన నిధుల కన్నా ఎక్కువగా ఖర్చు చేయటం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటమేనన్నారు. అయితే ఈ ప్రచారం చూసే ఇతర రాష్ట్రాలు ప్రశంసించడంతో పాటు.. పథకాల గురించి అడుగుతున్నాయని మంత్రి సమాధానమిచ్చారు. ప్రకటనలు ఇవ్వడం తప్పేం కాదని స్పష్టం చేశారు. వివిధ మాస, వార, కుల సంఘాల పత్రికలకు ప్రకటనలివ్వటంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. జర్నలిస్టుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ, సీపీఎం, టీడీపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీశారు. అయితే జర్నలిస్టుల సంక్షేమానికి దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని మంత్రి అన్నారు. అక్రిడేషన్లు, బస్‌పాస్‌లు, హెల్త్‌కార్డులు ఇస్తున్నామని తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకుంటున్నామని తెలిపారు. పలు పత్రికలకు ఎం ప్యానల్‌మెంట్ పూర్తి అయిందన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న జీవోలు వెబ్‌సైట్లలో పెట్టడం లేదని ప్రతిపక్షాలు పేర్కొనగా, జీవోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామని పేర్కొన్నారు. కోర్టుల్లో కేసులు పెద్ద ఎత్తున పెండింగ్ ఉంటున్నాయని, నాంపల్లి, సిటీ కోర్టుల్లో సౌకర్యాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న జడ్జీల పోస్టులను భర్తీ చేయాలని, కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు నిర్మించాలంటూ ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమాధానమిచ్చారు. కొత్త జిల్లాల్లో కోర్టు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించిందన్నారు. జడ్జీల నియామకం మన పరిధిలో లేదన్నారు. సరైన పాలన లేకపోవటం మూలంగానే కోర్టులు ప్రతి విషయానికి ప్రభుత్వానికి మొట్టి కాయలు వేస్తున్నాయని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. చట్టం, పథకం రూపకల్పన చేసే సమయంలో న్యాయ సలహాలు పక్కాగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రానికి చెందిన తాహెర్‌హుస్సేన్ అనే జవాన్ జమ్ములో వీరమరణం పొందితే ఆయన కుటుంబానికి రావాల్సిన ప్రభుత్వసాయం అందలేదని బీజేపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. గల్ఫ్ బాధితులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఐఎం సభ్యులు సూచించారు. సినిమా టికెట్ల ధరలను పెంచుకునే అవకాశం ఇచ్చే సర్కారు.. థియేటర్లలో సౌకర్యాల విషయంలోనూ దృష్టి సారించాలని, పాత్రికేయుల వేతనాల విషయంలో మజీతియా కమిటీ నివేదికను అమలు చేయాలని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కోరారు. రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన గవర్నర్... తనపై మంద కృష్ణ హత్యాయత్నానికి పన్నుతున్న కుట్రలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వాపోయారు.



## 445 కాదు.. 539 కోట్లు!

విశాఖపట్నం, మార్చి 25(మనం న్యూస్ బ్యూరో): ఐడీబీఐ బ్యాంకు స్కాం విస్తృతి రోజురోజుకూ మరింత పెరుగుతోంది. నిన్న కాక మొన్న రూ. 445 కోట్ల మేర మాత్రమే స్కాం అనుకుంటే.. ఇప్పుడది ఏకంగా రూ. 539 కోట్లకు చేరింది. అంటే సుమారు మరో వంద కోట్ల మేర లేని చేపల చెరువులు చూపించి కొందరు బ్యాంకు అధికారులు, కొందరు ప్రైవేటు వ్యక్తులు కలిసి భోం చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై సీబీఐ రంగంలోకి దిగి విచారణ మొదలు పెట్టడంతో బ్యాంకు అధికారులు ఇప్పుడు రుణాల రికవరీకోసం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. గుమాస్తా నుంచి జనరల్ మేనేజర్ వరకూ పెద్ద సంఖ్యలో ఉద్యోగుల ప్రమేయం ఉందని తెలియడంతో అరెస్టులకు సీబీఐ రంగం సిద్ధం చేసింది. 2010లో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 2012 నుంచే అనుమానాలు వ్యక్తమవుతున్నా, రుణగ్రహీతలు చెల్లింపులేమీ చేయకపోవడంతో బ్యాంక్ ఉన్నతాధికారులు ఇక సీబీఐ తలుపు తట్టక తప్పలేదు. కాగితాల మీద తప్ప భూమ్మీద ఎక్కడాలేని చేపల చెరువులు, చేప పిల్లల ఉత్పత్తి యూనిట్ల పేరిట ఏకంగా 220మంది రుణాలు తీసుకోవడమే అసలు స్కాం. రుణాల్లో ఒక్క పైసా వెనక్కిరాలేదు. దాంతో ఐడీబీఐ బ్యాంకు ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఐడీబీఐ జోనల్ మేనేజర్ ధనుంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ రంగంలోకి దిగింది. మొత్తం 220 మంది లబ్ధిదారులు 21 గ్రూపులుగా ఏర్పడి చేపల చెరువుల తవ్వకం, చేపల పెంపకం, చేపల పిల్లల విత్తన ట్యాంక్‌ల ఏర్పాటు వంటి వాటి పేరిట రుణాలు పొందారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో కూడా చేపల పెంపకం పేరిట ఈ రుణాలను పొందారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ భట్టు రామారావును ఈ రుణ వితరణకు ప్రధాన బాధ్యుడిగా గుర్తించి ఆయనను ఇప్పటికే సర్వీసు నుంచి తొలగించారు. 2010-12 సంవత్సరాల మధ్యకాలంలో గుంటూ రు ఐడీబీఐ ఏజీఎంగా పనిచేసిన చంద్రశేఖర్ చెన్నప్ప కిసాన్ క్రెడిట్ కార్డులతో రుణాల పేరిట చెరువుల తవ్వకాలకులోన్లు ఇచ్చారు. గుంటూరి మల్లికార్జునరావు అనే బ్రోకర్ ద్వారా ఈ తతంగం నడిచినట్లు సీబీఐ గుర్తించింది. అనేకమంది కూలీలు, డ్రైవర్లనే రైతులు, లబ్ధిదారులుగా చూపించి వారి పేరిట కోట్ల రుణాలను మంజూరు చేశారు. ఇందులో 42 మంది వ్యక్తులు, బ్యాంకు అధికారుల ప్రమేయం ఉన్నట్లు సీబీఐ ప్రాథమికంగా గుర్తించింది. విశాఖపట్నా నికి చెందిన డీకే సాహూ అనే వ్యక్తి కూడా ఇందులో రుణం పొంది ఆ డబ్బును తన సొంత సేవింగ్స్ ఖాతాకు బదిలీ చేసుకొన్నట్లు సీబీఐ గుర్తించింది. విశాఖతో పాటు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, అత్తిలి, ఉండి, కాకినాడ, ఇంకా గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో సీబీఐ విచారణ ప్రారంభించింది.

# సీపీఎస్ అంతమవ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అన్యాయంగా మారిన సీసీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందేనని గర్జించారు. ఆదివారం సరూర్‌నగర్ ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన 'సకల ఉద్యోగుల మహాసభ' జరిగింది. సీపీఎస్ రద్దు, ఉద్యోగుల బదిలీలపై నిషేదం, ఆర్డర్‌టు సర్వేతో పాటు వివిధ ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి తెలంగాణ, ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ ఫెన్షనర్ల మరియు కార్మికుల ఐక్యకార్యాచరణ సమితి(టీఈజేఏసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, టీజీవో సంఘం గౌరవాధ్యక్షుడు వి.శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. నాలుగేళ్ల పసిగుడ్డును విమర్శించడం తగదని శ్రీనివాస్ గౌడ్ అనడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రభుత్వానికి అండగా నిలిచాం..నిర్లక్ష్యం తగదు

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ధీటుగా ఉద్యోగులు తరలిరావడం ఉద్యోగుల సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రభుత్వం అర్థం చేసుకోవాలని టీఈజేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక ఉద్యమంలో సహాయనిరాకరణ, సకలజనుల సమ్మె, వంటావార్పు మొదలుకొని నేటి తెలంగాణ ప్రభుత్వంలో భూరికార్డుల ప్రక్షాళన వరకు ఉద్యోగులు ప్రభుత్వానికి ఎంతో అండగా ఉన్నామన్నారు. 100 రోజుల్లో 100 ఏళ్ల భూ రికార్డులను తయారు చేశామన్నారు. ఈ రోజును ఉద్యోగులు ఆత్మగౌరవదినంగా భావిస్తున్నామన్నారు. కాగా, సీపీఎస్‌ను రద్దు చేయాలని 14 సంవత్సరాలుగా విన్నవించుకుంటున్నా ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తోందని ఉద్యోగ సంఘాల నేతలు మండిపడ్డారు. పెన్షన్ హక్కును కాలరాసిన పీఎఫ్ఆర్డీఏ బిల్లును వెనక్కి తీసుకొని సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు నినదించారు.

### సీపీఎస్ భూతాన్ని తరిమికొడదాం: మమత

ప్రభుత్వ ఉద్యోగులు పదవీవిరమణ అనంతరం మంచి జీవితం గడపాలని చేసిన ఫించన్ పథకాన్ని ఎత్తివేసి యూపీఏ ప్రభుత్వం ఉద్యోగుల బతుకుల్లో చీకట్లు నింపితే రాష్ట్ర ప్రభుత్వం రెండు మూడు జీవోలు జారి చేసి దానిని కొనసాగిస్తుందని టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు వి.మమత ధ్వజమెత్తారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధులుగా ఉండే ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని మమత అన్నారు. సీపీఎస్ లక్షకు పైగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పాలిట భూతమైన సీపీఎస్ నుంచి రాష్ట్రాన్ని తప్పించి వైదొలిగిన మొదటిరాష్ట్రంగా నిలుపాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రలో 29 మంది క్లాస్-4 ఉద్యోగులు పనిచేస్తున్నారని వారిని వెంటనే తెలంగాణకు రప్పించాలని డిమాండ్ చేశారు. జీతాలకంటే ప్రజల జీవితాలు ముఖ్యమనే నినాదంతో 43రోజులు సకలజనుల సమ్మె చేసిన ఉద్యోగులపై ప్రభుత్వ విధానం దారుణంగా ఉందని మమత మండిపడ్డారు. ఇటీవల తొలగించిన 1100మంది హౌజింగ్ కార్పొరేషన్ ఉద్యోగులను వెంటనే తీసుకోవాలని మమత డిమాండ్ చేశారు.

### నాలుగేళ్ల పాలనలో తీవ్ర నష్టం

తెలంగాణ రాష్ట్రంలో 4ఏళ్ల టీఆర్ఎస్ పాలనలో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్ అన్నారు. 43% ఫిట్‌మెంట్ ఇచ్చామని ప్రగల్బాలు పలుకుతున్నారని తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్రకు అది ఎంతో చిన్నదని రాజేందర్ అన్నారు. ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగులపై చిన్నచూపు చూపుతోందని ఆంధ్రలో 800మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రలో ఇప్పటికి 100మంది వరకు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగులకు అన్నీ అవమానాలే జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి బోలాశంకరుడే అందరికీ న్యాయం చేస్తున్నారని కానీ ఉద్యోగుల సమస్యలు ఆయన వరకు చేరకుండా కొంతమంది అధికారులు అడ్డుకుంటున్నారన్నారు.

### సీపీఎస్ రద్దు చేస్తే సీఎం ఫెడరల్ ఫ్రంట్‌కు బలం..


ఇప్పటి వరకు ఉద్యోగుల సమస్య ప్రగతి భవన్‌నుంచి సరూర్‌నగర్ స్టేడియం వరకు మాత్రమే వచ్చిందని భవిష్యత్‌లో రాష్ట్ర వ్యాప్తం అవుతుందని ఇంటర్ విద్య ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమనాయకుడిగా ఉన్న సీఎం కేసీఆర్‌కు ఉద్యోగులే మద్దతుగా నిలిచారని ఆయన తెలిపారు.

### ఉద్యోగుల తీర్మానాలు..

- నూతన పీఆర్సీ వెంటనే వేయాలి
- ఉద్యోగుల బదిలీలపై నిషేదాన్ని వెంటనే ఎత్తివేయాలి
- ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెంటనే
- ఆర్డర్‌టు సర్వ్‌ను రద్దు చేయాలి
- జిల్లా గ్రంథాలయలు, మార్కెట్ కమిటీ మరియు ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులకు010వేతనాలు చెల్లించాలి.
- పదవీవిరమణ వయస్సును 60 సంవత్సరాలకు పెంచాలి.
- ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలి
- ఫించన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి.
- కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలి
- మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి.

## అక్కడ నగ్నంగా నిలబడినా తప్పండదు.. 'ఆధార్'పై మాత్రం అభ్యంతరాలు!

- బికినీలు వేసుకుని కూడా రావొద్దంటారు!
- కేంద్ర మంత్రి కేజే ఆల్ఫోన్స్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మార్చి 25: 'ఆధార్' అనుసంధానం.. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరమని పేర్కొంటూ వివిధ వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కేజే ఆల్ఫోన్స్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఫేస్‌బుక్ ఉదంతం, ఆధార్ డాటా లీకేజీ, నమో యాప్ ద్వారా వ్యక్తిగత సమాచారం చేరవేత తదితర వివాదాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో అల్ఫోన్స్ స్పందించారు. ''అమెరికా వీసా కోసం నేను 10 పేజీల దరఖాస్తు ఫారాన్ని నింపాను. అక్కడి అధికారులకు మన చేతి వేలి ముద్రలు ఇస్తాం. భద్రతా పరమైన తనిఖీల కోసం శ్వేత జాతీయుల ముందు నగ్నంగా నిలబడతాం. ఇలాంటి విషయాల్లో మనకు ఎలాంటి సమస్య ఉండదు. కానీ.. మన చుట్టూ ఉన్న అధికారులు, ప్రభుత్వం మన వివరాలు సేకరిస్తే అనుమానాలు కలుగుతాయి. అది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరమని వాదిస్తారు'' అని పేర్కొన్నారు. వివిధ పథకాలకు ఆధార్ డేటాను అనుసంధానం చేయడంపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ఇలా స్పందించారు. ''విదేశాల్లో రోడ్ల మీద విదేశీయులు బికినీలేస్కుని తిరుగుతారు. కానీ, ఇండియా విషయానికొస్తే ఇక్కడ అలా తిరగటం కుదరదు. లాటిన్ అమెరికాలో రోడ్లపైనే మహిళలు బికినీలతో దర్శనమిస్తుంటారు. మన దగ్గర గోవా బీచ్‌లో అలాంటి స్వేచ్ఛ ఉంది. కానీ, వీధుల్లో మాత్రం అలా తిరిగేందుకు ఒప్పుకోం'' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

## మార్కులు కావాలా.. ముద్దివ్వు!

- విద్యార్థినిపై ప్రొఫెసర్ వేధింపులు
- పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఎట్టకేలకు కాలేజి ప్రొఫెసర్ అరెస్టు

ముంబై, మార్చి 25: పరీక్షలలో మంచి మార్కులు రావాలంటే.. తనకు ముద్దివ్వాలని 17 ఏళ్ల విద్యార్థినిని 35 ఏళ్ల ప్రొఫెసర్ కోరి.. ప్రస్తుతం కటకటాల వెనుక కూర్చుని ఊచలు లెక్కపెడుతున్నాడు. ముంబైలోని ఓ జూనియర్ కాలేజిలో ఈ ఘటన చోటుచేసుకంది. కామర్స్‌లో జూనియర్ ఇంటర్ చదువుతున్న ఆ విద్యార్థిని మార్కులు కావాలంటే తనకు ముద్దివ్వాలని ప్రొఫెసర్ బలవంతపెట్టడంతో తీవ్రమైన డిప్రెషన్‌కు గురైంది. ఆమె ప్రవర్తన సరిగా లేకపోవడాన్ని కుటుంబ సభ్యులు గమనించి.. విషయం ఏంటని అడిగారు. మొదట్లో ఏమీ మాట్లాడని ఆమె.. చివరకు నోరువిప్పి జరిగిన విషయం మొత్తాన్ని తన తల్లిదండ్రులకు చెప్పి భోరుమంది. దాంతో వాళ్లు ఘట్కోపర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాంతోపాటు.. వెంటనే సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించి పోలీసు స్టేషన్ ఎదుట పెద్ద సంఖ్యలో మద్దతుదారులను సమీకరించారు. దాంతో చేసేదేమీ లేక సదరు ప్రొఫెసర్‌ను పోలీసులు అరెస్టుచేశారు. నిందితుడిపై ఐపీసీ, పోక్సో సెక్షన్ల కింద లైంగిక వేధింపు, లైంగికదాడి కేసులు నమోదు చేశారు. నగరంలోని ప్రముఖ కళాశాలలో కామర్స్ బోధించే సదరు అధ్యాపకుడు మంచి మార్కులు ఇవ్వాలంటే తనకు ముద్దుపెట్టాల్సిందేనని ఆ విద్యార్థినిపై బాగా ఒత్తిడి చేసినట్లు విచారణలో తేలింది.



## ఒక్క విద్యార్థి.. 50 కిలోమీటర్లు!

- మహారాష్ట్రలో ఓ టీచర్ నిబద్ధత

ముంబై, మార్చి 25: ఆ పాఠశాలలో చదువుకునేది ఒక్క విద్యార్థే.. కానీ ఆ విద్యార్థి కోసం టీచర్ ఏకంగా 50 కిలోమీటర్లు ప్రయాణం చేసి మరీ బోధన చేస్తారు. కొండలు, గుట్టలు దాటుకుంటూ.. మట్టిరోడ్లపై ప్రయాణం చేస్తూ మరీ విధులు నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రం భోర్‌కు దగ్గర్లో ఉన్న చందార్ అనే గ్రామం. పూణెకు 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలోనే ఉంటుంది. ఆ ఊర్లో ఉండేది 15 గుడిసెలే. అంటే ఓ 60 మంది మాత్రమే ఉంటారు. ఎటువంటి సదుపాయాలు లేని ఓ కుగ్రామం. అయితే ఊర్లో ఓ స్కూల్ కూడా ఉంది. కాని.. విద్యార్థుల సంఖ్య మాత్రం ఒకటే. అవును.. గత రెండేండ్ల నుంచి ఎనిమిదేండ్ల యువ్‌రాజ్ సంగాలే మాత్రమే ఆ స్కూల్‌కు దక్కిన ఏకైక విద్యార్థి. అయితే.. ఇక్కడ విశేషం ఇది మాత్రమే కాదు. ఆ విద్యార్థికి పాఠాలు చెప్పడానికి ఏకంగా 50 కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చే టీచర్ రంజినీకాంత్‌తే గొప్పతనం. ఆ యాభై కిలోమీటర్లు ప్రయాణం చేయడమంటే ఆ టీచర్ మరో జన్మ ఎత్తినట్లే. ఎందుకంటే.. అందులో ఓ 12 కిలోమీటర్లు అంతా మట్టి రోడ్డే. అదికూడా బండి కూడా నడవలేని స్థితిలో ఉండే రోడ్డు అది. ఆ రోడ్డు దాటడానికే కనీసం ఓ గంట సమయం పడుతుంది. ఇక.. వర్షాకాలమైతే.. ఆ టీచర్ బాధలు వర్ణణాతీతం. అన్ని బాధలు పడుతూ.. చివరకు స్కూల్‌కు చేరుకుంటే అక్కడ ఉండేది ఒకే ఒక్కడు. అయినా.. రంజనీకాంత్ తన విధులను యథావిధిగా నిర్వహిస్తున్నాడు. ఈ విషయం సోషల్ మీడియాతో ద్వారా వెలుగులోకి రావడంతో టీచర్‌కు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



## యూపీలో వరుస ఎన్‌కౌంటర్లు

- తెల్లవారుజామునే తుపాకుల గర్జన
- ఇద్దరు వాంటెడ్ నిందితుల కాల్చివేత

లఖ్‌నవ్, మార్చి 25: ఉత్తరప్రదేశ్ పోలీసులు మరోసారి త మ తుపాకులకు పని చెప్పారు. ఇటీవలి కాలంలో వరుస ఎన్‌కౌంటర్లతో నేరగాళ్లను గజగజలాడించిన యూపీ పోలీసులు ఆదివారం మరోసారి ఉదయాన్నే పనిలోకి దిగిపోయారు. ఢిల్లీ, నోయిడాలలో పలు హత్య కేసులలో నిందితుడైన శ్రావణ్ చౌదరిని నోయిడాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పోలీసులు కాల్చిచంపారు. అతడి తలకు నోయిడా, ఢిల్లీలలో రూ. 50 వేల చొప్పున వెలకట్టారు. అతడి వద్ద నుంచి ఒక ఏకే-47, ఒక ఎస్‌బీబీఎల్ గన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇక సహారన్‌పూర్‌లో ఎప్పటినుంచో పోలీసులు వెతుకుతున్న నిందితుడు ఎహసాన్ అలియాస్ సలీంకు బుల్లెట్ గాయాలయ్యాయి. తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. అతడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించాడు. ఎహసాన్ మీద ఏకంగా 50 కేసులు నమోదయ్యాయి. అతడి తలమీద రూ. 25వేల వెల ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఎస్ఐ సచిన్‌కుమార్ గాయపడ్డారని సహారన్‌పూర్ ఎస్ఎస్‌పీ బబ్లూ కుమార్ తెలిపారు.



శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం అయోధ్యలోని సరయూ నదీ తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



వసంత దుర్గ పూజ సందర్భంగా కోల్‌కతాలో చిన్నారులను దుర్గా మాతలుగా పరిగణించి పూజలు చేస్తున్న దృశ్యం

# అంబేద్కర్ కలల భారతం!



## 'పేదోడి విజయం' సాకారం

- అణగదొక్కాలని చూసినా ఎదుగుదల
- దానికి నేనే నిదర్శనం: ప్రధాని మోదీ
- రాజ్యాంగనిర్మాత ఆశయాలే మనకు స్ఫూర్తి
- 'గ్రామ స్వరాజ్ అభియాన్'గా జయంతి
- ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు నిర్వహణ
- మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ
- గాంధీజీ.. శాస్త్రి.. చరణ్ సింగ్‌ల ప్రస్తావన
- దేశాని వ్యవసాయమే వెన్నెముక అని వెల్లడి
- దేశ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, మార్చి 25: నేటి నవ భారతంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కన్న కలలు సాకారమయ్యాయని, బడుగు వర్గాలను ఎందరు అణగదొక్కాలని చూసినా.. వారి అభివృద్ధిని అడ్డుకోలేకపోయారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పేదోడి తాను అనుకున్న దానిలో విజయం సాధించాలని అంబేద్కర్ కలలు కన్నారని, అది నేడు నిజమైందని, అందుకు తానే నిదర్శనమని చెప్పారు. ప్రతి నెలా నిర్వహించే 'మన్ కీ బాత్' రేడియో ప్రసంగం కార్యక్రమంలో ప్రధాని మోదీ దేశ ప్రజలతో తన మనోగతాన్ని పంచుకున్నారు. దేశ ప్రజలందరికీ ఆయన శ్రీరామ నవమి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం వ్యవసాయం, ఆరోగ్యం, పంటల గిట్టుబాటు ధరలు, యోగా తదితర అంశాల గురించి ఆయన ప్రస్తావించారు. సరికొత్త భారతావనిని సృష్టించడానికి దేశప్రజలందరూ సహకరించాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. కన్న కలలు సాకారం చేసుకోవాలంటే ధనిక కుటుంబంలోనే పుట్టాల్సిన అవసరం లేదని, పేద, సామాజికంగా వెనుకబడిన వర్గాలలో పుట్టిన వారు కూడా ధైర్యంగా కలలు కని.. వాటిని సాకారం చేసుకోవచ్చని అంబేద్కర్ మనకు ఆచరణాత్మకంగా చూపించారని మోదీ చెప్పారు. ఆయనను ఎందరో అణగదొక్కాలని చూసినా జీవితంలో విజయం సాధించారని గుర్తు చేసుకున్నారు. అంబేద్కర్ సిద్ధాంతానికి తానూ ఓ ఉదాహరణగా ప్రధాని చెప్పారు. ఆయన ఆశయాలే మనకు స్ఫూర్తి కావాలని పిలుపునిచ్చారు. వచ్చే 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామాభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయంపై దేశవ్యాప్తంగా 'గ్రామ స్వరాజ్ అభియాన్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో ఉపాధి పెరగాలంటే పారిశ్రామికీకరణ జరగాలని ఎన్నో ఏళ్ల క్రితమే అంబేద్కర్ చెప్పారని, నేటి మేకిన్ ఇండియా కార్యక్రమానికి అదే స్ఫూర్తి అని మోదీ పేర్కొన్నారు.

### పోటీతత్వంతో కూడిన సహకార సమాఖ్య

దేశ విభజన, రెండో ప్రపంచ యుద్ధ సమయం, ప్రచ్ఛన్న యుద్ధం.. వంటి వాటి గురించి అంతా మాట్లాడుతున్న సమయంలో ఐక్యత గురించి మాట్లాడిన ఏకైక వ్యక్తి అంబేద్కర్ అని మోదీ చెప్పారు. సమాఖ్య స్ఫూర్తి, సమాఖ్య వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఆయన గట్టిగా చెప్పారని, దేశాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలన్నారని గుర్తు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో తమ ప్రభుత్వం పోటీతత్వంతో కూడిన సహకార సమాఖ్య వ్యవస్థను ఎంచుకుందని వెల్లడించారు.

### రైతు సంక్షేమమే ధ్యేయం

దేశ ఆర్థిక వ్యవస్థకు, మనిషి జీవనానికి వ్యవసాయం ఎంతో ప్రాముఖ్యమైనదని మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి, చరణ్ సింగ్, రామ్ మనోహర్ లోహియా వంటి వాళ్లు చెప్పారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. భూమిని సాగు చేయడం మరిస్తే.. మనల్ని మనం మరచిపోయినట్లేనని గాంధీజీ చెప్పిన సూక్తిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశానికి వెన్నెముక లాంటి రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఈ ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. రైతులు పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర అందేలా చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కాగా, పేద ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాలను తీసుకొస్తోందని ఆయన తెలిపారు. 3000 జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే 800 రకాల మందులు ప్రజలకు అందేలా చూస్తున్నామన్నారు. మోకాలి శస్త్రచికిత్స ధరను 50-70 శాతానికి తగ్గించామని, ఆయుష్మాన్ భారత్ కింద 10కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5లక్షల చొప్పున బీమా అందేలా పథకాన్ని తీసుకొచ్చామని పేర్కొన్నారు.

### ప్రసంగంలో సామాన్యుల ప్రస్తావన

మన్ కీ బాత్ ప్రసంగంలో ప్రధాని మోదీ దేశానికి సేవ చేస్తున్న కొందరు సామాన్యుల గురించి ప్రస్తావించారు. అసోంలోని కరీంజంగ్ ప్రాంతానికి చెందిన రిక్షా తొక్కే అహ్మద్ అలీ పేద చిన్నారుల కోసం ఆయన తన కష్టార్జితంతో తొమ్మిది పాఠశాలలను కట్టించారని తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. సామాన్య భారతీయుడి శక్తి ఏమిటనేది ఆయన నిరూపించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని ప్రధాని ప్రశంసించారు. అలాగే కోల్‌కతాకు చెందిన సైదుల్ లష్కర్ అనే వ్యక్తి సోదరి సరైన చికిత్స అందక 13ఏళ్ల క్రితం మరణించడంతో ఈ పరిస్థితి మరెవరికీ రాకూడదని తన గ్రామమైన పున్రిలో 30 పడకల ఆస్పత్రిని కట్టించాడని చెప్పారు. తన ఇంట్లోని బంగారం అంతా అమ్మి, కొంత విరాళాలు సేకరించి అతడు ఈ పని చేశాడని, ఇదే నవ భారత శక్తి అని మోదీ చెప్పారు.

### అమ్మవారు ఆదేశించారంటూ..

## కన్ను పెకిలించి సమర్పించిన బాలిక

### బిహార్‌లోని బహేరీలో వెలుగుచూసిన ఘటన

పట్నా, మార్చి 25: పరమేశ్వరుడికి కన్ను తీసి ఇచ్చిన 'భక్తకన్నప్ప' కథ మనందరికీ తెలిసిందే. ఇలాంటి ఘటనే బిహార్‌లో చోటుచేసుకుంది. ఓ 16 ఏళ్ల బాలిక అమ్మవారి ఆలయానికి వెళ్లి అందరూ చూస్తుండగానే తన కన్ను అర్పించి అందరినీ షాక్‌కు గురిచేసింది. దర్భాంగ జిల్లాలోని బహేరీ ప్రాంతానికి చెందిన కోమల్ కుమారి అనే బాలిక చైత్ర నవరాత్రుల్లో భాగంగా దగ్గర్లోని అమ్మవారి ఆలయానికి వెళ్లింది. ప్రార్థన చేస్తూనే తన కన్ను పొడుచుకుని అమ్మవారికి అర్పించింది. అది చూసి అక్కడున్న భక్తులంతా షాకయ్యారు. వెంటనే బాలికను ప్రథమ చికిత్స నిమిత్తం దగ్గర్లోని మెడికల్



సెంటర్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమించడంతో దగ్గర్లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కోమల్ అమ్మవారి భక్తురాలని గత పదేళ్లుగా ఇలాంటి పండుగల సమయంలో ఉపవాసాలు, పూజలు చేస్తుంటుందని స్థానికులు తెలిపారు. అమ్మవారు కలలో కనపడి అవయవదానం చేయాలని చెప్పిందని కోమల్ తమతో చాలా సార్లు అంటుండేదని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## న్యూయార్క్‌లోనూ బురిడీ స్కీం

- కోటిన్నర కొట్టేసిన భారత సంతతి వ్యక్తి
- నికేత్ షాపై ఫెడరల్ కోర్టులో కేసు
- స్నేహితులు.. సహోద్యోగులకే టోపీ

న్యూయార్క్, మార్చి 25: ప్రజలకు బురిడీ కొట్టి వారి వద్ద డబ్బులు కొట్టేసే పథకాలు కేవలం భారత దేశంలోనే కాదు.. అమెరికాలోనూ ఉన్నాయి. ఇలా దాదాపు కోటిన్నర రూపాయలకు పైగా (2.50 లక్షల డాలర్లు) కొట్టేసి న భారత సంతతి వ్యక్తిని అమెరికాలో అరెస్టు చేశారు. సొం త స్నేహితులు, సహోద్యోగులనే అతడు మోసం చేశాడని నికేత్ షాపై కేసు పెట్టారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌చేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) అతడి ఆస్తులు ఫ్రీజ్ చేయాలని ఆదేశిం చింది. తాను మార్కెటింగ్ చేసిన రెండు ఫండ్లలోకి 15 మంది పెట్టుబడిదారులతో లక్షలాది రూపాయలను ప్టెటుబడి గా పెట్టించడానికి స్పార్క్ ట్రేడింగ్ గ్రూప్‌ను నికేత్ షా నెల కొల్పినట్లు బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టులో ఎస్ఈసీ ఫిర్యాదు చేసింది. ట్రేడర్‌గా తాను విజయాలు సాధించానని, స్పార్క్ ట్రేడింగ్ భారీ లాభాల్లో ఉందని అబద్ధాలు చెప్పి వాళ్లతో పెట్టుబడులు పెట్టించాడు. తాను మదుపుదారుల డబ్బును ఎలా పెట్టుబడి పెడతానో కూడా తప్పుగా చెప్పాడు. తన ఫైనాన్షియల్ స్టేట్ మెంట్లలో కూడా నిజానికి నష్టాలు వస్తు న్నా, వాటిని లాభాలు వస్తున్నట్లు తప్పుగా చూపించి వాళ్ల ను మోసం చేశాడు. ప్రతినెలా లాభాలు వస్తాయని చెప్పి, వాళ్లతో పెట్టుబడులు పెట్టించిన నికేత్ షా... ఆ డబ్బును తన సొంత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసి, తర్వాత భారీగా నష్టాల పాలయ్యాడు. పెట్టుబడి పెట్టినవాళ్లు తమ డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే ప్రభుత్వ సంస్థలు, ఎస్ఈసీ డబ్బును ఫ్రీజ్ చేశాయని అబద్ధాలు చెప్పాడు. ఇలా సొంత స్నేహితులు, సహోద్యోగులను మోసం చేసేవాళ్లు.. తాము వెంటనే వస్తామన్న విషయం కూడా తెలుసుకోవాలని ఎస్ఈసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అసోసియేట్ డైరెక్టర్ మెలిసా హాడ్జ్‌మన్ తెలిపారు. ఫెడరల్ సెక్యూరిటీస్ చట్టాల కింద స్పార్క్ ట్రేడింగ్, నికేత్ షాలపై ఎస్ఈసీ పలు సెక్షన్ల కింద ఫిర్యాదు చేసింది. అక్రమంగా సంపాదించిన సొమ్మును వడ్డీ, జరిమానాతో సహా తిరిగి చెల్లించాలని చెబుతోంది.

## 'నమో' యాప్‌తో డాటా చోరీ!


- అమెరికన్ కంపెనీలకు చేరవేత
- ఫ్రెంచ్ హ్యాకర్ ఎలియట్ అల్డర్సన్ వెల్లడి
- ప్రధాని మోదీపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు



న్యూఢిల్లీ, మార్చి 25: ప్రధాని నరేంద్రమోదీకి చెందిన 'నమో యాప్'ను వినియోగిస్తున్నారా? అయితే.. మీ వ్యక్తిగత సమాచారం అంతా అమెరికా కంపెనీలకు చేరుతోందట. ఈ విషయం ఫ్రెంచ్ హ్యాకర్ ఎలియట్ అల్డర్సన్ వెల్లడించారు. '' నరేంద్ర మోదీ అండ్రాయిడ్ నమో యాప్ వ్యక్తిగత యూజర్ల సమాచారంపై రాజీపడుతోంది, యూజర్ల సమాచారాన్ని అమెరికన్ కంపెనీగా భావిస్తున్న ఇన్.డబ్ల్యూజడ్ఆర్‌కేటీ.కామ్‌కు చేరవేస్తోంది. నమో యాప్‌లో మీ ప్రొఫైల్ క్రియేట్ అయిన వెంటనే మీ డివైజ్ సమాచారతో పాటు వ్యక్తిగత డేటా మొత్తం మీ ఆమోదం లేకకుండానే అమెరికన్ సంస్థకు చేరుతోంది'' అని అల్డర్‌సన్ వరుస ట్వీట్లలో వెల్లడించారు. కాగా, నమో యాప్‌లో డేటా ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. అదే సమయంలో ఈ విషయంలో ప్రధాన మీడియా సంస్థలు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడాన్ని కూడా ప్రస్తావించారు. '' హాయ్..నా పేరు నరేంద్ర మోదీ..నేను భారత ప్రధానిని.. మీరు నా అధికారిక యాప్‌కు సైనప్ అవగానే మీ డేటా అంతటిని నా సహచర అమెరికన్ కంపెనీలకు ఇచ్చేస్తా'' అని రాహుల్ ట్వీట్ చేశారు. ''ఎప్పటిలానే ఇంతటి కీలక అంశాన్నీ మరుగునపరిచిన మీడియాకు థ్యాంక్స్'' అని చురకలు వేశారు.

# వాళ్ల వల్లే ఓడాం

### ఎస్పీ-బీఎస్పీ మైత్రిపై అమిత్ షా.. యూపీ ఉప ఎన్నికలపై వ్యాఖ్యలు



- బుల్లెట్‌కు బాంబుతోనే సమాధానం
- పాక్ సమస్యకు అదే ఏకైక పరిష్కారం
- బీజేపీ జాతీయాధ్యక్షుడి దూకుడు

న్యూఢిల్లీ, మార్చి 25: బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తొలిసారిగా ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఉప ఎన్నికల ఓటమి కారణాన్ని అంగీకరించారు. సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీల మధ్య ఎన్నికల ఒప్పందం ఉండటం వల్లే తాము ఓడిపోయామన్నారు. బీజేపీ ఓటమికి కారణాలు విశ్లేషించేందుకు ఒక కమిటీని ఏర్పాటుచేశామని ఆయన చెప్పారు. అలాగే 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికలలో తమ పార్టీ 50 శాతానికి పైగా ఓట్లు సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. జాతీయ వార్తా చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనీ విషయాలు వెల్లడించారు. 2019 ఎన్నికల్లో కూడా ఎస్పీ-బీఎస్పీ మైత్రి వల్ల బీజేపీ నష్టపోతుందా అన్న ప్రశ్నకు.. అదంత సులభం కాదని ఆయన సమాధానమిచ్చారు. కేవలం రెండు స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికలను మాత్రమే మీడియా చూస్తోందని, అలాగే కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో స్వీట్లు కూడా పంచుకుందని.. కానీ వాళ్ల నుంచి 11 రాష్ట్రాలు తాము గుంజుకున్న విషయాన్ని గానీ, త్రిపురలో తమ విజయం గురించి గానీ ఎవరూ మాట్లాడటం లేదని షా వ్యాఖ్యానించారు. ఉప ఎన్నికలు ప్రధానంగా స్థానిక అంశాల ఆధారంగా జరుగుతాయని, కానీ సార్వత్రిక ఎన్నికల్లో సీనియర్ నాయకులు, పెద్ద పెద్ద అంశాలు ఉంటాయని చెప్పారు. అతివిశ్వాసం వల్లే ఓడి పోయామన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలను ప్రస్తావించగా.. ఆయన దేని గురించి ఆ మాట అన్నారో తనకు తెలియదని తప్పించుకున్నారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం, శివసేన లాంటి మిత్రపక్షాల సాయం లేకుండా పోటీ చేయడంపై ప్రశ్నించగా.. 2014లో తమతో 11 పార్టీలు జత కలిశాయని, వాళ్లలో కేవలం ఒక్కరు మాత్రమే పక్కకు తప్పుకొన్నారు తప్ప మిగిలిన ఎన్డీయే మొత్తం ఒక్కటిగానే ఉందని సమాధానమిచ్చారు.

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరును గమనిస్తే ఆ రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో తమ విజయం ఖాయంగా కనిపిస్తోందని చెప్పారు. పాక్ సరిహద్దుల్లో తరచు జరుగుతున్న కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలపై ప్రశ్నించగా, ''పాకిస్థాన్ వాళ్లు కాల్చే ప్రతి బుల్లెట్‌కు ఒక బాంబుతో సమాధానమిస్తాం. అదే ఏకైక పరిష్కారం'' అని ఆయన తెలిపారు.

## 2019లో బీజేపీ ఓటమి

- గోరఖ్‌పూర్, పూల్‌పూర్ ఫలితాలే నిదర్శనం
- దేశమంతా ఇవే పవనాలు: అఖిలేశ్ యాదవ్



లఖ్‌నవ్, మార్చి 25: 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ అన్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో గోరఖ్‌పూర్, పూల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందనే సందేశాన్ని ఈ ఫలితాలు దేశవ్యాప్తంగా పంపాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలవడం తమ పార్టీకి భారీ విజయమని, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపిందని అన్నారు. ఎంపీలుగా ఉన్న ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య రాజీనామాలతో గోరఖ్‌పూర్, పూల్‌పూర్‌కు ఉప ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. బీజేపీకి కంచుకోటలైన ఈ స్థానాల్లో బీఎస్పీ మద్దతుతో ఎస్పీ.. కమలం పార్టీని ఓడించడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ''ఉప ఎన్నికల్లో మాకు విజయం దక్కడమే కాదు సీఎం, డిప్యూటీ సీఎంలకు ఓటమి ఎదురైంది. బీజేపీ తరపున యోగి ప్రచారం చేసినా ఆయన సొంత సీటును గెలిపించలేకపోయారు. ఈ ఫలితాల ద్వారా దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించగలమే విశ్వాసం ఏర్పడింది'' అని అఖిలేష్ అన్నారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో ఎస్పీ మద్దతు ఇచ్చిన బీఎస్పీ అభ్యర్థి భీంరామ్ అంబేద్కర్ ఓడిపోవడంపై ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ధనబలంతో, అధికార దుర్వినియోగంతో కుట్రపన్ని ఓ దళితుడిని ఓడించిందని, ఆ పార్టీ విధానం ఇదేనని అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్పీ, బీఎస్పీ బంధం బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన బీఎస్పీ చీఫ్ మాయావతికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామగ్రామానికి వెళ్లి పార్టీని బలోపేతం చేస్తామని, బీజేపీ ఎన్నో హామీలిచ్చి ఎన్నికల్లో గెలిచిందని, అధికారంలోకి వచ్చాక వాగ్దానాలను విస్మరించిందని, ప్రజలు ఉప ఎన్నికల్లో ఆ పార్టీపై ప్రతీకారం తీర్చుకున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తన భార్య, కనౌజ్ ఎంపీ డింపుల్ యాదవ్ పోటీ చేయరని అఖిలేష్ చెప్పారు. కాంగ్రెస్‌తో సత్సంబంధాలున్నాయని చెప్పారు. ఉప ఎన్నికల్లో ఎస్పీ విజయం సాధించడంపై తన తండ్రి, మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారని, విజేతలను అభినందించారని అఖిలేష్ తెలిపారు.



# వెంకటేశ్, వరుణ్‌తేజ్ 'ఎఫ్2'



మల్టీస్టారర్స్ సినిమాలు చేయడంలో ఎప్పుడూ ముందుంటే వెంకటేశ్ ఇప్పుడు మరో హీరోతో కలిసి సినిమా చెయ్యబో తున్నారు. ఫిదా, తొలిప్రేమ చిత్రాలతో హీరోగా తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్న వరుణ్‌తేజ్ కాంబినేషన్‌లో హీరో వెంకటేశ్ ఓ సినిమా చెయ్యబోతున్నారు. ఆ సినిమా పేరు 'ఎఫ్2' (ఫన్‌అండ్ ఫ్రస్టేషన్). ఎన్నో విజయ వంతమైన చిత్రాలను నిర్మించిన శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్ వంటి కమర్షియల్ హిట్ సినిమాలను రూపొందించిన అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'ఎఫ్2' రూపొం దనుంది. అనిల్ రావిపూడి సినిమాల్లో ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మాస్ ఆడియన్స్‌ని ఆకట్టుకునే అంశాలు పుష్కలంగా ఉంటాయనేది అందరికీ తెలి సిన విషయమే. 'ఎఫ్2' చిత్రం కూడా అన్నివర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటుందట. జూలై నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తారు.



# మే 24న 'నేల టిక్కెట్టు'

రవితేజ హీరోగా కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో ఎస్.ఆర్.టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్ళూరి నిర్మిస్తున్న చిత్రం 'నేల టిక్కెట్టు'. ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ సందర్భంగా నిర్మాత రామ్ తాళ్ళూరి మాట్లాడుతూ ''అందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు. రవితేజలాంటి మాస్ హీరోతో 'నేల టిక్కెట్టు' అనే మాస్ టైటిల్‌తో సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది. కల్యాణ్‌కృష్ణ సినిమాని చాలా అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. మూడు పాటలు చిత్రీకరించాల్సి ఉంది. పాటలతోపాటు అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి మే 24న చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. రవితేజ సరసన మాళవికశర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాశ్, రఘుబాబు, సుబ్బరాజు, ఆలి, పోసాని తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

# 'సైరా'కి మ్యూజిక్ డైరెక్టర్ ఫిక్స్?

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా 'సైరా నరసింహారెడ్డి' చిత్రం నిర్మాణం జరుపుకుంటున్న విషయం తెలిసిందే. చిరంజీవి హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై హీరో రామ్‌చరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, జగపతిబాబు, విజయ్ సేతుపతి, నయనతార వంటి హేమాహేమీలు నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఇదిలా ఉంటే ఈ సినిమాకి ఎవరు సంగీ తమందిస్తారనే విషయంలో కొంతకాలంగా తర్జన భర్జ నలు జరుగుతున్నాయి. మొదట ఎ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకి సంగీత దర్శకుడు అని ప్రకటించారు. అయితే కొన్ని కారణాల వల్ల రెహమాన్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత ఈ సినిమాకి సంగీతం అందిస్తారంటూ ఇళయరాజా, యం.యం.కీరవాణి పేర్లు వేర్వేరుగా వినిపించాయి. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ అమిత్ త్రివేది 'సైరా నరసింహారెడ్డి' చిత్రానికి సంగీత దర్శకుడుగా ఖరారు అయ్యారని తెలుస్తోంది. హిందీలో 'క్వీన్, ఇంగ్లీష్ వింగ్లీష్, ఉడ్తా పంజాబ్, సీక్రెట్ సూపర్‌స్టార్' వంటి సినిమాలకు మంచి సంగీతాన్ని సమకూర్చారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న 'సైరా నరసింహారెడ్డి'కి సంగీత పరంగా అమిత్ బాగా ప్లస్ అవుతారని చిత్ర యూనిట్ భావిస్తోందట.


● అమిత్ త్రివేది

# దర్శక నిర్మాతలకు హ్యాట్సాఫ్



'అప్పట్లో ఒకడుండేవాడు'లాంటి డిఫరెంట్ చిత్రాన్ని నిర్మించిన ఆరాన్ మీడియా వర్క్స్ సంస్థ లేటెస్ట్‌గా 'నీది నాది ఒకే కథ' వంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందించారు. ఈ చిత్రాన్ని మార్చి 23న విడుదల చేశారు. శ్రీవైష్ణవి క్రియేషన్స్ పతాకంపై వేణు ఊడుగుల దర్శకత్వంలో ప్రశాంతి, కృష్ణ విజయ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థాంక్స్ చెప్పేందుకు మార్చి 25న రామానాయుడు స్టూడియోలో థాంక్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నారా రోహిత్, శ్రీవిష్ణు, తమ్మారెడ్డి భరద్వాజ, వి.ఎన్.ఆదిత్య, జి.నాగేశ్వర్‌రెడ్డి, మదన్, పవన్ సాదినేని, విరించివర్మ, సాగర్ చంద్ర, కిషోర్ తిరుమల, దేవిప్రసాద్, నిర్మాతలు రాజ్ కందుకూరి, బెక్కం వేణుగోపాల్, చిత్ర దర్శకుడు వేణు ఊడుగుల, శ్రీవైష్ణవి క్రియేషన్స్ అధినేత నారాయణరావు అట్లూరి, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి, కెమెరామెన్ తదితరులు పాల్గొన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ ''సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షులకు, సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ నా థాంక్స్. ఇండస్ట్రీ నుండే కాకుండా బయట నుండి కూడా చాలామంది మంచి సినిమా తీశారని అప్రిషియేట్ చేస్తున్నారు'' అన్నారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ ''చిన్న సినిమాలు, కాన్సెప్ట్ బేస్డ్ మూవీస్ చేస్తున్నప్పుడల్లా ప్రేక్షకులు ఆదరిస్తూ మమ్మల్ని ఎంకరేజ్ చేస్తున్నారు'' అన్నారు. నారాయణరావు అట్లూరి మాట్లాడుతూ ''సినిమా చాలా బాగుందని అందరూ ప్రశంసిస్తున్నారు. సక్సెస్ చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు'' అన్నారు. చిత్ర దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ ''నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన రోహిత్‌గారికి, శ్రీవిష్ణు, ప్రశాంతి, కృష్ణవిజయ్‌లకు జీవితాంతం రుణపడి వుంటాను. ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు'' అన్నారు.

# ఇద్దరూ కలిసి మరోసారి..

ఒకప్పుడు గ్లామర్ పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చిన సమంత ఇప్పుడు పెర్‌ఫార్మెన్స్‌కి స్కోప్ ఉన్న పాత్రల వైపే మొగ్గు చూపిస్తోంది. తాజాగా అలాంటి క్యారెక్టర్ ఆమెను వెతుక్కుంటూ వచ్చింది. విశాల్ హీరోగా తెలుగులో వచ్చిన 'డిటెక్టివ్' దర్శకుడు మిస్కిన్ తదుపరి చిత్రంలో సమంత నటించనుంది. ఈ సినిమాలో యువ నటుడు శాంతను భాగ్యరాజ్ కథానాయకుడు. లిడ్రా ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ చిత్రంలో మొదట సాయిపల్లవి, నిత్యామీనన్ నటిస్తారని ప్రచారం జరిగింది. అయితే నిత్యామీనన్ ఓకే అయినప్పటికీ, సాయిపల్లవి పక్కకు తప్పుకుందట. పారితోషికం విషయంలో తేడా రావడం వల్లే సాయిపల్లవి ఈ ప్రాజెక్ట్ నుంచి బయటికి వచ్చిందట. భారీ పారితోషికం డిమాండ్ చెయ్యడంతో ఆమెను పక్కన పెట్టి ఆ అవకాశం సమంతకు ఇచ్చారని తెలుస్తోంది. పెద్ద హీరోలందరితోనూ సినిమాలు చేసిన సమంత ఒక యంగ్ హీరో సరసన నటిస్తుందా? అనేది కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. మెర్సల్‌లో నటించిన సమంత, నిత్యామీనన్ మరోసారి ఈ సినిమాలో కలిసి నటిస్తారన్నమాట.


● సమంత

# క్రైమ్ కామెడీ జోనర్‌లో



కమెడియన్ నుండి హీరోగా మారిన హీరోల్లో సునీల్ ఒకరు. అందాల రాముడు, మర్యాద రామన్న, పూల రంగడు వంటి విజయవంతమైన చిత్రాల్లో సునీల్ మెప్పించారు. ఇందులో సునీల్‌తో 'పూలరంగడు' సినిమాను చేసిన దర్శకుడు వీరభద్రం.. మళ్లీ సునీల్‌తో సినిమా చేయడానికి కథను సిద్ధం చేస్తున్నారట. అంజిరెడ్డి నిర్మించే ఈ చిత్రం త్వరలోనే పట్టాలెక్కనుంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా క్రైమ్ కామెడీ జోనర్‌తో తెరకెక్కనుందని తెలిసింది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. ఇప్పుడు సునీల్ ఎన్టీఆర్, త్రివి క్రమ్ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నారు.


విజయ్ ఆంటోని, అంజలి

# త్వరలోనే 'కాశి'

నకిలీ, డా.సలీం చిత్రాలతో మంచి విజయాలను సొంతం చేసుకున్న హీరో విజయ్ ఆంటోని. 'బిచ్చగాడు' సాధించిన సక్సెస్‌తో విజయ్ ఆంటోని చిత్రాలకు తెలుగులో మంచి క్రేజ్ క్రియేట్ అయ్యాయి. యమన్, భేతాళుడు, ఇంద్రసేన చిత్రాలు తెలుగు, తమిళంలో ఏక కాలంలో విడుదలయ్యాయి. అదే విధంగా విజయ్ ఆంటోని కొత్త సినిమా 'కాళి'ని 'కాశి' పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు. ఇటీవల ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు. అంజలి, సునైన హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిలిమ్ బ్యానర్‌పై ఫాతిమా విజయ్ ఆంటోని ఈ సినిమాను నిర్మిస్తున్నరు. ఈ సినిమాలో హీరోగా నటించడమే కాకుండా సంగీతాన్ని కూడా అందించారు విజయ్ ఆంటోని. రిచర్డ్ ఎం.నాథన్ సినిమాట్రోఫీ అందిం చారు. ఈ సినిమాను త్వరలోనే విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.


● నందితా శ్వేత

# సున్నితంగా రిజెక్ట్ చేసింది

సినిమా తారలకు అభిమానుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. అందులోనూ హీరోయిన్లకు మరింత ఎక్కువనే చెప్పాలి. అవకాశం దొరికితే తమ అభిమాన తారతో మాట్లాడాలని ప్రయత్నించేవారు కొంతమందైతే, ఐ లవ్ యూ చెప్పాలనుకునేవారు, పెళ్ళి ప్రపోజల్ పెట్టే వాళ్ళు కొంతమంది. ఇవి ప్రత్యక్షంగా ఎంతవరకు సాధ్యమో చెప్పలేముగానీ సోషల్ మీడియా పుణ్యమా అని కొంతవరకు సాధ్యమవుతోంది. తాజాగా హీరోయిన్ రాయ్ లక్ష్మీకి అలాంటి అనుభవమే ఎదురైంది. రాయ్ లక్ష్మీ అందం గురించి, ఆమె సినిమాల గురించి, ఆమె పెర్‌ఫార్మెన్స్ గురించి కొంతమంది కామెంట్ చేస్తే ఓ వీరాభిమాని ఓ అడుగు ముందుకేసి ''నాకు ఐదెకరాల పొలం, ఇల్లు, స్కూటర్, మీ మీద ఎప్పటికీ చెరిగిపోని ప్రేమ ఉన్నాయి. నన్ను పెళ్లి చేసుకోండి ప్లీజ్' అంటూ ప్రాధేయ పడ్డాడు. దీన్ని చాలా స్పోర్టీవ్‌గా తీసుకున్న రాయ్ లక్ష్మీ ''నీ ప్రపోజల్‌కి థాంక్స్. ఇప్పట్లో నాకు పెళ్లి ఆలోచన లేదు. నువ్వు పెళ్లి చేసుకోవడానికి ఓ అందమైన అమ్మాయి దొరకాలని కోరుకుంటున్నాను'' అంటూ ఎంతో సున్నితంగా చెప్పింది.


● రాయ్ లక్ష్మీ

# 102 నాటౌట్

బాలీవుడ్ స్టార్స్ అమితాబ్ బచ్చన్, రిషీ కపూర్ 27 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తున్న చిత్రం '102 నాటౌట్'. గతంలో అమితాబ్ బచ్చన్, రిషికపూర్ కాంబినేషన్‌లో కబీ కబీ, అమర్ అక్బర్, అంటోని, కూలీ, అజూబా, నషీబ్ చిత్రాలు వచ్చాయి. చాలా గ్యాప్ తర్వాత ఇద్దరూ కలిసి నటిస్తుండటంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. గుజరాతీ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ఉమేశ్ శుక్లా దర్శకుడు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిషీకపూర్ విడుదల తన ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. వయసు మళ్లిన తండ్రి, కొడుకుల మధ్య సాగే అనుబంధాలే ప్రధానాంశాలుగా ఉంటాయి. సినిమాను మే 4న విడుదల చేస్తున్నారు.

రిషికపూర్, అమితాబ్



# రాజ్ తరుణ్‌తో...

యువ కథానాయకుడు రాజ్ తరుణ్‌తో నందితా శ్వేత నటించనుంది. వివరాల్లోకి వెళితే.. రాజ్‌తరుణ్‌కు 'కుమారి 21 ఎఫ్' వంటి విజయవంతమైన సినిమాను అందించిన దర్శకుడు సూర్య ప్రతాప్ .. ఈ సినిమాను డైరెక్ట్ చేయబోతున్నారు. ఈ సినిమాలో నందితా శ్వేత హీరోయిన్‌గా నటించనుంది. రీసెంట్‌గా చిత్ర యూనిట్ ఆమెను కలిశారట. ఆమె కూడా సినిమాలో నటించడానికి పాజిటివ్‌గా స్పందించింది. సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రామ్ తాళ్లూరి ఈ సినిమాను నిర్మించనున్నారు. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' సినిమాలో నందితా శ్వేత నటించింది.

# వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



- తిరుమలలో రాములోరి ఆస్థానం
- ఒంటిమిట్టలో ఉత్సవాలకు ధ్వజారోహణ
- 30న వెండివెన్నెల్లో కోదండపాణి కల్యాణం

అమరావతి, మార్చి 25 (మనం ప్రతినిధి): ఆంధ్ర రాష్ట్రంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఊరూరా పచ్చటి తోరణాలతో అలంకరించిన మంటపాలలో రాములోరి కల్యాణం కమనీయంగా సాగింది. వాడవాడలా శ్రీరామ నామ స్మరణతో భక్తులు తరించారు. శ్రీరామ నవమి తేదీపై పండితుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ.. ఏపీలో మాత్రం ఆదివారం నాడే ఉత్సవాలను ప్రారంభించారు. వాస్తవంగా మార్చి 25వ తేదీ(ఆదివారం) అష్టమితో కూడిన నవమి రావటంతో పలువురు పండితులు అభ్యంతరం వ్యక్తం చేయటం, తెలంగాణలో భద్రాద్రి రాములవారి కల్యాణాన్ని ఈ నెల 26న నిర్వహించాలని నిర్ణయించడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. అయితే



ఆదివారం ఉదయం 7.38 గంటలకు నవమి తిథి ప్రారంభమై.. మరుసటి రోజు ఉదయం 5.13గంటలతో నవమి తిథి ముగియనుండటంతో ఆదివారమే శుభ్రప్రదమైన రోజుగా భావించి రాష్ట్రంలోని దాదాపు అన్ని రామాలయాలు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. యువత పెద్ద ఎత్తున స్వామి వారి కళ్యాణం, ఊరేగింపుల్లో పాల్గొన్నారు. అనేక చోట్ల అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో రామయ్య ఆస్థానం న్విహించారు. తిరుమలలోని రంగనాయకుల మండపంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన కార్యక్రమం నిర్వహించారు. ఆస్థానం సందర్భంగా రాత్రి ఏడు గంటలకు మలయప్ప స్వామివారిని హనుమద్వాహనంపై తిరు మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి 10 గంటలకు బంగారు వాకిలిలో శ్రీరామ నవమి ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించారు.

### కోదండ రామయ్య బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురారోపణ జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ వేద పండితులు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ప్రభుత్వ విప్ మల్లిఖార్జున రెడ్డి, రాజ్యసభ సభ్యులు సీఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయంలో ఈ నెల 30వ తేదీ రాత్రి పండు వెన్నెలలో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరగనుంది. సీఎం చంద్రబాబు దంప తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.




## నేడే రాములోరి పెళ్లి

(మొదటిపేజీ తరువాయి)

ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. విళంబినామ సంవత్సరంలో ఈ ఏడాది ఈ ప్రధాన వేడుకలు జరగనున్న నేపథ్యంలో 60 ఏళ్లకు ఒక్కసారి వచ్చే ఈ మంచి ముహూర్తం రోజు కల్యాణం, పట్టాభిషేకం వేడుకలు కనులారా చూడాలనే తపనతో దేశ నలుమూలల నుంచి భక్తులు భద్రాద్రికి చేరుకుంటున్నారు. రామాలయానికి రంగులు వేసి విద్యుదీలంకరణ గావించడంతో ఆలయ పరిసరాలు మిరిమిట్లు గొలుపుతున్నాయి. స్వామివారి కల్యాణం నిర్వహించే మిథిలా ప్రాంగణం ముస్తాబైంది.చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. చాందినీ వస్త్రాలతో అందంగా అలంకరించారు. కల్యాణ మండపాన్ని రంగులతో తీర్చిదిద్దారు. మిథిలా ప్రాంగణంలో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మిథిలా ప్రాంగణం బయట బ్రిడ్జి సెంటర్, గోపాలకృష్ణ సినిమా హాల్ సెంటర్ వరకు సైతం షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, వసతి గ హాలు ఏర్పాటు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. కరకట్ట ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దారు. గోదావరి తీరంలో సైతం షామియానాలు ఏర్పాటు చేశారు. లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్ భద్రాచలంలో మకాం పెట్టి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భద్రాచలం సబ్‌కలెక్టర్ పమేల సత్పతి కల్యాణ ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తున్నారు. ఈ వేడుకలు సీఎం కేసీఆర్ వస్తారా? రారా? అన్న అంశంపై మీమాంస నెలకొంది. సీఎం కేసీఆర్ రాకుంటే.. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి దంపతులు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు సమర్పించే అవకాశాలు ఉన్నాయి.

# ఎవరి పక్షమో తేల్చుకోండి!

- ఆంధ్ర పక్షమా.. కేంద్ర పక్షమా?
- పార్టీలకు సీఎం చంద్రబాబు ప్రశ్న
- టీడీపీకి మద్దతిస్తే రాష్ట్రానికి అండ
- వ్యతిరేకిస్తే ఏపీని బలహీనపరచడమే
- నిధులివ్వడం కేంద్రానికి ఇష్టం లేదు
- బీజేపీ కుట్రలను ప్రజలకు వివరించాలి
- టీడీపీ నేతలకు బాబు దిశానిర్దేశం



అమరావతి, మార్చి 25 (మనం ప్రతినిధి): ''ఆంధ్ర పక్షమా...?కేంద్ర పక్షమా...?'' రాష్ట్రంలోని ఆయా పార్టీల నేతలే తేల్చుకోవాలని చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. ప్రజల కోసం పోరాడే ముఖ్యమంత్రి పక్షాన ఉంటారో లేక రాష్ట్రానికి అన్యాయం చేసే కేంద్రం పక్షాన ఉంటారో ఆలోచించుకోవాలన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడే తెలుగుదేశం పక్షాన ఉంటారా? ప్రజల మనోభావాలను నిర్లక్ష్యం చేసిన బీజేపీవైపు ఉంటారా? అని పరోక్షంగా వైసీపీ, జనసేన పార్టీలపై ప్రశ్నల వర్షం కురిపించారు. తెలుగుదేశం పార్టీకి మద్దతునిస్తే రాష్ట్రానికి మద్దతివ్వడమేనని, టీడీపీని బలహీన పరిస్తే రాష్ట్రాన్ని బలహీనపరచడమే అనేది అందరూ గుర్తుంచుకోవాలన్నారు. టీడీపీ ఎంపీలతో పాటు పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమిత్ షా లేఖకు అసెంబ్లీలో సమాధానమిచ్చానన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని, అలాంటిది నాలుగేళ్లు గడిచినా అది నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా కేంద్రాన్ని ప్రత్యేక హోదా అడగడం బీజేపీకి నచ్చడంలేదని మండిపడ్డారు. ఈఏపీలకు నిధులు ఇస్తామని చెప్పి కనీసం మెమో కూడా ఇవ్వలేదని, వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాలుగేళ్ల య్యాక ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ అంటు న్నారని, ఏపీకి హోదా ఇవ్వలేమని చెప్పిన కేంద్రం ఈశాన్య రాష్ట్రాలకు మాత్రం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చినట్లుగా ఏపీకి నిధులు ఇవ్వడం బీజేపీకి ఇష్టంలేదని ఆరోపించారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్ర లను ప్రజలకు వివరించాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రానికి నిధుల కోసం నాలుగేళ్లుగా కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే ఉన్నామని, తొలి బడ్జెట్‌లోనే రెక్కలు విరిచి ఎగరమంటే ఎలా అని కేంద్రాన్ని ప్రశ్నించా నని తెలిపారు. నాలుగేళ్ల క్రితమే కేంద్రాన్ని నిలదీశానని, తొలి బడ్జెట్‌లోనే గొడవపడితే రాజకీయం అంటారనే ఇన్నాళ్లు ఆగామని చెప్పారు. నాలుగేళ్లుగా నిధుల కోసం, హక్కుల కోసం పోరాడుతున్నామని, విధిలేని పరిస్థితుల్లోనే ఇప్పుడు ఎన్డీఏ నుంచి బయటకొచ్చామని పేర్కొన్నారు.

### సీఎం రమేశ్ సవాల్‌కు వెనక్కి తగ్గారు

''కేంద్రం ఇచ్చిన నిధులు అన్నింటికీ యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీలు) ఇచ్చాం. యూసీలు ఇవ్వలేదు కాబట్టే నిధులు ఆపా మనడం పచ్చి అబద్ధం, దుర్మార్గం. యూసీలు ఇవ్వలేదని రుజువుచేస్తే ఎంపీగా రాజీనామా చేస్తానని సీఎం రమేష్ సవాల్ చేశారు. లేకుంటే మీరు రాజీనామా చేస్తారా? అంటే బీజేపీ ఎంపీ జీవీఎల్ వెనక్కితగ్గారు. ఆర్థిక లోటుకు యూసీలు ఇవ్వనవసరంలేదు. వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.1050 కోట్లలో 940 కోట్లకు యూసిలిచ్చాం. ఆ తరువాతే మరో రూ.350 కోట్లు విడుదల చేశారు. యూసీలు ఇవ్వకపోతే తరువాత వాయిదా విడుదల చేసేవారు కాదు. కానీ ఇచ్చిన రూ.350 కోట్లు పీఎంవో అనుమతి లేదని మళ్లీ వెనక్కి తీసుకోవడం అన్యాయం. యూసీలు ఇవ్వలేదనే బీజేపీ ఆరోపణలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి. యూసీలు ఇవ్వడంలో దేశంలోనే ముందున్న మూడో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. నాలుగేళ్లుగా రాష్ట్రానికి జరిగిన అన్యాయం ప్రజలకు వివరించాలి'' అని నేతలకు చంద్రబాబు సూచించారు.

### విజయసాయి.. మాల్యాకు తేడా ఏంటి?

''విజయ్ మాల్యాకు ఒక న్యాయం..? విజయసాయి రెడ్డికి మరో న్యాయమా..?'' అని కేంద్రాన్ని సీఎం చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. ఇద్దరూ ఆర్థిక నేరస్థులే.. వారిమధ్య వ్యత్యాసం ఏమిటి..? అని నిలదీశారు. విజయ్ మాల్యా దేశం వదిలి పరారయ్యాడని, విజయసాయి పీఎంవోలో ఉంటున్నారని ఎద్దేవా చేశారు. విజయ్ మాల్యా సభ్యత్వం రద్దుచేస్తే, విజయసాయి సభ్యత్వం కొనసాగిస్తున్నార ని దుయ్యబట్టారు. కావాలనే బీజేపీ నేతలు టీడీపీపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇవే ఆరోపణలు వైసీపి చేసినప్పుడు టీడీపీని సమర్థించిన బీజేపీ నేతలే, ఇప్పుడు అవే ఆరోపణలు చేయడాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారని అన్నారు. బీజేపీపై అవినీతి ఆరోపణలకు జవాబివ్వకుండా, టీడీపీపై అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. బీజేపీ చేస్తున్న ఆరోపణలను టీడీపీ నేతలు ఖండించాలని, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

# కోటి ఇండ్లకు ఇంటర్నెట్

- 15 ఎంబీపీఎస్ వేగంతో అందజేత
- జీహెచ్‌ఎంసీకి నీటి కొరత లేదు
- మునిసిపల్ కాంట్రాక్టుల్లో కోటా అమలు
- ఎస్సీలకు 16, ఎస్టీలకు 6 శాతం: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 25 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో కోటి ఇండ్లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించబోతున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా ఆప్టిక్ ఫైబర్ కేబుళ్లను వేయనున్నట్టు పేర్కొన్నారు. ఆప్టిక్ ఫైబర్ కేబుళ్ల అంశంపై ఎం.ఎస్ ప్రభాకర్‌రావు వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే ప్రపంచంలో ఎక్కడా లేదని, తె లంగాణనే ఏకైక రాష్ట్రంగా పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ప్రభుత్వానికి, ప్రభుత్వం నుంచి పౌరులకు సర్వీసులను సమకూర్చాలని ప్రభుత్వం యోచిస్తున్నదన్నారు. ఈ ఇంటర్నెట్ ను 15 ఎంబీపీఎస్ స్పీడ్‌తో అందించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని 8,700 గ్రామపంచాయతీల్లోని వ్యవస్థలకు 1 జీబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ అందించనున్నట్టు తెలిపారు. ఈ పద్ధతి ద్వారా కేబుల్ ఆపరేటర్లకు, ఎంఎస్‌వోలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తదన్నారు. ఈ ప్రక్రియను రూ. 5,050 కోట్లతో వచ్చే ఏడాది డిసెంబరు వరకు పూర్తి చేస్తామన్నారు.

### జీహెచ్‌ఎంసీకి నీటి కొరత లేదు: కేటీఆర్

జీహెచ్‌ఎంసీ పరిధిలో తాగునీటి కొరత లేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీలో నీటి సరఫరా అంశంపై సయ్యద్ అమినుల్ హసన్ జాఫ్రీ వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... మొత్తం 537.24 ఎంఎల్ సామర్థ్యంతో జీహెచ్‌ఎంసీ ప్రాంతంలో 236 రిజర్వాయర్లు లభ్యంగా ఉన్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ ప్రాంత కైవార ప్రాజెక్టులో 56 నూతన సర్వీసు రిజర్వాయర్లు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు 44 సర్వీసు రిజర్వాయర్లను పూర్తి చేశామని, మిగిలిన 12 తుది దశలో ఉన్నాయన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రధాన నగరంలో, కైవార సర్కిళ్లలో నూతన నిల్వ రిజర్వాయర్లను నిర్మించడానికి, ఫీడర్‌మెయిన్లను వేయడానికి, ఔట్‌లెట్, పంపిణీ కాలువల ఏర్పాటుకు నీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టులను చేపట్టినట్టు తెలిపారు. హైదరాబాద్ కోసం నీటి సరఫరాను పెంచడానికి గోదావరి నది వనరు నుంచి హైదరాబాద్ వరకు అదనపు 172 ఎంజీడీ నీటిని తీసుకునిరావడానికి 10 టీఎంసీ నిల్వ రిజర్వాయరు నిర్మాణం, 172 ఎంజీడీ శుద్ధీకరణ ప్లాంట్, 3600 ఎంఎం డయా గ్రావిటీ మెయిన్స్, 3000 ఎంఎం డయా పంపింగ్ మెయిన్, పంప్‌హౌజ్, పంప్స్ అండ్ మోటార్స్, మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు వంటి అంశాలతో కేశవాపురం, షామీర్‌పేట వద్ద మరో వనరు ప్రాజెక్టును చేపట్టినట్టు తెలిపారు. ఈ నీటి సరఫరా ప్రాజెక్టుల కోసం ఏటా రూ. 60 కోట్లకు పైగా ఖర్చు అవుతుందన్నారు. వాటర్‌బోర్డు నష్టాల్లో ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 40 శాతం ఎన్ఆర్‌డబ్ల్యూ (నాన్ రెవెన్యూ వాటర్) వినియోగదారులున్నారని అందుకే బోర్డుకు నష్టాల్లో ఉందన్నారు. సౌతాఫ్రికా కేప్‌టౌన్‌లో ఇటీవల నీటి కొరత తీవ్రంగా అయిందని, బెంగుళూరు కూడా ఆ వైపుగా ప్రయణిస్తుందన్నారు. అందుకు హైదరాబాద్‌కు నీటి కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుం టున్నామన్నారు. ఇందులో భాగంగానే ఓఆర్ఆర్ చుట్టూ రింగ్ మెయిన్ ద్వారా కృష్ణా, గోదావరి జలాలను ఇంటర్ కనెక్టెడ్ గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో జీహెచ్‌ఎంసీకి శాశ్వతంగా నీటి కొరత ఉండ దన్నారు. ఉపాధి కల్పన, మునిసిపల్ షాపుల కేటాయింపు, కాంట్రాక్టుల విషయాల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నట్టు మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు.




మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అంశంపై డీ. రాజేశ్వర్‌రావు, సబావట్ రాములు నాయక్ వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... మంజూరయిన మొత్తం పదవులు 5228 వీటిలో 800 పదవులు ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు చే శామని, 1891 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వు చేసిన 320 పదవులకుగానూ 84 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టణస్థానిక సంస్థల్లో 3862 మునిసిపలు షాపులున్నాయని, ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు చేసిన 580 షాపులకు గానూ 413 షాపులను కేటాయించామన్నారు. ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వు చేసిన 232 షాపులకుగానూ 154 షాపులను కేటాయించామన్నారు. పట్టన స్థానిక సంస్థల్లో 2120 ప్రస్తుత కాంట్రాక్టులు ఉన్నాయి. ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు చేసిన 318 కాంట్రాక్టులకు గానూ 284 కాంట్రాక్టులను కేటాయించామని, ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వు చేసిన 127 కాంట్రాక్టుల్లో 88 కాంట్రాక్టులను కే టాయించామని పేర్కొన్నారు.

## హోదాకు 'మా' మద్దతు

- నటులతో రామకృష్ణ, చలసాని భేటీ
- సినీ పరిశ్రమ కలసి రావాలని విజ్ఞప్తి
- సంఘీభావం ప్రకటించిన అసోసియేషన్

హైదరాబాద్, మార్చి 25: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన పోరాటానికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) మద్దతు ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లోని 'మా' కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ రాజా, నటులు రఘుబాబు, నాగినీడు, బెనర్జీ, ఏడిద శ్రీరామ్‌తో పాటు ప్రజానాట్య మండలి ఫిల్మ్ డివిజన్ కార్యదర్శి మద్దినేని రమేష్, కోశాధికారి మాదాల రవితో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ సమావేశమయ్యారు. హోదా సాధనకు తాము చేస్తున్న పోరాటంలో సినీ పరిశ్రమ కూడా కలిసి రావాలని రామకృష్ణ, చలసాని కోరారు. ఇందుకు 'మా' అసోసియేషన్ సానుకూలంగా స్పందించి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించింది. ఏపీ ప్రయోజనాల కోసం మద్దతు ఇస్తామని, పార్టీలకు అతీతంగా అందరం పోరాడి, తెలుగువారి హక్కులను సాధించుకుందామని శివాజీ రాజా అన్నారు.



అసెంబ్లీ కమిటీహాల్‌లో ఆదివారం శాసన సభ రూల్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి, మండలి డిప్యూటీ చైర్మన్ విద్యాసాగర్, మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు

# జోష్‌లో వైసీపీ

- జగన్ పాదయాత్రకు విశేష స్పందన
- ఏపీ ప్రత్యేక హోదా పోరులో పైచేయి
- జాతీయ స్థాయిలో హోదాపై చర్చలు
- టీడీపీ సర్కారుపై నలువైపులా దాడి
- కేసులు కూడా వీగిపోయే సూచనలు
- కార్యకర్తల్లో రెట్టింపైన ఉత్సాహం
- అదనపు చేరికలతో పార్టీ బలోపేతం



అమరావతి, మార్చి 25 (మనం ప్రతినిధి): ఏపీ రాజకీయాల్లో వేడి రాజుకుంటోంది. అన్ని పార్టీలు దూకుడుగా సాగుతున్నాయి. ప్రతిపక్ష నేత జగన్.. తన పాదయాత్రలో హోదాపై మరింత చురుగ్గా స్పందిస్తున్నారు. తాను ప్రారంభించిన పోరాటం ఇప్పుడు జాతీయ స్థాయిలో హాట్ టాపిక్ కావడం, కాంగ్రెస్ పార్టీ సైతం మద్దతిచ్చి పార్లమెంటులో చర్చ జరిగే అవకాశం కనిపించడంతో అది తమ పార్టీ విజయంగా భావిస్తున్నారు. టీడీపీ కేంద్రంతో తెగదెంపులు చేసుకోవాలన్నది కూడా తమ డిమాండేనని అంటున్నారు. మరోవైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అధికార పార్టీపై విమర్శలు చేస్తుండటంతో వైసీపీ నేతల్లో రెట్టింపు ఉత్సాహం కనపడుతోంది. ఇన్నాళ్లూ జగన్ చుట్టూ కేసులు ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న టెన్షన్ పార్టీ శ్రేణుల్లో కనిపించేది. కానీ.. ఇప్పుడు క్రమంగా ఈడీ కూడా కొన్ని ఎటాచ్‌మెంట్లు తీసేయడం లాంటి పరిణామాలతో కేసులు సైతం వీగిపోతాయన్న నమ్మకం వారిలో కనిపిస్తోంది. కేంద్రంపై అవిశ్వాసతీర్మానం కూడా తొలుత వైసీపీనే ఇచ్చిందనే సంకేతాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయిని వైసీపీ నేతలు భావిస్తున్నారు.

### రెట్టించిన ఉత్సాహంతో...

వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ గెలుపు ఖాయమని కొందరు వైసీపీ నేతలు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైసీపీ నేతలు ఉత్సాహంగా ఉన్నారు. తమ అధినేతకు రాజకీయం పూర్తిగా వంటపట్టిందని.. టీడీపీ నేతలు నోరుపారేసుకోవడం మినహా వారు జగన్‌ను చేయగలిగింది ఏమీ లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎఫెక్ట్ జగన్ ప్రజాసంకల్ప యాత్రపై బాగానే కనిపిస్తోంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో 12 నియోజకవర్గాల్లో జగన్ పాదయాత్ర కొనసాగుతోంది. ఇప్పటికి ఐదు నియోజకవర్గాల్లో యాత్ర పూర్తయింది. టీడీపీకి కంచుకోటగా ఉండే గుంటూరు జిల్లాల్లో మెజార్టీ స్థానాలు గెలుచుకోవాలని వైసీపీ ప్రణాళిక సిద్ధం చేసింది. దీనికోసం ప్రశాంత్ కిషోర్ (పీకే) టీం కసరత్తు ప్రారంభించింది. ముఖ్యంగా చిలకలూరిపేట, నర్సరావుపేటలో కావాలనే మంత్రి పుల్లారావు, స్పీకర్ కోడెల శివప్రసాదరావుపై జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పాదయాత్రలో అధికార పార్టీ నుంచి వైసీపీలో చేరికలు ఉండటం కూడా క్యాడర్ జోష్ పెంచుతోంది. మరో రెండు రోజుల్లో 2009లో సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నిమ్మకాయల రాజ నారాయణ వైసీపీ తీర్థం పుచ్చుకోనున్నారని తెలుస్తోంది.



అనారోగ్యంతో బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జిమ్నాస్టిక్స్ కోచ్ బ్రిజ్ కిశోర్‌ను పరామర్శిస్తున్న మంత్రి పద్మారావు. ప్రభుత్వం తరపున రూ.25 లక్షల చెక్కును అందించారు.



సీపీఐ తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలను విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆదివారం హైదరాబాద్ లో చేపట్టిన బైక్ ర్యాలీ





# టాప్ సంస్థలు ఫేస్‌బుక్‌కు బైబై



## జుకర్‌బర్గ్‌కు 10.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు హుష్ కాకి!

న్యూయార్క్: కోట్ల మంది ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యిందని కొన్ని రోజులుగా ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీంతో ఫేస్‌బుక్ చిక్కుల్లో పడింది. ఈ వ్యవహారంపై అసంతృప్తిగా ఉన్న యూజర్లు ఫేస్‌బుక్ ఖాతాలను తొలగించాలని సోషల్‌మీడియాలో పిలుపునిస్తున్నారు. హ్యాష్‌ట్యాగ్‌తో #deletefacebook ఉద్యమం ప్రారంభించారు. తమవైపు నుంచి పొరబాటు జరిగిందని సంస్థ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పినా ఈ ఉద్యమం ఆగట్లేదు.



### ప్రైవసీ సెట్టింగ్స్ మెరుగుపర్చాక మళ్లీ పోస్టులు ప్రారంభిస్తామని వెల్లడి

ప్రముఖ సెర్చ్ ఇంజిన్ మొజిల్లా ఫైర్‌ఫాక్స్ కూడా తాము ఫేస్‌బుక్ నుంచి తాత్కాలికంగా వైదొలుగుతున్నట్లు తెలిపింది. మొజిల్లా తన ఖాతాను తొలగించకున్నా.. ఇకపై ఈ ఖాతా నుంచి ఏ పోస్టులు చేయబోమని తెలిపింది. 'ఫేస్‌బుక్ నుంచి బ్రేక్ తీసుకుంటున్నాం. ఈ రోజు నుంచి ఈ ఖాతాలో ఎలాంటి పోస్టులు పెట్టబోం' అని తెలిపింది. ప్రైవసీ సెట్టింగ్స్‌ను మెరుగుపరిచాక మళ్లీ ఫేస్‌బుక్‌ను ఉపయోగిస్తాం' అని మొజిల్లా చెప్పుకొచ్చింది.

### యూజర్ల పరిరక్షణకు ఫేస్‌బుక్ యాజమాన్యం చర్యలు ఇలా..



వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రెయిన్ ఆక్టన్ కూడా 'ఇది ఫేస్‌బుక్‌ను డిలీట్ చేయాల్సిన సమయం' అని ట్వీట్ చేశారు. దీంతో ఈ డిలీట్ ఫేస్‌బుక్ ఉద్యమం మరింత ఉధృతంగా మారుతోంది. మరోవైపు యూజర్ల ను కోల్పోకుండా ఉండేందుకు అటు ఫేస్‌బుక్ యాజమాన్యం కూడా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కోసం పనిచేసిన కన్సల్టెన్సీ సంస్థ 'కేంబ్రిడ్జ్ అనలిటికా'కు ఐదుకోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం చిక్కిందని ఇటీవల వార్తలు వచ్చాయి. ఓ యాప్ ద్వారా ఈ సమాచారాన్ని ఆ సంస్థ సేకరించినట్లు తెలిసింది. దీంతో ఫేస్‌బుక్‌కు చిక్కులు ఎదురయ్యాయి.

### అగ్రశ్రేణి కుబేరుల ఆస్తి రూ.28లక్షల కోట్లు ఆవిరి

ప్రపంచ కుబేరులకు 2018 అంతగా కలిసొచ్చినట్లు లేదు. వరుస పరిణామాల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు కుదేలవడంతో సంపన్నుల రూ. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ఈ ఏడాది జనవరి 26 నుంచి ఇప్పటివరకు అగ్రశ్రేణి 500 ప్రపంచ కుబేరులు 436 బిలియన్ డాలర్లు నష్టపోయారు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 28.33 లక్షల కోట్లకు పైమాటేనన్న మాట. ఈ వారంలోనే ఆ 500 మంది 181 బిలియన్ డాలర్ల నష్టాలను చవిచూశారు.

### ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ 7 బిలియన్ల డాలర్లు నష్టం

ఇందులో ఎక్కువగా సోషల్ మీడియా సంస్థ ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ నష్టపోయారు. జనవరి 26 నుంచి జుకర్‌బర్గ్ 10.3 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు. దీంతో బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీలో జుకర్‌బర్గ్ నాలుగో స్థానం నుంచి ఏడో స్థానానికి పడిపోయారు. ఒరాకిల్ కార్పొరేషన్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ ఏడు బిలియన్ డాలర్లు నష్టపోయారు. బెర్క్‌షైర్ హాత్‌వే ఛైర్మన్ వారెన్ బఫేట్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, ఆల్ఫాబెట్ సీఈవో ల్యారీ పేజ్ సంయుక్తంగా 17 బిలియన్ డాలర్లు కోల్పోయారు.

### ఫేస్‌బుక్ షేర్లు 14 శాతం మేరకు పతనం

ఇదిలా ఉంటే బ్లూమ్‌బర్గ్ సూచీ ప్రకారం 500 ప్రపంచ కుబేరుల మొత్తం సంపద 5.2 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఏడాది మొదటి నుంచి అమెరికా మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఫిబ్రవరిలో క్రెడిట్ రేటింగ్ పెంచడంతో అమెరికా మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. గత కొన్ని రోజులుగా ఫేస్‌బుక్ డేటా దుర్వినియోగం ఆరోపణల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. దీంతో ఆ సంస్థ షేర్లు 14శాతం మేర నష్టపోయాయి.

ఎక్కువ టేకోవర్లు జరిగినా విలువ తక్కువే గతేడాది (2017) దేశంలో విలీనాలు, టేకోవర్ల సంఖ్య పెరిగినా.. విలువ ప్రకారం చూస్తే మాత్రం తగ్గాయని ఎర్నెస్ట్‌యంగ్ (ఈవై) తాజా నివేదికలో పేర్కొంది. గతేడాది మొత్తం 4,680 కోట్ల డాలర్ల విలీనాలు, టేకోవర్‌లు జరిగాయి.. 2016తో పోల్చుకుంటే విలువ ప్రకారం 12 శాతం తగ్గాయి. ఈ ఏడాది పరిస్థితి కాస్త ప్రోత్సాహకరంగా ఉంటుందని ఈవై చెబుతోంది. దీనికి ప్రధాన కారణం సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందని వివరణ ఇచ్చింది. 2017లో విలీనాలు, టేకోవర్‌లు (ఎంఅండ్ఏ)లు ఏడేళ్ల గరిష్ఠానికి మొత్తం 1,022 జరిగాయి. వాటిలో ఎక్కువగా టెలికం, రిటైల్, కన్స్యూమర్ ప్రొడక్ట్స్, టెక్నాలజీ రంగాల షేర్లు ఎక్కువ గా ఉన్నాయి. విలువ ప్రాతిపదికన చూస్తే మాత్రం బాగా తగ్గాయి. తక్కువ స్థాయి ఎం అండ్ ఏలు 20 మిలియన్ డాలర్ల విలువ కలిగిన ఒప్పందాలు జరిగాయని ఈవై భాగస్వామి అమిత్ ఖండేల్‌వాల్ చెప్పారు.



### 2016లో 21.. గతేడాది 13 టేకోవర్లు మాత్రమే నమోదు

2017లో కార్పొరేట్లు పెద్ద టేకోవర్ల జోలికి పోలేదు. దీంతో సుమారు 500 మిలియన్ డాలర్ల ఒప్పందాలు 2016లో 21 జరిగితే గతేడాది 13 మాత్రమే పరిమితం అయ్యాయి. దీనికి ప్రధాన కారణం నియంత్రణా సంస్థల నిబంధనలు కూడా పెద్దడీల్స్‌పై ప్రభావం చూపాయని యర్నెస్ట్ యంగ్ (ఈవై) సహ వ్యవస్థాపకుడు ఖండేవాల్ వివరించారు. దేశంలో జరిగిన డీల్స్‌లో 71 శాతం వరకు తగ్గాయి. 340 లావాదేవీల ద్వారా 800 -900 కోట్ల డాలర్లు జరిగితే, విదేశీడీల్స్ మాత్రం ఏడు శాతం వరకు తగ్గాయి. ఈ లావాదేవాల్లో అమెరికా, సింగపూర్, జపాన్‌లవే ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది 2018 విషయానికి వస్తే దేశీయంగా పెద్దమొత్తంలో విలీనాలు టేకోవర్లు జరిగే అవకాశాలు ఉన్నాయని నివేదికలో వివరించింది.

### టెస్లా, స్పేస్‌ఎక్స్‌లో ఫేస్‌బుక్ ఖాతాలు తొలిగించిన అధినేత ఎలన్ మస్క్



తాజాగా మొజిల్లా, టెస్లా, స్పేస్‌ఎక్స్ లాంటి ప్రముఖ కంపెనీలు కూడా ఫేస్‌బుక్‌ను వీడుతున్నాయి. ఫేస్‌బుక్‌లో టెస్లా, స్పేస్‌ఎక్స్ కంపెనీల ఖాతాలను తొలగించినట్లు ఆ సంస్థల అధినేత ఎలన్ మస్క్ ప్రకటించారు. ఫేస్‌బుక్‌పై ఆరోపణలు వెల్లువెత్తగానే స్పేస్‌ఎక్స్, టెస్లా ఖాతాలను తొలగించాలని ట్విటర్‌లో ఎలన్‌మస్క్‌ను ఆయన ఫాలోవర్లు కోరారు. దీంతో ఖాతాలను తీసేస్తున్నట్లు ఎలన్ తెలిపారు. ఫేస్‌బుక్ డేటాను ఇకపై మరింత భద్రంగా ఉంచేలా చర్యలు తీసు కుంటున్నామని జుకర్‌బర్గ్ చెప్పారు.

## పెద్దగా మెప్పించని భారత్ డైనమిక్స్




ముంబయి: ఇటీవల ప్రాథమిక మార్కెట్ నుంచి ఐపీవో ద్వారా నిధులు సమీకరించిన ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ అయిన భారత్ డైనమిక్స్ ఇన్వెస్టర్లకు నిరాశనే మిగిల్చింది. ఇష్యూ ధర రూ.428 కాగా, గత వారం (గురువారం- మార్చి 22, 2018న) స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో 15.9 శాతం డిస్కౌంట్‌తో రూ.360 దగ్గర ప్రారంభమయ్యింది. శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి నష్టాలను కొంతమేర తగ్గించుకున్నప్పటికీ.. ఇష్యూ ధర కంటే ఇప్పటికీ 8.7 శాతం నష్టంలోనే ఉంది.




నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో రూ.386.20 వద్ద ముగిసింది. గతేడాదిలో ఐపీవోకు వచ్చిన అత్యధిక శాతం కంపెనీలు ఇన్వెస్టర్ల పెట్టుబడిపై రెండింతల లాభాలను ఇవ్వగా.. ఈ ఏడాదిలో మార్కెట్ నుంచి రూ.960 కోట్లు సమీకరించిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ మాత్రం లాభాలను ఇవ్వకపోగా నష్టాలనే మిగిల్చింది. సబ్‌స్క్రిప్షన్ కూడా అంతంత మాత్రం (1.3 రెట్లు) సాధించిన ఈ సంస్థ షేరు లిస్టింగ్ సమయంలో మార్కెట్ నష్టాల్లో ఉండడం షేరు పతనానికి మరో ప్రధాన కారణంగా నిలిచింది.

## శాంసంగ్ 'గెలాక్సీ జె7 ప్రైమ్2' విడుదల!



న్యూఢిల్లీ: బ్రాండెడ్ ఫోన్ల సంస్థ శాంసంగ్ తన గెలాక్సీ ఫోన్ల సిరీస్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. 'గెలాక్సీ జె7 ప్రైమ్ 2' పేరుతో ఈ ఫోన్‌ను విడుదల చేసింది. శాంసంగ్ ఆన్‌లైన్ షాప్ ద్వారా ఈ ఫోన్ వినియోగదారులకు లభిస్తుంది. త్వరలోనే ఆఫ్‌లైన్‌లోనూ ఈ ఫోన్‌ను విక్రయించనున్నట్లు సంస్థ తెలిపింది. రూ.13,990 ధరకు ఈ ఫోన్ వినియోగదారులకు లభించనుంది. ఈ ఫోన్‌లో 13 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా (ఫ్లాష్), 13 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. ఫింగర్‌ప్రింట్ సెన్సార్ కూడా ఉంది. బ్యాటరీ సామర్థ్యం 3300 ఎంఏహెచ్. శాంసంగ్.. గతేడాది గెలాక్సీ జె7 ప్రైమ్ విడుదలచేసిన సంగతి తెలిసిందే.


### 'గెలాక్సీ జె7 ప్రైమ్ 2' ఫీచర్లు...

5.5 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే, 1920 – 1080 పిక్సెల్స్ స్క్రీన్ రిజల్యూషన్, గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్, 1.6 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ ప్రాసెసర్, 3 జీబీ ర్యామ్, 32 జీబీ స్టోరేజ్, 256 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 7.1.1 నూగట్, డ్యుయల్ సిమ్, 13 మెగాపిక్సెల్ బ్యాక్ కెమెరా (ఫ్లాష్), 13 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జీ వీవోఎల్‌టీఈ, బ్లూటూత్ 4.1, 3300 ఎంఏహెచ్ బ్యాటరీ.

## 15 నెలల గరిష్ఠానికి పసిడి ధర

- డాలర్ పతనంతో ఆందోళన

ముంబై: అమెరికా, చైనా పరస్పరం దిగుమతి సుంకాలు విధిస్తామని ప్రకటించడంతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధం నెలకొన్నది. దీంతో బంగారం ధర 15 నెలల గరిష్ఠానికి చేరుకున్నది. ప్రపంచ వ్యాప్తంగా బంగారానికి డిమాండ్ పెరిగింది. దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య పరిణామాలతో పాటు స్థానిక నగల వ్యాపారుల నుంచి కొనుగోళ్లు ఎక్కువ కావడంతో పసిడి ధర ఏడాది గరిష్ఠానికి చేరింది. గత వారం శనివారం నాటి మార్కెట్‌లో రూ.85 పెరగడంతో 10 గ్రాముల బంగారం ధర రూ.31,835గా ఉంది. అటు వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. రూ.50 పెరగడంతో కేజీ వెండి ధర రూ. 39,600గా ఉంది.



### బంగారంపై పెట్టుబడులకు మదుపర్ల ఆసక్తి

చైనాపై అమెరికా వాణిజ్య ఆంక్షలు పెట్టడంతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో మదుపర్లు రక్షణాత్మక ధోరణిలో వ్యవహరిస్తూ బంగారంలో పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ధరలు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగానూ బంగారం ధరలు పెరిగాయి. న్యూయార్క్‌లో గత వారం శుక్రవారం నాటి మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1.37శాతం పెరిగి 1,346.80డాలర్లు పలికింది. వెండి కూడా 1.13శాతం పెరిగి ఔన్సు ధర 16.53 డాలర్లుగా ఉంది.

### ఎన్‌ఎస్‌ఏగా జాన్ బోల్టన్ నియామకంతో పెరిగిన నష్టభయం

అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధ భయాల కారణంగా డాలర్ విలువ కూడా పతనమైంది. దీంతో మదుపరుల్లో ఆందోళన మొదలైంది. దౌత్యవేత్త, అటార్నీ జాన్ బోల్టన్‌ను తన కొత్త జాతీయ భద్రతా సలహాదారుగా నియమించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించడంతో మార్కెట్‌లో నష్టభయం (రిస్క్) మరింత పెరిగింది.

### అమెరికా, చైనా మధ్య సుంకాల విధింపు ఆందోళనే

అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం చోటు చేసుకుంటే అది ప్రపంచ ఆర్థిక రంగ రికవరీకి విఘాతం కలిగిస్తుందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. 'ఈ విషయంలో ఆందోళన కలిగించే ఎన్నో అంశాలు ఉన్నాయి. దీన్ని తేలిగ్గా కొట్టిపారేయలేం'' అని రాజన్ పేర్కొన్నారు. అయితే, ఒక దేశం చర్యకు, మరో దేశం ప్రతిస్పందించే విధానం నుంచి బయటపడతామనే ఆశాభావం వ్యక్తం చేశారు. ''వాణిజ్య యుద్ధం అనే పదాన్ని వినియోగించడం ఇష్టం లేదు. ఎందుకుంటే వారు ఇంకా ఆ దశలో లేరు. ఈ విధమైన చర్యలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే ప్రస్తుత ఆర్థిక రంగ రికవరీకి హాని కలుగుతుంది. అమెరికా పూర్తి బలంగా ఉండి, ఉద్యోగాలు తగినన్ని ఉన్న తరుణంలో ఈ విధంగా చేయడం సరికాదని భావిస్తున్నా'' అని రాజన్ అన్నారు.

## పెరుగుతున్న ఇనుప ఖనిజ ధరలు

- దేశీయ ఉక్కు ఉత్పత్తి సంస్థలకు సెగ

కోల్‌కతా: ఇనుప ఖనిజ ధరలు పెంచుతూ పోతున్న స్పెక్యులేటివ్ శక్తులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించి, దేశీయ ఉక్కు కంపెనీలకు ఇనుప ఖనిజం అందుబాటులో ఉండేట్లు చూడవలసిన సమయం ఆసన్నమైంది. ఒడిశాలోని ఆరు పెద్ద గనుల వద్ద ''తవ్వకాలు తాత్కాలికంగా విరమించాలని'' సుప్రీం కోర్టు ఆదేశించడంతో డిసెంబరు-జనవరి మధ్య ఇనుప ఖనిజ ధరలు దాదాపు 35 శాతం పెరిగాయి. భారత దేశపు ఇనుప ఖనిజ ఉత్పత్తిలో దాదాపు సగం భాగం ఆ గనుల నుంచే వస్తోంది. అక్కడ తవ్వకాలు సాగిస్తున్న సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి పరిహారం చెల్లించడంలో విఫలమవడంతో సర్వోన్నత న్యాయస్థానం ఆ విధంగా రూలింగ్ ఇచ్చింది.

మొత్తం జనవరి-మార్చి త్రైమాసికమంతా గనుల్లో తవ్వకాలు సాగకపోతే, 5.5 మిలియన్ టన్నుల ఉత్పత్తిని నష్టపోయే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ 'ఇక్రా' అంచనా వేసింది. కానీ, చాలా గనులు పరిహారం చెల్లించి, తవ్వకాలను పునః ప్రారంభించడంతో, వాస్తవానికి, ఉత్పత్తి నష్టం తక్కువగానే ఉంది. దానితో ఇనుప ఖనిజ ధరల మార్కెట్ కాస్త చల్లారింది. కానీ, ధరలు స్వల్పంగానే తగ్గాయని చెప్పాలి. ముద్దల ధరలను టన్నుకు రూ. 2,400 నుంచి రూ. 3,100కి పెంచిన జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్.ఎం.డి.సి) మార్చిలో ధరను టన్నుకు రూ. 100 మాత్రమే తగ్గించింది. ప్రస్తుతం టన్ను రూ. 3,000 పలుకుతోంది. ఇది 2017 ఏప్రిల్ 1న ఉన్న ధరలతో పోలిస్తే సుమారుగా 24 శాతం ఎక్కువ. ధరలు పెరగడానికి గోవాలో 88 గనుల తవ్వక లీజులను మార్చిలో రద్దు చేయడమే కారణమని గనుల తవ్వక రంగంలోని వర్గాలవారు తెలిపారు. గోవాలో వెలికి తీసే మొత్తం 20 మిలియన్ టన్నుల ఖనిజం ఎగుమతి అవుతుంది కనుక, దేశీయ ధరలపై దాని ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది.


అయితే, ఇలా అవాంతరాలు ఎదురైనప్పటికీ, భారతదేశపు ఇనుప ఖనిజ ఉత్పత్తి గత ఏడాది నాటి 192 మిలియన్ టన్నులకన్నా మెరుగైన వృద్ధినే నమోదు చేయగలదని భావిస్తున్నారు. బ్లాస్ట్ ఫర్నేసుల సామర్థ్య వినియోగం ప్రస్తుతం 82 శాతంగా, స్పాంజ్ ఐరన్ యూనిట్ల వద్ద ఉత్పాదక సామర్థ్యం 55 శాతంగా ఉండడం వల్ల, దేశీయ ఇనుప ఖనిజ వినియోగం కేవలం 118 మిలియన్ టన్నులుగానే ఉందని 'ఇక్రా' తెలిపింది.


### సరఫరాలకు ఇబ్బంది లేదు


ఎగుమతులతో కూడా కలుపుకొని మొత్తం ఇనుప ఖనిజ అవసరం 155 మిలియన్ టన్నులుగా ఉంటుందని 'ఇక్రా' పేర్కొంది. 2017 ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో ఇనుప ఖనిజ ఎగుమతులు 22 శాతం వృద్ధి చెందాయి. గోవాలో ఉత్పత్తిని లెక్కలోకి తీసుకోకపోయినా, దేశంలో 20-25 మిలియన్ టన్నుల మేరకు అదనపు సరఫరాలు ఉంటాయని దీన్ని బట్టి అవగతమవుతోంది. అయితే, గోవాలో లీజుల రద్దు వల్ల ఏర్పడిన వెలితిని భర్తీ చేయకుండా ఎక్కువ కాలం కొనసాగించడం కష్టం. అలాగే, ప్రయోజనం పొందడానికి ఒడిశా గనులు ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది. అలాగే, గోవా గనులు ఎక్కువ కాలం నిస్తేజంగా పడి ఉండకపోవచ్చు. ప్రస్తుతం ఇనుప ఖనిజ ధర గమనానికి ఫండమెంటల్స్ కారణం కాదు. స్పెక్యులేషన్‌తోనే అవి పెరుగుతున్నాయి. ఇది 2018 జనవరి-మార్చి త్రైమాసికంలో ఎన్.ఎం.డి.సి. వంటి



సంస్థలు ఒక్కసారిగా లాభాలు గడించడానికి సహాయపడవచ్చు. కానీ, దాని వల్ల ఉక్కు ఉత్పత్తి సంస్థలు, ఖనిజాన్ని ఉపయోగించుకునే ఇతర పరిశ్రమలు దెబ్బతినే అవకాశం ఉంది. హాట్ రోల్డ్ కాయిల్ ధర ఏప్రిల్ నుంచి దాదాపు 16 శాతం పెరిగి టన్నుకు రూ. 44,000గా ఉంది. ఇది యాంటీ-డంపింగ్ కొలబద్ద ధరకన్నా ఎక్కువ. డిమాండ్ వృద్ధి చెందడం ఆర్థిక వ్యవస్థకు శుభ సూచకమే. అది సులభంగా చేకూరుతున్నది కాదు. అధిక ధరల వల్ల కంపెనీలు దిగుమతులకు మొగ్గు చూపవచ్చు. డిమాండ్‌లో వృద్ధికి తగ్గట్లుగానే ప్రస్తుతం దిగుమతులు సుమారుగా ఐదు శాతం చొప్పున వృద్ధి చెందుతున్నాయి. ఇదిఇలాఉండగా, 2017 ఏప్రిల్-డిసెంబరు కాలంలో సెకండరీ ఉక్కు ఉత్పత్తి 6.2 శాతం తగ్గింది. వైజాగ్ స్టీల్ మార్చిలో అమ్మకాల్లో హఠాత్తుగా మందగతిని చూసింది. సాధారణంగా, అమ్మకాలు ఎక్కువగా ఉండే నెలలో అలా జరిగిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మౌలిక వసతుల నిర్మాణంలో ఉపయోగించే రకాలను వైజాగ్ స్టీల్ ఉత్పత్తి చేస్తోంది. ఈ ఉక్కు రకాల ధరలు గత రెండేళ్ళుగా మందగొడిగా ఉన్నాయి. జనవరిలో ఇవి సుమారు 20 శాతం పెరుగుదలను చూశాయి.





# కాలేయం మహా కష్టజీవి!

మన శరీర వాహనానికి కాలేయమే ఇంజిన్!! ఇది విటమిన్లు, గ్లూకోజు, ఐరన్ వంటి వాటిని నిల్వ చేసుకొని అవసరమైనప్పుడు శక్తిని అందజేస్తూ.. శరీరంలోని అన్ని వ్యవస్థలు సజావుగా, సాఫీగా సాగిపోయేలా చూస్తుంది. తిన్న ఆహారం జీర్ణం కావటానికి, పోషకాలు ఒంటపట్టటానికి తోడ్పడే పైత్యరసాన్ని విడుదల చేస్తుంది. రక్తంలో కలిసే వ్యర్థాలను, విషతుల్యాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేస్తుంటుంది. ఏదైనా గాయమైనప్పుడు రక్తం గడ్డకట్టటానికి తోడ్పడే పదార్థాలనూ ఉత్పత్తి చేస్తుంది. ఇంతటి కీలకమైన అవయవం కాబట్టే కాలేయం దెబ్బతింటే వ్యవస్థలన్నీ కుప్పకూలతాయి. మొరాయించిన వాహనంలా శరీరం కుదేలవుతుంది. అందుకే కాలేయాన్ని దెబ్బతీసే హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్‌ను ఆదిలోనే.. అక్యూట్ దశలోనే నిలువరించటం అత్యంతావశ్యకం. లేకపోతే ఇది దీర్ఘకాలిక సమస్యగా మారి.. కాలేయం గట్టిపడటం (సిరోసిస్), కాలేయ క్యాన్సర్ వంటి తీవ్ర సమస్యలకూ దారితీస్తోంది. ఇందుకు కొందరిలో చాలా ఏళ్లు పడితే.. ఇంకొందరిలో ఐదేళ్ల లోపే ఇలాంటి సమస్యలు ఆరంభం కావొచ్చు. మనదేశంలో సుమారు 3% మంది హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారని అంచనా. ఇది తెచ్చిపెట్టే కాలేయం గట్టిపడటం (సిరోసిస్), కాలేయ క్యాన్సర్ల మూలంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 6.5 లక్షల మంది మృత్యువాత పడుతున్నారు కూడా. మనదేశంలో కాలేయ క్యాన్సర్‌కు దారితీస్తున్న కారణాల్లో అతి ముఖ్యమైంది హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షనే కావటం గమనార్హం. అందువల్ల దీన్ని సకాలంలో సరైన చికిత్స తీసుకోవటం మంచిది. ఇప్పుడు దీనికి మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటితో హెపటైటిస్ బి దీర్ఘకాలిక సమస్యగా మారకుండా, తీవ్ర సమస్యల బారినపడకుండా చూసుకోవచ్చు. అయితే ఈ వైరస్ అందరిలో ఒకేలా ఉండదు. అందువల్ల హెపటైటిస్ బి విషయంలో ఎవరికి, ఎప్పుడు చికిత్స అవసరం? ఎలాంటి మందులు ఇవ్వాలి? అనేవి చాలా కీలకం. హెపటైటిస్ బాధితులకు ఇలాంటి వాటి విషయంలో చాలా సందేహాలు వస్తుంటాయి కూడా. ఇన్‌ఫెక్షన్ ఎంత కాలం నుంచి ఉంది? వైరస్ నిద్రాణంగా ఉందా? చురుకుగా ఉందా? వైరస్ సంఖ్య ఎంత ఉంది? కాలేయం ఏమైనా దెబ్బతిందా? అనేవన్నీ చికిత్సలో ప్రధాన భూమిక పోషిస్తాయి.



మన శరీరంలో అత్యంత కీలకమైన అవయాల్లో కాలేయం ప్రధానమైంది. కాలేయం మహా కష్టజీవి! ఇది అలుపెరగకుండా ఒక కర్మాగారం మాదిరిగా పనిచేస్తూ.. శరీర వ్యవస్థలన్నీ సజావుగా సాగేలా చేస్తుంది. ఒకింత మొండిదైనా కాలేయానికి వైరస్‌లు, జబ్బుల ముప్పూ ఎక్కువే. ముఖ్యంగా హెపటైటిస్ వైరస్‌లు ఏమాత్రం అవకాశం దొరికినా దాడి చేసేస్తుంటాయి. రకరకాల ఇన్‌ఫెక్షన్లను తెచ్చిపెడతాయి. ముఖ్యంగా హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ చాపకింద నీరులా పాకుతూ.. దీర్ఘకాలం పట్టి పీడిస్తుంది. కాలేయం గట్టిపడటం, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్ర సమస్యలకూ దారితీస్తుంది. కాబట్టి హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ నిర్లక్ష్యం చేయటానికి వీల్లేదు. ఎప్పటికప్పుడు దీని తీరుతెన్నులను గమనిస్తూ.. జాగ్రత్తగా కనిపెట్టుకోవాల్సి ఉంటుంది. దీంతో చిక్కేంటంటే.. హెపటైటిస్ బి అందరిలోనూ దీర్ఘకాలిక సమస్యగా పరిణమించకపోవచ్చు. దీర్ఘకాలికంగా మారినా అందరికీ చికిత్స అవసరం ఉండకపోవచ్చు. చికిత్స అవసరమైనా ఒకొకరికి ఒకోరకం మందులు ఇవ్వాల్సి రావొచ్చు. పైగా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి కూడా. ఇవన్నీ హెపటైటిస్ బాధితులకు ఒకపట్టాన అర్థం కావు. ఎప్పుడెప్పుడు పరీక్షలు చేయించుకోవాలి? ఏయే మందులు వేసుకోవాలి? అనే వాటిపై బోలెడు సందేహాలు తలెత్తుతుంటాయి. అందుకే వీటన్నింటిపై సమగ్ర వివరాలు మీకోసం...

## టీకా ఎవరికి?




హెచ్‌బీఎస్ ఏజీ పాజిటివ్‌గా ఉన్నవారి కుటుంబ సభ్యులు, భాగస్వాములు, వైద్య సిబ్బంది, శిశువులు, విద్యార్థులు, ఇంజెక్షన్ ద్వారా మాదక ద్రవ్యాల తీసుకునేవారు, మాదక ద్రవ్యాల అలవాటు గలవారి భాగస్వాములు, కాలేయజబ్బు గలవారు, దీర్ఘకాల కిడ్నీ జబ్బు బాధితులు, తరచుగా రక్త మార్పిడి అవసరమైనవారు, ఖైదీలు.. వీరందరూ హెపటైటిస్ బి టీకా తీసుకోవటం తప్పనిసరి

## తొలిదశలో ఏం చేయాలి?

హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ చాలావేగంగా కాలేయానికి చిక్కులు తెచ్చిపెట్టే సమస్యే కావొచ్చు. కానీ అక్యూట్ దశలో.. అంటే కొత్తగా ఇన్‌ఫెక్షన్ బారినపడ్డవారిలో చాలామందిలో పెద్దగా ఎలాంటి లక్షణాలూ కనబడవు. కొద్దిమందిలో కళ్లు-ఒళ్లు పచ్చపడటం వంటి కామెర్ల లక్షణాలు, ఫ్లూజ్వరం లాంటి లక్షణాలు, అలసట, వికారం, కడుపునొప్పి, కీళ్లనొప్పుల వంటివి ఉండొచ్చు. అక్యూట్ దశలో ఇన్‌ఫెక్షన్ నిర్ధరణ కోసం (హెపటైటిస్ బి సర్ఫేస్ యాంటిజెన్) పరీక్ష.. అలాగే కాలేయ ఇన్‌ఫెక్షన్ పరీక్షలు (బిలిరుబిన్, ఏఎల్‌టీ, ఆల్కలైన్ ఫాస్ఫేటేస్/ప్రోత్రాంబిన్‌టైమ్), అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తారు. అక్యూట్ దశలో చాలావరకూ మందుల అవసరమేమీ ఉండదు. ఇతరత్రా సమస్యేలేవీ లేకపోతే మంచి పోషకాహారం, తగినంత విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. పసరు మందులు తాగటం, ఒంటిపై వాతలు పెట్టించుకోవటం వంటివి చేయకూడదు. ఇలాంటి జాగ్రత్తలు చిన్నగానే కనిపించొచ్చు.. కానీ పెద్ద ప్రభావమే చూపుతాయి. పసరు మందులు తీసుకున్నవారిలో కిడ్నీ వైఫల్యంతో ఆసుపత్రులకు వచ్చేవారూ కనిపిస్తుండటమే దీనికి నిదర్శనం. అక్యూట్ దశలో.. వాంతులు, తీవ్రమైన బలహీనత, ఆకలి లేకపోవటం వంటివి కనబడితే రక్తనాళం ద్వారా ద్రవాలు (ఐవీ ఫ్లూయిడ్స్) ఇవ్వాల్సి ఉంటుంది. ఆయా లక్షణాలు తగ్గటానికీ కూడా చికిత్స చేయాలి. ఇలాంటి ఉపశమన చికిత్సతో 99.5 శాతం మందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండానే కామెర్లు తగ్గిపోతాయి. 90% మందిలో వైరస్ కూడా దానంతటదే తొలగిపోతుంది. అతి తక్కువ మందిలో మెదడు వాపు, కాలేయం వైఫల్యం వంటి సమస్యలు తలెత్తొచ్చు. వీరిని అత్యవసర విభాగంలో చేర్చి చికిత్స చేయాల్సి ఉంటుంది. అరుదుగా కొందరిలో కాలేయం విఫలమైతే మార్పిడి చేయాల్సిన అవసరం రావొచ్చు.

## మందులు.. ఆరు రకాలు

దీర్ఘకాల హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్‌కు పెద్దవారికి ఆరు రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. పెగ్ ఇంటర్‌ఫెరాన్ ఇంజెక్షన్లు మన వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేసి.. వైరస్‌ను సమర్థంగా ఎదుర్కోవటానికి తోడ్పడతాయి. ఇక యాంటీవైరల్ మందులైన ఎంటెకావిర్, టెనోఫోవిర్, ల్యాముvuడిన్, టెల్బువిడిన్, అడెఫోవిర్ మందులు వైరస్ సంఖ్య తగ్గటానికి దోహదం చేస్తాయి. ఇంటర్‌ఫెరాన్ ఇంజెక్షన్లతో పోలిస్తే యాంటీవైరల్ మందులతో దుష్ప్రభావాలు తక్కువ. ఇవి చాలావరకు సురక్షితం. వీటితో జబ్బుతో మంచాన పడటం, మరణం ముప్పు తగ్గుతుంది. ప్రస్తుతం పెగ్ ఇంటర్‌ఫెరాన్, ఎంటెకావిర్, టెనోఫోవిర్ మందులు ఎక్కువగా వాడుతున్నారు. అయితే దీర్ఘకాల హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ పూర్తిగా నయం కావటం అసాధ్యం. ఈ వైరస్ డీఎన్‌ఏ కాలేయ కణాల్లో నిద్రాణంగా ఉండిపోవచ్చు. రక్తంలో ఇన్‌ఫెక్షన్ ఆనవాళ్లు పూర్తిగా కనుమరుగైనా కూడా ఎప్పుడో అప్పుడు సమస్య తిరగబెట్టే అవకాశముందని గుర్తించటం అవసరం.



## దీర్ఘకాలిక దశలో ఏం చేయాలి?

హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ ఆరు నెలల కన్నా ఎక్కువగా ఉంటే దీర్ఘకాలిక దశగా (క్రానిక్ హెపటైటిస్ బి) పరిగణిస్తారు. నిజానికిది చాలామందిలో యాదృచ్ఛికంగానే బయటపడుతుంటుంది. ఇతరత్రా సమస్యల కోసం చేసే పరీక్షలు, హెల్త్ చెకప్, గర్భధారణ సమయంలో, రక్తదానం చేయటం వంటి సందర్భాల్లో అనుకోకుండా పాజిటివ్‌గా కనబడుతుంటుంది. సమస్య దీర్ఘకాలికంగా ఉన్నప్పటికీ.. వీరిలో అందరికీ చికిత్స అవసరం ఉండకపోవచ్చు. వైరస్ నిద్రాణంగా ఉందా? చురుకుగా ఉందా? ఇతరత్రా లక్షణాలను బట్టి చికిత్సను నిర్ణయిస్తారు. వైరస్ నిద్రాణంగా ఉన్నప్పుడు (ఇన్‌యాక్టివ్ క్యారియర్ స్టేట్): హెపటైటిస్ బి వైరస్ ఒంట్లో చేరినా కూడా కొద్దిమందిలో ఇది నిద్రాణంగానే ఉండిపోవచ్చు. పైకి ఎలాంటి లక్షణాలూ ఉండవు. అయితే వీరిలో వైరస్ ఎప్పుడైనా తిరిగి ఉద్ధ తం కావొచ్చు. కాబట్టి ప్రతి ఆరు నెలలకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. వీళ్లు అందరిలా మామూలుగానే జీవితం గడపొచ్చు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే... వీరి నుంచి ఇతరులకు వైరస్ సంక్రమించే అవకాశముండటం వల్ల భాగస్వాములు, కుటుంబ సభ్యులు హెపటైటిస్ బి టీకాలు పూర్తిగా తీసుకోవాలి.


## వైరస్ చురుకుగా ఉన్నప్పుడు



కాలేయం గట్టిపడే సూచనలేవీ లేకపోతే- వైరస్ నిద్రాణంగా ఉన్నవారిలో, చురుకుగా ఉన్నవారిలో పెద్ద తేడాలేవీ ఉండవు. వీరిలో వైరల్ లోడ్ 20వేల ఐయూ కన్నా ఎక్కువగా ఉంటుంది. ఇలా వైరస్ చురుకుగా ఉన్నవాళ్లు యాంటీవైరల్ చికిత్స తీసుకోవాలి. దీంతో వైరస్ నియంత్రణలో ఉంటుంది. కాలేయం గట్టిపడటం, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్ర సమస్యల బారినపడకుండా కాపాడుకోవచ్చు.

## కాలేయం దెబ్బతింటే లివర్ సిరోసిస్)

దీర్ఘకాలిక హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్‌లో పెద్ద సమస్య కాలేయం గట్టిపడటం (సిరోసిస్). ఇందులోనూ సమస్య తీవ్రతను బట్టి 'చైల్డ్స్ ఎ, బి, సి' అని మళ్లీ మూడు దశలున్నాయి. కాలేయ సామర్థ్య పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కాన్ (ప్లీహం పెద్దగా ఉండటం, పొట్టలో నీరుచేరటం తెలుస్తుంది), గ్యాస్ట్రోస్కోపీ (అన్నవాహిక గోడల్లో



రక్తనాళాలు ఉబ్బటం తెలుస్తుంది), వంటి పరీక్షలతో కాలేయం గట్టిపడటాన్ని, తీవ్రతను నిర్ధరిస్తారు. వీరికి యాంటీవైరల్ మందులతో పాటు పొట్టలో నీరు చేరటం, రక్తపు వాంతులు, మెదడు వాపు వంటి ఇతరత్రా సమస్యలను తగ్గించటానికీ తగు చికిత్స చెయ్యాల్సి ఉంటుంది. వీరిని వీలైనంతవరకు హాయిగా జీవించేలా చూడటానికే ప్రాధాన్యం ఇస్తారు.

## పిల్లలకు వైరస్ సంక్రమించకుండా

గర్భిణుల్లో హెపటైటిస్ బి వైరస్ పాజిటివ్‌గా కనబడితే వారి నుంచి పిల్లలకు వైరస్ సంక్రమించకుండా చూసుకోవటం చాలా అవసరం. మిగతావన్నీ ఎలా ఉన్నా.. వైరస్ సంఖ్య ఎక్కువగా ఉంటే యాంటీవైరల్ మందులైన టెనోఫోవిర్ లేదా ల్యాముvuడిన్ ఇస్తారు. ముఖ్యంగా టెనోఫోవిర్ బాగా ఉపయోగపడుతుంది. దీంతో కాన్పు సమయానికి వైరస్ ఉద్ధృతి బాగా తగ్గుతుంది. ఇక కాన్పు తర్వాత వెంటనే శిశువుకు హెపటైటిస్ ఇమ్యునోగ్లోబులిన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం హెపటైటిస్ బి టీకాలు పూర్తిగా ఇవ్వాలి. దీంతో 95% మంది పిల్లలను హెపటైటిస్ బి బారినపడకుండా కాపాడుకోవచ్చు. ఈ పద్ధతిని సరిగా పాటిస్తే తల్లి నుంచి పిల్లలకు హెపటైటిస్ బిని సంక్రమించకుండా దాదాపు పూర్తిగా నివారించుకోవచ్చు. ఒకవేళ తల్లి నుంచి పిల్లలకు వైరస్ సంక్రమించి, దీర్ఘకాలిక సమస్యగా మారితే పెద్దల్లో మాదిరిగానే చికిత్స చేయాల్సి ఉంటుంది. కాకపోతే కొన్ని మందులను పిల్లలకు ఇవ్వకూడదు. మందుల మోతాదులూ మారతాయి.

## వ్యక్తులను బట్టి చికిత్స



యాంటీవైరల్ మందుల అవసరం ఒకరిలో ఒకోలా ఉంటుంది. దీన్ని వయసు, లింగ బేధం, ఏఎల్‌టీ స్థాయిలు, హెచ్‌బీఇ ఏజీ స్థితి, హెచ్‌బీవీ డీఎన్‌ఏ స్థాయిలు, వైరస్ రకం, కాలేయం వాపు తీరుతెన్నులు, కాలేయం గట్టిపడటం వంటి వాటిని బట్టి నిర్ధరిస్తారు. తీవ్రమైన గుండెజబ్బు, మధుమేహం, హెచ్‌ఐవీ వంటి ఇతరత్రా సమస్యలను.. ఆడవారిలోనైతే గర్భధారణనూ పరిగణనలోకి తీసుకుంటారు. యాంటీవైరల్ మందుల ఖరీదు ఎక్కువ కాబట్టి రోగి ఆర్థిక స్థితి కూడా కీలకమే. వీటన్నింటి ఆధారంగా చికిత్సను ఆరంభిస్తారు.

## నివారణే అత్యుత్తమం

హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ వచ్చాక బాధపడటం కన్నా అసలు దీని బారినపడకుండా చూసుకోవటమే ఉత్తమం. ఇప్పటికే శరీరంలో హెపటైటిస్ బి వైరస్ ఉన్న వ్యక్తుల రక్తం, శారీరక స్రావాల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఇతరుల రేజర్లు, టూత్ బ్రష్షులు, నెయిల్ క్లిప్పర్ల వంటివి ఉపయోగించటం ద్వారా రావొచ్చు. అందువల్ల ఇలాంటి వాటికి దూరంగా ఉండటం మంచిది. డెంటిస్టుల వద్దకు, ఆక్యుపంక్చర్ చికిత్సకు వెళ్లినపుడు ఇతరులకు వాడిన పరికరాలు, సూదులు మళ్లీ వాడకుండా చూసుకోవాలి. చెవులు కుట్టేందుకు, బోడీ పియర్సింగ్‌కు, పచ్చబొట్టు వేయటానికి వాడే పరికరాలు, సూదుల వంటివి ఒకరికి వాడినవి మరొకరికి వాడటం తగదు. రక్తం ఎక్కించే సమయంలోనూ సంపూర్ణ జాగ్రత్తలు తీసుకోవాలి. హెపటైటిస్ బి సంక్రమించకుండా టీకా కూడా అందుబాటులో ఉంది. అవసరమైనవారిలో హెపటైటిస్ బి నివారణకు ఇది అత్యుత్తమమైన పద్ధతి.

## అవయవాన్ని కాపాడడమే...



ఏ ఎముకకు క్యాన్సర్ సోకినా సాధ్యమైనంత వరకు ఆ అవయవాన్ని తొలగించకుండా కాపాడడమే డాక్టర్ల లక్ష్యం. శస్త్రచికిత్స ప్రక్రియను ఎంపిక చేసుకున్నప్పటికీ ఇందుకోసమే వారు శ్రమిస్తారు. ఈ ఉద్దేశాన్నే వైద్యపరిభాషలో 'లింబ్ సాల్వేజ్ సర్జరీ' (ఎల్.ఎస్.ఎస్.)అంటారు. ఇందులో రెండు దశలుంటాయి. మొదటి దశలో ఆరోగ్యకరమైన భాగాన్ని వీలైనంతగా రక్షిస్తూ క్యాన్సర్‌కు గురైన భాగాన్ని పూర్తిగా తొలగించడం. రెండో దశలో తొలగింపు తర్వాత కోల్పోయిన భాగాన్ని పునర్నిర్మించడం. దీనికోసం వివిధ మార్గాలు అవలంబిస్తారు. ఉదాహరణకు... కోల్పోయిన ఎముక స్థానంలో లోహంతో చేసిన అలాంటి ఆక తినే అమర్చుతారు. ఇలా కృత్రిమంగా అమర్చే లోహభాగాన్ని 'ప్రోస్థిసిస్' అంటారు. ఒక్కోసారి మొత్తం ఎముకే లోహంతో తయారుచేసి, తొలగించిన ఎముక స్థానంలో దీన్ని అమరుస్తారు. ఇది ఎముక మార్పిడి (బోన్ ట్రాన్స్‌ప్లాంట్) చికిత్స. ఇలా చేయడానికి అనుగుణంగా ఇప్పుడు సర్జన్లకు రకరకాల లోహాలతో రూపొందించనవి.. రోగి ఎముక పరిమాణం ఎంతుందో అంతే సైజ్‌లో ఉన్నవీ లభ్యమవుతున్నాయి. వయసు పెరుగుతున్న కొద్దీ లోహపు ఎముకా పెరిగేలా వ్యాప్తిచెందే కృత్రిమ ఎముకలూ ఉన్నాయి. దీనితో పాటు రోగికి అవసరమైన ఆహారం (న్యూట్రిషన్), నొప్పి తగ్గించడం (పెయిన్ మేనేజ్‌మెంట్), కదలికలను మునుపటిలా చేసే స్వాభావిక చికిత్స (నేచురోపతి మెడిసిన్), ఫిజియోథెరపీ వంటివాటిల్లో డాక్టర్ తగిన సూచనలూ అందిస్తారు.

# చురుకుగా ఉండండి చాలు!

జీవనశైలిలో చేసుకునే మార్పులు, రోజువారీ వ్యాయామం.. ఈ రెండూ మధుమేహాన్ని అదుపులో ఉంచుతాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. రోజూ వ్యాయామం చేయడం వల్ల బరువు తగ్గడంతోపాటు రక్తపోటు అదుపులో ఉంటుంది. హానికారక ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు నియంత్రణలో ఉంటాయి. ఆందోళన తగ్గుతుంది. కండర పుష్టి పెరిగి ఎముకలు బలపడతాయి. ముఖ్యంగా ఇన్సులిన్ విడుదల స్థాయిలు క్రమబద్ధమవుతాయి. వ్యాయామం అంటే మరీ పెద్ద వ్యాయామాలేం చేయాల్సిన అవసరం లేదు. మెట్లు ఎక్కడం, తోటపని చేయడం, కారు కడగడం, ఇంటి పనులు చేయడం వల్ల కూడా క్యాలరీలు కరుగుతాయి. ఇంత చిన్న పనులకే మన శరీరంలో మార్పు వస్తుందా అంటే... ఏదో ఒక రోజు చేసి మమ అనిపించడం కాకుండా రోజూ ఇంటి పనులు స్వయంగా చేయడం వల్ల క్యాలరీలు నియంత్రణలో ఉంటాయి. ఇంటి పనులు చేసుకునే తీరిక లేదు ఉద్యోగం చేస్తున్నా అంటారా? అయితే మీ పని వేళలకు అనుగుణంగా వ్యాయామ వేళలని మార్చుకోండి. పనికి వెళ్లే ముందు, సాయంత్రం తీరిగ్గా... ఇలా మీ ఇష్టం. కానీ రోజువారీ వ్యాయామం మాత్రం తప్పనిసరి. వారంలో 150 నిమిషాల పాటు ఏరోబిక్ వ్యాయామాలు చేయడం వల్ల ఫలితం ఉందంటున్నారు అమెరికా ఆరోగ్య విభాగం నిపుణులు. ఏరోబిక్స్ వంటివి మేం చేయలేం అంటారా.. దానికీ ప్రత్యామ్నాయం ఉంది. వారంలో ఐదుసార్లు 30 నిమిషాల పాటూ నడిస్తే చాలంటున్నారు. అయితే ఓ చిన్న హెచ్చరిక. డయాబెటిక్ రెటినోపతీ కంటి సమస్యతో బాధపడేవారు ఎక్కువ బరువు ఎత్తే వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ వంటి వ్యాయామాలు చేయడం మంచిది కాదు. ఇలా చేస్తే కంటిపై ఒత్తిడి పడే ప్రమాదం ఉంది. అలాగే నాడులు బలహీనపడిన న్యూరోపతి సమస్య ఉన్నవాళ్లు, ముఖ్యంగా అరికాలిలో స్పర్శ తగ్గిన వారు కాళ్ల మీద ఒత్తిడి పడే వ్యాయామాలు చేయకూడదు. బదులుగా ఈత, యోగా వంటివి చేయడం మంచిది.



# గొంతు పదిలం!



ఎవరి గొంతు వారిదే. ఏ ఇద్దరి మాటా ఒకేలా ఉండదు. వేలి ముద్రల మాదిరిగానే ఇదీ ప్రత్యేకమైందే. శ్వాసనాళం మొదట్లో స్వరపేటికలోని రెండు స్వరతంత్రులు కంపించటం ద్వారా మాట పుట్టుకొస్తుంది. మనం మాట్లాడుతున్నప్పుడు స్వరతంత్రులు రెండూ ఒకదగ్గరికి వస్తాయి. వీటి మధ్యలోంచి గాలి బయటకు వచ్చే క్రమంలో కంపిస్తాయి. ఈ కంపనాల నుంచి పుట్టుకొచ్చిన శబ్ద తరంగాలు గొంతు, ముక్కు, నోరు ద్వారా ప్రయాణిస్తాయి. ఇదే మనకు మాటలుగా వినబడుతుంది. కొందరి మాట బిగ్గరగా, మరికొందరి మాట పీలగా.. ఇలా రకరకాలుగా ఉంటుంది కదా. దీనికి కారణం ఈ స్వరతంత్రుల సైజు, ఆకారమే. గట్టిగా అరవటం, కేరింతలు కొట్టటం, బిగ్గరగా మాట్లాడటం వంటి సందర్భాల్లో గొంతు బొంగురుపోవటం చూస్తూనే ఉంటాం. ఇలాంటి పనుల మూలంగా స్వరతంత్రులపై అదనపు భారం పడుతుంది. ఇది రకరకాల సమస్యలకు దారితీస్తుంది. న్యాయవాదులు, గాయకులు, రాజకీయ నాయకుల వంటి వారికి ఇలాంటి సమస్యల ముప్పు ఎక్కువ. మాటామాటికీ గొంతు సరాయించుకోవటం, గొంతులో గరగర, మాట పీలగా రావటం, పాటలు పాడుతున్నప్పుడు ఉచ్ఛస్వరాలను అందుకోలేకపోవటం వంటివన్నీ గొంతు బాగా లేదనటానికి సూచికలే. వయొలిన్ వంటి వాయిద్యాలను చెక్కపెట్టెలో పెట్టి భద్రపరుస్తాం కానీ మన గొంతును కాపాడుకోవటంపై అంత శ్రద్ధ తీసుకోం. వయొలిన్ చెడిపోతే కొత్తది కొనుక్కోవచ్చు గానీ స్వరపేటిక దెబ్బతింటే కొత్తది తీసుకురాలేం. అందువల్ల గొంతును కాపాడుకోవటంపై.. ముఖ్యంగా బిగ్గరగా మాట్లాడే వృత్తుల్లో ఉన్నవారు దృష్టి పెట్టటం మంచిది. ఉదాహరణకు- గుంపులో మాట్లాడాల్సి వచ్చినపుడు మైక్ ఉపయోగించటం, గొంతు బొంగురుపోయినప్పుడు తక్కువగా మాట్లాడటం వంటివి చేయొచ్చు. తగినంత నీరు తాగటం, మరీ ఎక్కువగా మాట్లాడకపోవటం ద్వారా గొంతు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. గొంతు సమస్యలకు చాలావరకు బిగ్గరగా మాట్లాడటం, అరవటం, గీపెట్టటమే కారణం. అయితే స్వరతంత్రులపై కణితులు, జీర్ణాశయంలోని రసాలు గొంతులోకి ఎగదన్నుకొని రావటం, తల లేదా గొంతు క్యాన్సర్, నాడీ సమస్యల వంటివీ సమస్యలకు దారితీయొచ్చు. కాబట్టి ఏదైనా గొంతు సమస్య దీర్ఘకాలంగా వేధిస్తుంటే ఒకసారి డాక్టర్‌ను సంప్రతించటం మంచిది. అవసరమైతే చెవి, ముక్కు, గొంతు నిపుణులు లేదా స్పీచ్ థెరపిస్టుల సాయంతో సమస్యను నిర్ధరించి, చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.

## ఒత్తిడివల్లే తలనొప్పి!



క్షణం తీరిక లేని జీవనం.. నిత్యం పరుగులు, సమయానికి నిద్రాహారాలు లేకపోవడం.. నిలకడలేని ఆలోచనలతో యాంత్రికంగా పరిగెత్తడం.. తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన పరిస్థితుల్లో అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. ఇలాంటి ఒత్తిడితో వచ్చే వాటిల్లో ముఖ్యమైనది తలనొప్పి. తలనొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు చిరాకు, కోపం ఎక్కువగా ఉండి ఏ పనీ చేయడం వీలుకాదు. దీంతో వాంతి వచ్చినట్లుగా అనిపించడం.. శబ్ధాలు భరించలేకపోవడం.. వెలుతురును సరిగా చూడలేకపోవడం.. కళ్లకు చీకట్లు కమ్మినట్లు అనిపించడం వంటి లక్షణాలతో బాధపడతారు. అధిక మానసిక ఒత్తిడి వలన మెదడులో కొన్ని రసాయనిక మార్పులు జరుగుతాయి. ఫలితంగా తలనొప్పి వస్తుంది. మెదడు కణాలలో కణితలు ఏర్పడటం వల్లా తలనొప్పి వస్తుంది. తలకు గాయాలు తగలడంగానీ కొన్ని సందర్భాల్లో మెదడులో ఇన్‌ఫెక్షన్ల వల్ల తలనొప్పి వస్తుంది. కంటికి సంబంధించిన వ్యాధుల్ని నిర్లక్ష్యం చేస్తే తలనొప్పి వేధిస్తుంది.

మనం స్పోర్ట్స్
సోమవారం 26 మార్చి 2018
www.manamnews.com

జెంటిల్‌మెన్ గేమ్ క్రికెట్ పరువును బజారుపాలు చేసిన ఆస్ట్రేలియా జట్టుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి దాకా మాటలతో ప్రత్యర్థులపై మైదానంలో యుద్ధం చేసే ఆస్ట్రేలియా క్రికెటర్లంతా కలసి ఇలా అడ్డదారులు తొక్కటంపై షేమ్ షేమ్ అంటూ అభిమానులు దుమ్మెత్తిపోస్తున్నారు. గెలవటం కోసం దొడ్డిదారులు వెతుక్కోవటం నీచమని మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు. దేశ ప్రతిష్ట మంటగలిపే పనులు సిగ్గుపడేలా ఉన్నాయని ఆస్ట్రేలియా ప్రధాని టర్నబుల్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి స్మిత్, వార్నర్‌లను కెప్టెన్, వైస్ కెప్టెన్సీ పదవుల నుంచి తొలగించారు.

# షేమ్ షేమ్..

## స్మిత్‌కు డబుల్ షాక్ | తాత్కాలిక కెప్టెన్‌గా టిమ్ పైన్

**విచారణ తర్వాత తుది నిర్ణయం ● దేశం పరువు తీయొద్దన్న ప్రధాని ● క్రీడాలోకం దిగ్భ్రాంతి**



### ఎక్కడ చూసినా ఇదే చర్చ

ఆస్ట్రేలియా క్రికెటర్ల ఉదంతం ప్రపంచమంతటా చర్చనీయాంశమైంది. కేప్‌టౌన్ టెస్ట్‌లో బాల్ ట్యాంపరింగ్ వ్యవహారాన్ని అన్ని దేశాల పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. క్రికెట్ చరిత్రలో ఇదోక బ్లాక్‌డేగా అభివర్ణించాయి.

కేప్‌టౌన్ : సౌతాఫ్రికాతో కేప్‌టౌన్ టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్ల బాల్ టాంపరింగ్ ఘటనపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) తీవ్రంగా స్పందించింది. బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడ్డ ఆసీస్ ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్‌కి మూడు డీమెరిట్ పాయింట్లతో పాటు, మ్యాచ్ ఫీజులో 75 శాతం కోత విధించింది. బాన్‌క్రాఫ్ట్‌తో పాటు కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు మ్యాచ్ ఫీజులో 100శాతం కోత విధించిన ఐసీసీ ఒక టెస్ట్ మ్యాచ్‌లో నిషేధం విధించింది. ఆస్ట్రేలియా జట్టు బాల్ టాంపరింగ్ వ్యవహారంపై క్రీడాలోకం నివ్వెరపోయింది. ప్రపంచ క్రికెట్‌లో ఇదొక బ్లాక్‌డేగా క్రీడాభిమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బాల్ టాంపరింగ్ వివాదానికి బాధ్యులుగా చేస్తూ కేప్‌టౌన్‌లో జరుగుతున్న మూడో టెస్టు చివరి రెండు రోజుల ఆట నుంచి కెప్టెన్ స్మిత్, వైస్‌కెప్టెన్ వార్నర్‌లను తప్పించారు. ఈ టెస్టు చివరి రెండు రోజులకు ఆస్ట్రేలియా జట్టుకు వికెట్ కీపర్ టిమ్ పైన్ సారథ్యం చేపడతాని క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో సదర్‌లాండ్ ప్రకటించారు. ఈ వివాదంపై పెనుదుమారం రేగడం, స్మిత్‌ను జట్టునుంచి తప్పించాలన్న వత్తిడితో క్రికెట్ ఆస్ట్రేలియా ఈ నిర్ణయం తీసుకుంది. తదుపరి విచారణ కొనసాగేంత వరకూ ఇద్దరూ జట్టులో కొనసాగుతారని సదర్‌లాండ్ తెలిపారు . దక్షిణాఫ్రికాతో మూడో టెస్టు మూడో రోజు ఆట అనంతరం అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. తప్పుడుపనైనప్పటికీ అందరూకలసి కట్టుగా చేశామని స్మిత్ చెప్పటం అభిమానులను నిర్వెరపరుస్తోందని ఆసీస్ బోర్డు మండిపడింది. ఈ వ్యవహారంపై ఆదివారం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు బయల్దేరారు. ఈ ఘటనపై తదుపరి విచారణకు బోర్డు సిద్దంగా ఉందని, అత్యవసరంగా ఈ వివాదంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు హామీ ఇచ్చింది. ఆస్ట్రేలియా క్రికెట్ అభివృద్ధికి దోహదపడే నిర్ణయం తీసుకోవటానికి వెనకడుగు వేయమని క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ డేవిడ్ పీవార్ తెలిపాడు. విచారణ జరిపిన అనంతరం రాయ్ ఇచ్చే నివేదిక ఆధారంగా క్రికెట్ ఆస్ట్రేలియా నియమావళి ప్రకారం ఇద్దరిపై చర్య తీసుకుంటామని తెలిపింది.

కేప్‌టౌన్‌లో జరిగిన సంఘనపై క్రీడాలోకం నివ్వెరపోయింది. మాజీ ఆటగాళ్లు, క్రికెట్ అభిమానులు, విశ్లేషకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షేమ్ షేమ్ అంటూ.. ఆస్ట్రేలియా జట్టుపై సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు. అన్ని దేశాల క్రికెటర్లు ఆస్ట్రేలియాను దుమ్మెత్తిపోస్తున్నారు. సిగ్గుమాలిన చర్య అంటూ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్‌వా, బోర్డర్‌లు తీవ్ర ఆవేదన చెందారు.

ఆస్ట్రేలియా ఇలాంటి సిగ్గుమాలిన పని చేస్తుందని తాము ఊహించలేదని పలువురు మాజీ క్రికెటర్లు విమర్శించారు. 'మైదానంలో తమ సహచర ఆటగాళ్లు చేసింది క్షమించరాని తప్పుగా ఇంగ్లండ మాజీ క్రికెటర్ అథర్టన్ అభివర్ణించాడు.



అత్యవసర సమావేశం నిర్ణయించింది. ఈ మ్యాచ్‌ను కొనసాగించాలన్న ఉద్దేశంతో టిమ్ పైన్‌ను కెప్టెన్‌గా నియమించామని, పైన్ సారథ్యంలో స్మిత్, వార్నర్‌లు ఆడతారని సదర్‌లాండ్ తెలిపారు. ఆటగాళ్లిద్దరితో చర్చించాక ఈ నిర్ణయం తీసుకున్నారు. కెప్టెన్సీ నుంచితప్పుకోనని ప్రకటించిన స్మిత్ బోర్డు నిర్ణయంతో దిగి రాక తప్పలేదు.

### విచారణ కొనసాగుతుంది :

కేప్‌టౌన్ టెస్టులో జరిగిన బాల్‌టాంపరింగ వివాదంపై ఆస్ట్రేలియా ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. స్మిత్‌తో పాటు ఇందులో భాగస్వాములైన వారిపై చర్యలుతీసుకోవాలని ఆదేశించింది. జరిగిన ఘటనపై ప్రధాని టర్నబుల్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెటర్లను చూసి దేశం మొత్తం గర్విస్తుంటే వారు ఇలాంటి నీచమైన పనులకు పాల్పడి దేశం పరువు తీయడం తనను కలచివేస్తోందన్నారు. రాజకీయ నాయకులకంటే ప్రజలు వీరికే ఎక్కువ విలువ ఇస్తారని, అంతటి గౌరవం పొందుతున్న వారు ఇలాంటి తప్పులకు పాల్పడడం క్షమించరాని నేరమన్నారు. ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని క్రికెట్ ఆస్ట్రేలియాను ప్రధాని ఆదేశించారు. ఆస్ట్రేలియాను కుదిపేసిన ఈ వ్యవహారంపై ఆదేశ ప్రభుత్వం అత్యవసరంగా చర్చిందింది. ఆస్ట్రేలియా క్రికెట్‌కు మాయని మచ్చలా మిగిల్చిన ఈ వివాదంపై విచారణకు ఆదేశించింది. స్మిత్, వార్నర్‌లపై వేటు తర్వాత కూడా ఈ సంఘటనపై విచారణ కొనసాగిస్తామని ప్రకటించింది. ఆస్ట్రేలియన్ స్పోర్ట్స్ కమిషన్ చైర్మన్ జాన్ వేలి, సీఈవో కాటే పల్మెర్‌లు ప్రభుత్వంతో వివాదంపై చర్చించారు.

### విచారణాధికారిగా టిమ్ రాయ్

క్రికెట్ ఆస్ట్రేలియా అధికారి ఇయాన్ రాయ్‌ను ఈ వివాదంపై విచారణ జరిపేందుకు ఆస్ట్రేలియా క్రికెట్‌బోర్డు నియమించింది. రాయ్‌తో పాటు టీమ్ పెర్ఫార్మెన్స్ మేనేజర్ పాట్ హోవర్డ్‌లు దక్షిణాఫ్రికా

### ఐపీఎల్‌లో స్మిత్ ఆడతాడా...

బాల్ టాంపరింగ్ వివాదం కారణంగా కెప్టెన్సీ కోల్పోయి చిక్కుల్లో పడిన స్టీవ్ స్మిత్‌కు మరో ఎదురు దెబ్బ తగలనుంది. వచ్చే నెల్లో మొదలయ్యే ఐపీఎల్11వ సీజన్‌లు రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్సీ నుంచి స్మిత్‌ను తప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్మిత్‌ను నాయకత్వ బాధ్యతల నుంచి తప్పిం చాలని ఇప్పటికే ఫ్రాంచైజీ నిర్ణయించినట్లు సమాచారం. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల కారణంగా రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లపై రెండేళ్ల నిషేధం వేటు పడింది. తిరిగి ఈ ఏడాదే ఆ జట్లు ఐపీఎల్‌లో అడుగుపెడు తున్నాయి. ఇలాంటి సమయంలో బాల్ ట్యాంపరింగ్ మరకలు అంటిన స్మిత్‌ను కెప్టెన్‌గా కొనసాగించేందుకు రాజస్థాన్ యాజ మాన్యం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయమై ఫ్రాంచైజీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. రెండేళ్ల క్రితం కూడా స్మిత్ రాజస్థాన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతణ్ని వేలానికి ముం దే ఆ జట్టు తమతో అట్టిపెట్టుకుంది. ఈ ఏడాది కెప్టెన్సీ కోసం రహానేతో పోటీ ఎదురైనప్పటికీ.. స్మిత్‌నే కెప్టెన్‌గా ఎంపిక చేశారు. స్మిత్ స్థానంలో అజింక్యా రహా నేకు సారథ్య బాధ్యతలు అప్పగించే అవకాశాన్ని జట్టు యాజమాన్యం పరిశీలిస్తోంది.

### వార్నర్‌పై సన్‌రైజర్స్ వేటు?

పీఎల్ 11వ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కెప్టెన్ పదవి నుంచి స్మిత్‌ను తప్పిస్తూ.. జట్టు యాజమాన్యం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు డేవిడ్ వార్నర్‌ని కెప్టెన్ పదవి నుంచి తప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయంపై జట్టు బోర్డు సభ్యులు ఇప్పటికే చర్చలు మొదలుపెట్టారు. అయితే వార్నర్‌ని జట్టు కెప్టెన్సీ నుంచి తప్పించి అతని స్థానంలో భారత ఓపెనర్ శిఖర్ ధావన్‌కి హైదరాబాద్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. కాగా బాల్ ట్యాంపరింగ్ ఘటనపై విచారణ చేపట్టిన క్రికెట్ ఆస్ట్రేలియా విచారణ చేపట్టిన తర్వాత వార్నర్, స్మిత్‌పై చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

### అవసరమైతే మళ్లీ వస్తా : క్లార్క్

అవసరమైతే మళ్లీ ఆస్ట్రేలియా కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే ఆలోచనలో ఉన్నట్లు ఆసీస్ మాజీ సారథి మైకేల్ క్లార్క్ అన్నాడు. కేప్‌టౌన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న కీలక మూడో టెస్ట్‌లో ఆసీస్ ఆటగాడు కామెరూన్ బెన్‌క్రాఫ్ట్ బంతి రివర్స్ స్వింగ్ తిరిగేందుకుగానూ ట్యాంపరింగ్‌కు పాల్పడుతూ..కెమెరా కంటికి చిక్కిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అప్రమత్తమైన క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) మైదానంలో తమ ఆటగాళ్ల ప్రవర్తనపై ఆదివారం చర్యలు తీసుకుంది. కెప్టెన్ స్టీవెన్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌ను వారి బాధ్యతల నుంచి తొలిగించి మూడో టెస్ట్ సారథిగా మరో ఆటగాడు టిమ్ పైన్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉదంతం నేపథ్యంలో మాజీ సారథి మైకేల్ క్లార్క్ స్పందించాడు. ఈ విషయమై తీవ్ర ఆవేదనకు లోనై మాట్లాడాడు. ఒకవేళ ఆస్ట్రేలియా కెప్టెన్‌గా బాధ్యతలు చేపడతారా అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా..'సరైన వ్యక్తులు వచ్చి అడిగినప్పుడు నా సమాధానం గురించి ఆలోచిస్తానంటూ' క్లార్క్ తన మనస్సులో మాట బయటపెట్టాడు.

### తొండాటకు మారుపేరు స్మిత్



బాల్‌టాంపరింగ్ వివాదానికి కారకుడైన ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌పై వివాదాలు బోలెడున్నాయి.

**డ్రెసింగ్ రూమ్ సాయం ..**

భారత్‌తో బెంగళూరులో జరిగిన టెస్టు మ్యాచ్‌లో అంపైర్ తీసుకున్న ఎల్బీడబ్ల్యు నిర్ణయంపై డ్రెస్సింగ్ రూమ్ నుంచి రివ్యూ సలహా కోసం ఎదురు చూసి స్మిత్ పెనుదుమారం రేపాడు. దీనిపై భారత కెప్టెన్ కోహ్లీ అభ్యంతరం చెప్పటం, అంపైర్లకు ఫిర్యాదు చేయటంతో స్మిత్‌ను మైదానం నుంచి అంపైర్లు వెనక్కు పంపేశారు. 2017 గవాస్కర్ -బోర్డర్ టెస్ట్ సిరీస్‌లో జరిగిన ఈ ఘటన రెండు దేశాలను వేడెక్కించింది. క్రీడా స్పూర్తికి విరుద్ధంగా డ్రెస్సింగ్ రూమ్ నుంచి సహకారం కోరిన స్మిత్‌పై అప్పట్లో ఐసీసీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీనిపై ఐసీసీ మౌనంగా ఉండటంపై బీసీసీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

**అండర్సన్‌పై చిందులు**

ఇటీవల యాషెస్ సిరీస్‌లో ఈ ఘటన జరిగింది. ఆస్ట్రేలియా క్రికెటర్లు తమను మాటలతో వేధిస్తున్నారంటూ ఇంగ్లండ్ బౌలర్ అండర్సన్ ఆరోపించాడు.దీనిపై స్మిత్ ఎదురుదాడికి దిగాడు. స్లెడ్జింగ్‌తో అండర్సన్‌పై విరుచుకుపడ్డాడు. అడిలైడ్ టెస్ట్‌లో ఈ వివాదం జరిగింది.

**అంపైర్‌తోనూ గొడవ**

న్యూజిలాండ్‌తో 2016లో క్రైస్ట్ చర్చ్‌లో అంపైర్ రాంట్‌పై స్మిత్ చిందులు తొక్కాడు. తమ జట్టుకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించాడు. దీంతో స్మిత్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా కట్టాడు.

**రబడాపై అసంతృప్తి**

గతవారం ఆస్ట్రేలియా -దక్షిణాఫ్రికా మధ్య పోర్ట్ఎలిజిబెత్‌లో జరిగిన టెస్ట్‌లో డీమెరిట్ పాయింట్లతో రెండు మ్యాచ్‌ల నిషేధానికి గురైన రబాడా అంటే స్మిత్‌కు ఎప్పుడూ మంటే. ఉద్దేశపూర్వకంగా స్మిత్‌ను ఢీకొట్టాడని ఐసీసీ రబడాపై డీమెరిట్ పాయింట్లు విధించింది. అయితే దీనిపై అప్పీల్ చేసుకోవడంతో రబడాపై నిషేధం తొలగింది. దీనిపై స్మిత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఐసీసీ నిర్ణయాన్ని ప్రశ్నించాడు.

### మాయని మచ్చ



# బాల్ టాంపరింగ్

బాల్ టాంపరింగ్ క్రికెట్‌కు కొత్తేమీ కాదు. బంతిని రివర్స్ స్వింగ్ చేసేందుకు ప్రయత్నించటమే బాల్ టాంపరింగ్. ఇప్పటి దాక క్రికెట్ చరిత్రలో ఈ టాంపరింగ్ వివాదాలు చాలా సార్లు జరిగాయి. 1976-77 సిరీస్‌లో ఇంగ్లండ్ బౌలర్ జాన్ లీవర్ ఈ వివాదానికి ఆద్యుడు

#### డుప్లెసిస్ : (ఆస్ట్రేలియా - దక్షిణాఫ్రికా) 2016



2006లో జరిగిన బాల్‌టాంపరింగ్ వివాదం ప్రపంచ క్రికెట్‌కు కుదిపేసింది. దక్షిణాఫికా - ఆస్ట్రేలియా జట్లమధ్య రేగిన వివాదానికి అప్పటి దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ బాధ్యుడు. హోబర్ట్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో నోటి నుంచి ఉమ్మిని తీసి బంతి కుట్లపై పూసిన ఘటన దుమారం రేపింది. ఈ వ్యవహారంపై ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ఎలాంటి ఫిర్యాదు చేయనప్పటికీ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ డుప్లెసిస్‌ను దోషిగా తేల్చి 100 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించింది. అయితే మ్యాచ్ నిషేధం నుంచి బయటపడ్డ డుప్లెసిస్ ఆ మ్యాచ్‌లో సెంచరీ చేశాడు.

#### డుప్లెసిస్ : (పాకిస్తాన్ -దక్షిణాఫ్రికా : 2013



ఓ వస్తువును ఉపయోగించి బంతి కండిషన్‌ను మార్చేందుకు దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ ప్రయత్నించిన ఘటన 2013లో జరిగింది. పాకిస్తాన్‌తో దుబాయిలో జరిగిన ఈ మ్యాచ్‌లో జేబుకు ఉన్న జిప్‌తో బంతి షేప్ మార్చేందుకు డుప్లెసిస్ ప్రయత్నించటం స్పష్టంగా కనిపించింది. దీంతో డుప్లెసిస్ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించారు. ఏడాది తర్వాత మరో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బౌలర్ ఫిలాండర్ కూడా బాల్‌టాంపరింగ్‌లో దొరికిపోయాడు. బంతిని గోళ్లతోనూ బొటనవేలితోనూ రుద్దుతూ కెమెరాకు చిక్కాడు.

#### ఇంజమామ్ (పాకిస్తాన్ వర్సెస్ ఇంగ్లండ్ 2006)



12 ఏళ్ల క్రితం పాకిస్తాన్ - ఇంగ్లండ్ జట్ల మధ్య ఓవల్‌లో జరిగిన బాల్‌టాంపరింగ్ వివాదం క్రికెట్ ప్రపంచాన్ని కుదిపేసింది. ఇంగ్లండ్‌పై పోరాడుతున్న పాకిస్తాన్ జట్టు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిందంటూ ఐదు పెనాల్టీ రన్స్‌ను ఇంగ్లండ్‌కు అంపైర్లు డారెల్ హెయిర్, బిల్లీ డెక్‌ట్రోవ్‌లు కేటాయించారు. అంపైర్ల నిర్ణయంపై ఆగ్రహించిన పాకిస్తాన్ మ్యాచ్‌ను ఆడకుండా నిరసన తెలిపింది. దీంతో అంపైర్లు ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు. అయితే ఈ వివాదంలో పాకిస్తాన్ తప్పేమీ లేదని ఐసీసీ విచారణ తర్వాత ప్రకటించింది. ఆ మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించింది.

#### సచిన్ : (భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా :2001)



పోర్ట్ ఎలిజిబెత్ టెస్ట్‌లో బంతిని ఉద్దేశపూర్వకంగా రుద్దాడన్న ఆరోపణలతో 75 శాతం జరిమానాతో పాటు మాస్టర్ బ్లాస్టర్ సచిన్‌పై ఒక టెస్టు నిషేధం పడింది. మ్యాచ్ రెఫరీ మైక్ డెనిస్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ క్రికెట్‌కు కుదిపేసింది. అయితే సచిన్ బంతిపై ఉన్న గడ్డిని మాత్రమే తొలగించాడని కెమెరాల్లో స్పష్టమైంది. ఐసీసీకి, బీసీసీఐకి మధ్య పెద్ద దుమారం రేగింది. డెనిస్ నిర్ణయంపై అభిమానులు తీవ్రంగా మండిపడ్డారు. అయితే సచిన్ నిర్దోషని ఐసీసీ విచారణలో తేలింది.

#### అథర్టన్ (ఇంగ్లండ్ -వర్సెస్ దక్షిణాఫ్రికా :1994)



ఇంగ్లండ్ కెప్టెన్ మైక్ అథర్టన్‌పై బాల్ టాంపరింగ్ ఆరోపణలు వెల్లువెత్తాయి. దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ టెస్టులో అథర్టన్ బంతిని ఓ వస్తువుతో రుద్దాడని దక్షిణాఫ్రికా ఆరోపించింది. అయితే ఆ ఆరోపణలు అథర్టన్ తిరస్కరించాడు. బంతిపై ఉన్న మట్టిని తుడిచే ప్రయత్నం చేశానని అథర్టన్ వాదించాడు. అథర్టన్‌పై బాల్ టాంపరింగ్ ఆరోపణలపై విచారణ జరగనప్పటికీ ఈ వివాదంలో రెండు వేల పౌండ్ల జరిమానాగా అథర్టన్ చెల్లించాడు. కెప్టెన్‌గా తప్పుకోవాలన్న డిమాండ్‌ను కొట్టిపారేశాడు. మరో నాలుగేళ్ల పాటు ఇంగ్లండ్ జట్టుకు సారథ్యం వహించాడు

#### వకార్ యూనిస్ (పాకిస్తాన్ -శ్రీలంక 2002)



బాల్ టాంపరింగ్ కారణంగా నిషేధానికి గురైన తొలి బౌలర్ వకార్ యూనిస్ 2002లోశ్రీలంకతో జరిగిన వన్డేలో వకార్ బంతిపై కుట్లను తొలగిస్తున్నాడని తేలడంతో ఒక మ్యాచ్ నిషేధం ఎదుర్కొన్నాడు.

#### షాహిద్ అఫ్రిది: (ఆస్ట్రేలియా -పాకిస్తాన్ 2010)

పెర్త్‌లో ఆస్ట్రేలియాతో 2010లో జరిగిన వన్డేలో బాల్ టాంపరింగ్ చేశాడని తేలడంతో పాకిస్తాన్ కెప్టెన్ అఫ్రిదిపై రెండు మ్యాచ్‌ల నిషేధం పడింది.





## రోడ్డు ప్రమాదంలో షమికి గాయాలు

డెహ్రాడూన్ : భారత జట్టు పేస్ బౌలర్ మహ్మద్ షమి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం ఉదయం డెహ్రాడూన్ నుంచి ఢిల్లీకి కారులో వెళుతుండగా వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో షమి తలకి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే షమిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. తలకు కుట్లు పడినట్లు వైద్యులు తెలిపారు. షమి ప్రస్తుతం డెహ్రాడూన్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. షమి భార్య హసీన్ జహాన్ సంచలన ఆరోపణల తర్వాత బీసీసీఐ షమికి కాంట్రాక్టులో స్థానం కల్పించలేదు. అనంతరం బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం దర్యాప్తులో షమి ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేలడంతో బీసీసీఐ 'బి' గ్రేడ్ కాంట్రాక్టులో చోటు కల్పించారు. ఆ దర్యాప్తు అనంతరం ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆడేందుకు షమికి మార్గం సుగమమైంది. వేలంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ షమిని రూ.3కోట్లకు దక్కించుకుంది.

## ఫెదరర్ నంబర్ వన్ ర్యాంకుకు ముప్పు

### 175వ ర్యాంక్ ఆటగాడి చేతిలో ఓటమి



మియామి: స్విస్ టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్ నంబర్ వన్ ర్యాంకు ప్రమాదంలో పడింది. మియామిలో జరుగుతున్న మియామి మాస్టర్స్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ రెండో రౌండ్‌లో ఫెదరర్ ప్రపంచ 175వ ర్యాంక్ ఆటగాడు కోకినాస్ చేతిలో 6-3, 3-6, 7-6(7-4) స్కోరుతో ఓటమి పాలయ్యాడు. ఈ టోర్నీలో వైల్డ కార్డ్ ఎంట్రీ తో ఆడుతున్న కోకినాస్ 20 గ్రాండ్‌శ్లామ టైటిళ్లను గెలుచుకున్న ఫెదరర్‌ను ఓడించటం పెను సంచలనమైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రోటర్‌డామ్ ఓపెన్‌లో విజయం సాధించి మళ్లీ నంబర్ వన్ స్థానానికి చేరుకున్న ఫెదరర్‌కు ఈ ఓటమి పెద్ద షాకిచ్చింది. తాజా ఓటమితో ఫెదరర్ నంబర్ వన్ ర్యాంక్ ప్రమాదంలో పడింది.



## రషీద్‌ఖాన్‌కు 100 వికెట్లు

హరారే : వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన ఫైనల్లో లో అఫ్గానిస్తాన్ బౌలర్ రషీద్ ఖాన్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 100 వికెట్లు సాధించిన బౌలర్‌గా రికార్డు నమోదు చేశాడు. 44 మ్యాచ్‌ల్లోనే రషీద్ ఖాన్ ఈ ఘనతను అందుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ 52 మ్యాచుల్లో ఈ ఘనత సాధించి ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా..తాజా మ్యాచ్‌తో రషీద్ ఖాన్ ఆ రికార్డును అధిగమించాడు. 23 ఓవర్ చివరి బంతికి విండీస్ ఆటగాడు షైప్‌ను ఎల్బీడబ్ల్యూ చేసి రషీద్‌ఖాన్ 100 వికెట్ల క్లబ్‌లో చేరాడు. ముస్తాక్ (పాకిస్తాన్) 53, షేన్ బాండ్ (న్యూజిలాండ్) 54, బ్రెట్‌లీ(ఆస్ట్రేలియా) 55 మ్యాచుల్లో ఈ ఘనతను అందుకోని తరువాతి స్థానాల్లో ఉన్నారు. ఇక భారత్ నుంచి 59 మ్యాచుల్లో ఇర్ఫాన్ పఠాన్ ఈ ఫీట్‌ను సాధించి వకార్ యూనిస్(పాకిస్తాన్), మోర్కెల్ (దక్షిణాఫ్రికా)లతో సమంగా 8వ స్తానంలో నిలిచాడు. ఇక రషీద్ ఖాన్ ఈ సీజన్‌లో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున బరిలోకి దిగుతున్నాడు.

## కోహ్లీ ఇచ్చిన బ్యాట్‌తో 15 ఫోర్లు, 5 సిక్స్‌లు

### యాట్ సెంచరీ ● భారత్‌కు తప్పని ఓటమి

ముంబాయి: ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత మహిళా జట్టు మరో ఓటమి చవిచూసింది. భారత బ్యాట్స్‌ఉమెన్ స్మృతి మంధాన, మిథాలీలు హాఫ్ సెంచరీలతో 199 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్ధేశించినా ఇంగ్లండ్ జట్టు సునాయసంగా విజయం సాధించింది. ఇంగ్లండ్ ఓపెనర్ డానియెల్లి యాట్ 124 (64 బంతుల్లో 15 ఫోర్లు, 5 సిక్సర్లు) చెలరేగి భారీ శతకంతో బాదటంతో భారత మహిళల లక్ష్యం చిన్నబోయింది. యాట్ ఈ సిరీస్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ బహుమతిగా ఇచ్చిన బ్యాట్‌తో ఆడతానని ముందే ప్రకటించింది. ఆ బ్యాట్‌తోనే కోహ్లీలా వీరవిహారం చేసింది. డానియెల్లికి అండగా బీయుమెంట్ 35(23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సు) నిలిచింది. చివర్లో టామీ అవుటైనా హెథర్ (8) టార్గెట్‌ను పూర్తి చేసింది. దీంతో ఇంగ్లండ్ 8 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకోంది. టీ20ల్లో ఇది అత్యధిక పరుగుల ఛేదనగా రికార్డుకెక్కగా.. 52 బంతుల్లోనే డానియెల్లి రెండో ఫాస్టెస్ట్ సెంచరీ చేసింది. ఇక ఈ మ్యాచ్‌లో భారత మహిళా జట్టు 4 వికెట్లు కోల్పోయి 198 పరుగుల భారీ స్కోర్ చేసింది. మహిళల అంతర్జాతీయ టీ20ల్లో ఇది రెండో అత్యధిక స్కోర్.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.